Rni Title Code No. TELTEL02115

# గరుడ వార్త

తెలుగు దినపత్రిక

www.garudavarthanews.com
www.garudavarthanews.in

సంపుటి : 2 సంచిక : 181 మేడ్చల్ మల్కాజ్‌గిరి 23 జూలై 2024 మంగళవారం పేజీలు : 4

## ఉద్యోగాల భర్తీలో కోటాల రద్దు

ఢాకా : బంగ్లాదేశ్ వ్యాప్తంగా తీవ్ర హింసాకాండకు దారి తీసిన రిజర్వేషన్లపై ఆ దేశ సుప్రీంకోర్టు కీలక తీర్పును వెలువరించింది. మహిళలు, వెనుకబడిన జిల్లాలకు ఇస్తున్న రిజర్వేషన్లను పూర్తిగా తొలగించటమేగాక.. సమరయోధుల కుటుంబీకులకు ఇస్తున్న 30% రిజర్వేషన్‌ను 5 శాతానికి తగ్గించింది. మైనారిటీలకు, దివ్యాంగుల కోటాను కేవలం 2 శాతానికి పరిమితం చేసింది. ప్రభుత్వ ఉద్యోగాలలో 93% ఖాళీలను ప్రతిభ ఆధారంగా భర్తీ చేయాలని, మిగిలిన 7 శాతంలో 5% సమర యోధుల కుటుంబాలకు, 2% దేశంలోని మైనారిటీలు, ట్రాన్స్‌జెండర్లు, దివ్యాంగులకు కేటాయించాలని తీర్పు చెప్పింది. కోటాల రద్దు కోసం విద్యార్థుల ఉద్యమానికి నేతృత్వం వహిస్తున్న విద్యార్థి సంఘాలు సుప్రీంకోర్టు తీర్పును స్వాగతిస్తూనే, రిజరేషన్లను పూర్తిగా రద్దు చేసే వరకూ తమ ఉద్యమాన్ని కొనసాగిస్తామని ప్రకటించాయి. మరోవైపు, దేశంలో నెలకొన్న పరిస్థితులపై ప్రధాని షేక్‌హసీనా త్రివిధ దళాల అధిపతులతో సమీక్ష జరిపారు.

# నేడే 2024 కేంద్ర బడ్జెట్

# నిర్మలమ్మ వరాలు కురిపిస్తారా!?



ఇటీవలే దేశంలో సార్వత్రిక ఎన్నికలు ముగిశాయి. ఈ క్రమంలోనే ముచ్చటగా మూడోసారి ఎన్డీయే ప్రభుత్వం కేంద్రంలో కొలువు తీరిన సంగతి తెలిసింది. ప్రధాన మంత్రిగా నరేంద్రమోదీ బాధ్యతలు స్వీకరించగా..అలానే ఆర్థిక మంత్రిగా నిర్మలా సీతారామన్ మరోసారి బాధ్యతలు స్వీకరించారు. ఈ క్రమంలోనే కొత్త ప్రభుత్వం ఏర్పడిన తరువాత తొలిసారి కేంద్రం బడ్జెట్ ప్రవేశ పెట్టనుంది. జూలై 23వ తేదీన పార్లమెంట్ లో వార్షిక బడ్జెట్ ను ప్రవేశ పెట్టనున్నారు. ఈ క్రమంలోనే బడ్జెట్ ఎలా ఉండబోతుందా అని అందరు ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. ఆర్థిక బడ్జెట్-2024లో ఎవరికి తీపి కబురు, ఎవరికి చేదు వార్త ఉండనుందనే ప్రశ్నలు వ్యక్తమవుతున్నాయి. అలానే మిత్రపక్షాల అజెండాకు అనుగుణంగా సంక్షేమానికి పెద్దపీట వేస్తుందా? ఈ ప్రశ్నకు బడ్జెట్ లోనే సమాధానం లభించే అవకాశం ఉంది. ఈ క్రమంలో రేపు ప్రవేశపెట్టనున్న బడ్జెట్ పై ఆర్థిక నిపుణులు పలు అభిప్రాయాలు వ్యక్తం చేశారు. ఈ బడ్జెట్ కి సంబంధించి పూర్తి స్టోరీ ఇప్పుడు చూద్దాం... ఇటీవల పార్లమెంట్-2024 ఎన్నికలు జరిగిన సంగతి తెలిసింది. ఆ సమయంలో అప్పటి ఎన్డీయే ప్రభుత్వం ఫిబ్రవరి 1వ తేదీన మధ్యంతర బడ్జెట్ ప్రవేశపెట్టింది. ఆ ఓటాన్ అకౌంట్ త్వరలో ముగియనుండటంతో ఇప్పుడు పూర్తి స్థాయి బడ్జెట్ ప్రవేశపెట్టనుంది. బీజేపీ నేతృత్వంలోని ఎన్డీయే మూడో సారి అధికారం చేపట్టిన తర్వాత ప్రవేశపెడుతున్నమొదటి బడ్జెట్ కావడంతో అత్యంత ప్రాధాన్యంత సంతరించుకుంది. లోక్‌సభ-2024 ఎన్నికల్లో బీజేపీకి సీట్లు తగ్గిన క్రమంలో ప్రజలకు చేరువయ్యేందుకు ఈసారి కీలక నిర్ణయాలు తీసుకునే అవకాశం ఉందన్న ఆర్థిక నిపుణులు అంచనా వేస్తున్నారు. కేంద్ర బడ్జెట్ 2024 సమావేశాలు నేటి నుంచి ప్రారంభం కానున్నాయి. ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ 2024-25కి సంబంధించిన బడ్జెట్‌ను జూలై 23 మంగళవారం ఉదయం 11:00 గంటలకు లోక్ సభలో ప్రవేశ పెట్టనున్నారు. లోక్‌సభలో మోదీ 3.0 ప్రభుత్వేం తొలిసారి పూర్తి స్థాయి బడ్జెట్‌ను ప్రవేశపెట్టనుంది. ఇక ఈ బడ్జెట్ లో ప్రధానంగా ఉద్యోగాలు, గ్రామీణ ఆర్థిక వ్యవస్థ, మ్యానుఫ్యాక్చరింగ్ సెక్టర్ పై కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు తెలుస్తోంది. తయారీ రంగంలో కొత్త కంపెనీల కోసం గతంలో ప్రకటించిన లాభదాయక ట్యాక్స్ విధానాన్ని పొడిగించాలన్న డిమాండ్ గట్టిగా విన్పిస్తోంది. దీంతో మ్యానుఫ్యాక్చరింగ్ సెక్టర్ పై కేంద్రం ప్రత్యేకంగా ఫోకస్ పెట్టినట్లు తెలుస్తోంది. అదే విధంగా ఉపాధికల్పనపై బడ్జెట్‌లో ఎక్కువ ఫోకస్ పెట్టే అవకాశం ఉంది. ఈసారి బడ్జెట్‌లో నిరుద్యోగ సమస్య పరిష్కారం దిశగా కూడా అడుగులు వేయాలని యువత కోరుకుంటుంది. ఈ అంశాలపై కొన్ని ప్రత్యేక ప్రకటనలు ఉండొచ్చని ఆర్థిక నిపుణులు అభిప్రాయపడుతున్నారు. అలానే పెట్రోలియం ఉత్పత్తులను జీఎస్టీ పరిధిలోకి తీసుకురావాలని బడ్జెట్లో ప్రతిపాదించే ఛాన్స్ ఉన్నట్లు తెలుస్తోంది. విదేశాల నుంచి దేశంలోకి దిగుమతి అవుతున్న ఆయా ముడి సరకులపై భారీ సుంకాలు పెను భారంగా మారాయని వాదనలు వినిపిస్తోన్నాయి. దీంతో ముడి సరుకులు, పదార్ధాలపై పన్నులు తగ్గించడం వంటివి కూడా ఉండవచ్చని ఆర్థిక నిపుణులు అభిప్రాయపడుతున్నారు. లిస్టెడ్ ఈక్విటీ షేర్లపై దీర్ఘకాలిక మూలధన లాభాల పన్ను కనీస హెూల్డింగ్ వ్యవధిని ప్రస్తుత ఏడాది నుంచి 2 లేదా 3 ఏళ్లకు పొడిగించే అంశాన్ని కేంద్ర ప్రభుత్వం పరిశీలిస్తోందని సమాచారం. ఇఇదే సమయంలో పారిశ్రామిక రంగాన్నికి, ఆటోమెబైల్ రంగానికి ఊరట కల్పించే అవకాశం ఉంది. పునరుత్పాదక ఇంధనం, ఎలక్ట్రిక్ వెహికల్, ఇతర గ్రీన్ సాంకేతికలతో ఇన్వెస్ట్ మెంట్ పెట్టే కంపెనీలకు పన్ను రాయితీలు కల్పించే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. దీంతో గ్రీన్ హైడ్రోజన్ ప్రాజెక్టులలో గణనీయమైన పెట్టుబడులకు అవకాశం ఉంది. భారతదేశంలో కాలుష్య తీవ్రతను తగ్గించడమే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకునే ఛాన్స్ ఉంది. మొత్తం మీద వికసిత భారత్ అనే నినాదంతో ముందుకెళ్తున్న ఎన్డీయే ప్రభుత్వం అలాంటి అభివృద్ధి కోసం కీలక నిర్ణయాలు తీసుకునే అవకాశం ఉందని ఆర్థిక నిపుణులు భావిస్తున్నారు. మరి.. కేంద్ర ఆర్థిక బడ్జెట్-2024 గురించి పూర్తిగా తెలియాలంటే..రేపటి వరకు ఎదురు చూడాల్సిందే.

# రైల్వే బడ్జెట్: రైలు పరుగు.. సామాన్యుడి వైపా? అభివృద్ధి వైపా?



బుల్లెట్ వేగం.. మెరుగైన సదుపాయాలతో ఇతర దేశాల్లో రైళ్లు దూసుకెళుతుంటే.. ఒకప్పుడు 'ఇవి మనకు సాధ్యమేనా?' అన్న ప్రశ్నకు 'వందే భారత్' రైళ్ల రూపంలో సమాధానం దొరికింది. అమృత్ భారత్ పథకం కింద రైల్వేస్టేషన్ల అభివృద్ధీ ఊపందుకుంది. అదే సమయంలో కిక్కిరిసిన రైళ్లు.. వరుస రైలు ప్రమాదాలు మన రైల్వే వ్యవస్థను వెక్కిరిస్తున్నాయి. దీంతో భద్రత, రైళ్ల సామర్థ్యం పెంపుపై దృష్టి సారించాల్సిన పరిస్థితి నెలకొంది. వరుసగా మూడోసారి అధికారంలోకి వచ్చిన మోదీ సర్కారు.. ఈసారి బడ్జెట్‌లో అభివృద్ధికి జై కొడుతుందా? సామాన్యుల సమస్యలపై దృష్టి సారిస్తుందా?

**వరుస ప్రమాదాలు :** రైల్వే ప్రమాదాలు తగ్గుముఖం పట్టాయనుకున్నవేళ గతేడాది ఒడిశాలోని బాలేశ్వర్ సమీపంలో జరిగిన ఘోర రైలు ప్రమాదం రైల్వే చరిత్రలో మాయనిమచ్చగా నిలిచింది. అక్కడికి కొద్ది రోజులకే విజయనగరం దగ్గర మరో ఘటన, తాజాగా పశ్చిమబెంగాల్‌లోని కాంచన్‌జంగ్ ఎక్స్‌ప్రెస్ ప్రమాదానికి గురికావ డం.. రైల్వేలో భద్రతపై ప్రశ్నలు లేవనెత్తుతోంది. ముఖ్యంగా రైళ్లు పరస్పరం ఢీకొట్టకుండా ఉండేందుకు కవచ్ భద్రతా వ్యవస్థను అభివృద్ధి చేసినా.. ఆచరణలో మాత్రం ఎక్కడ వేసిన గొంగలి చందంగా మారింది. దీంతో రైలు ప్రమాదం జరిగిన ప్రతిసారీ ఈ అంశం తెరపైకి వస్తూనే ఉంది. పరిమిత సంఖ్యలో లోకోమోటివ్‌లకే ఈ భద్రతా వ్యవస్థను అమర్చారని, ఇంకా చాలా వాటిలో అమలుపరచాల్సిన అవసరం ఉందని తెలుస్తోంది.

**కిక్కిరిసిన బోగీలు.. వెయిటింగ్ లిస్టులు :** దేశంలో అత్యాధునిక సదుపాయాలతో వందే భారత్ రైళ్లు మెరుగైన ప్రయాణ సదుపాయాన్ని అందిస్తుంటే.. మరోవైపు కిక్కిరిసిన రైళ్లకు సంబంధించిన దృశ్యాలు సామాజిక మాధ్యమాల్లో ఎప్పటికప్పుడు వైరల్‌గా మారుతున్నాయి. వేసవిలో సరిపడా రైళ్లు లేక పలుచోట్ల స్లీపర్, ఏసీ బోగీలు కూడా జనరల్ టికెట్ ప్రయాణికులతో నిండిపోయిన దృశ్యాలు కనిపించాయి. ప్రస్తుతం రోజుకు 10,700 రైళ్లు ఏటా 700 కోట్ల మందిని గమ్యస్థానానికి చేరుస్తున్నాయి. 2030 నాటికి ఆ సంఖ్య వెయ్యి కోట్లకు చేరే అవకాశం ఉంది. అప్పటికల్లా వెయిటింగ్ లిస్ట్ లేకుండా చేయాలని కేంద్రం లక్ష్యంగా పెట్టుకుంది. ఆ లక్ష్యాన్ని చేరుకోవాలంటే సాధారణ రైళ్లను భారీగా పెంచాల్సి ఉంది. ఈ నేపథ్యంలో రాబోయే రెండేళ్లలో 10 వేల నాన్-ఏసీ కోచ్‌ను అందుబాటులోకి తీసుకురానున్నట్లు రైల్వేశాఖ మంత్రి అశ్వనీ వైష్ణవ్ ఇటీవల ప్రకటించడం గమనార్హం.

**లోకో పైలట్లపై పని భారం :** సరిపడినంతమంది సిబ్బంది లేకపోవడం వల్ల రైల్వే లోకో పైలట్లపై విపరీతమైన పనిభారం ఉంటోందన్న విమర్శలు ఇటీవల వెల్లువెత్తాయి.

ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ కూడా కొందరు లోకో పైలట్లతో ఇటీవల భేటీ అనంతరం ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు. ఈనేపథ్యంలో అసిస్టెంట్ లోకో పైలట్ల సంఖ్యను 18 వేలకు పెంచనున్నట్లు రైల్వే శాఖ ప్రకటించింది. దీనివల్ల వేతన బిల్లు మరింత భారం కానుంది.

**బడ్జెట్ అంచనాలు ఇవీ.. :** ఓవైపు ఆధునిక సదుపాయాలు కోరుకునే మధ్యతరగతి కలలను సాకారం చేస్తూ.. మరోవైపు భద్రతకు, సామాన్యుడికి రైలు ప్రయాణాన్ని చేరువ చేయడం ఇప్పుడు ప్రభుత్వం ముందున్న సవాల్. 2022-23లో రైల్వేకు రూ.1.40 లక్షల కోట్లు కేటాయించగా.. 2023-24 ఆర్థిక సంవత్సరంలో ఈ పద్దు కింద రూ.2.42 లక్షల కోట్లు కేటాయించారు. మొన్నటి తాత్కాలిక బడ్జెట్‌లో 2.55 లక్షలు కోట్లు కేటాయింపులు జరిపారు.

ఈసారి బడ్జెట్‌లో సామర్థ్యం పెంపు, భద్రతకు పెద్దపీట వేయొచ్చన్న అంచనాలు వినిపిస్తున్నాయి. మరి జులై 23న ఆర్థిక మంత్రిగా నిర్మలమ్మ దేనికి జై కొడతారో వేచి చూడాలి!!



## నూతన చట్టాలపై మీ వైఖరి చెప్పాల్సిందే

హైదరాబాద్ : దేశంలో అమలులోకి వచ్చిన నూతన న్యాయ చట్టాల పైన రాష్ట్ర ప్రభుత్వం తన వైఖరి వెల్లడించాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ డిమాండ్ చేశారు. ఈ మేరకు ప్రభుత్వానికి కేటీఆర్ బహిరంగ లేఖ రాశారు. వివిధ వర్గాల నుంచి కొత్త న్యాయ చట్టాలపై తీవ్ర అభ్యంతరాలు వ్యక్తమవుతున్నాయన్నారు. ఈ చట్టాలలో ఉన్న పలు నిబంధనలు, సెక్షన్లు ప్రజల ప్రాథమిక హక్కులకు విఘాతం కలిగించేలా, వ్యక్తి స్వేచ్ఛను హరించేలా ఉన్నాయన్నారు. నూతన చట్టాల్లో పేర్కొన్న అనేక సెక్షన్ల వల్ల రాష్ట్రంలో పోలీస్ రాజ్యాన్ని తీసుకు వచ్చే ప్రమాదం ఉందన్నారు. ఇప్పటికే పశ్చిమ బెంగాల్, తమిళనాడు, కర్నాటక ముఖ్యమంత్రులు ఈ చట్టాల అమలును వ్యతిరేకిస్తున్నారని తెలిపారు. నూతన చట్టాలపైన విస్తృతంగా చర్చ జరగాల్సిన అవసరం ఉన్న నేపథ్యంలో వీటిపైన తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వంతో పాటు, ఇక్కడి కాంగ్రెస్ పార్టీ తన వైఖరిని వెల్లడి చేయాలని డిమాండ్ చేశారు. ప్రజా ఉద్యమాలకు దశాబ్దాలుగా కేరాఫ్ అడ్రస్‌గా ఉన్న తెలంగాణ గడ్డపైన నిరంకుశ నియంతృత్వ నూతన క్రిమినల్ చట్టాలను ఇక్కడ యధాతథంగా అమలు చేయడమే రాష్ట్ర సర్కారు లక్ష్యమా.. లేక తమిళనాడు, కర్నాటక, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాల మాదిరిగా సవరణలు తీసుకొస్తారా అనే విషయాన్ని ఈ అసెంబ్లీ సమావేశాల్లో స్పష్టం చేయాలన్నారు.

# నేటి నుండి తెలంగాణ అసెంబ్లీ

# చర్చలు లేవ్.. అరుపులు.. కేకలే!?

## అధికార పార్టీని ఇరుకున పెట్టేందుకు బీఆర్ఎస్ కసరత్తు!

## ధీటుగా ఎదుర్కొనేందుకు రేవంత్ సైన్యం సన్నద్ధం!!



హైదరాబాద్ : తెలంగాణ అసెంబ్లీ సమావేశాలు మంగళవారం నుంచి ప్రారంభం కానున్నాయి. దీనికి సంబంధించిన నోటిఫికేషన్ కూడా వచ్చేసింది. సర్కారు వైపు ప్రాధాన్యాలు సర్కారుకు ఉన్నాయి. ఇదే సమయంలో ప్రతిపక్ష బీఆర్ ఎస్ ప్రాధాన్యాలు బీఆర్ ఎస్‌కు ఉన్నాయి. దీంతో ఇరు పక్షాల మధ్య శాంతి యుత.. పార దర్శకమైన చర్చలు అయితే.. జరిగేలా కనిపించడం లేదు. అరుపులు, కేకలు.. గలాటాలు.. పోడియం ముట్టడులు.. ఇలా.. అనేక రూపాల్లో తెలంగాణ అసెంబ్లీ రచ్చకు రెడీ అవుతోందనే సంకేతాలు వస్తున్నా యి.

**సర్కారువారి వాదన:** రేవంత్ రెడ్డి ప్రభుత్వం తాజాగా ప్రారంభం కానున్న సమావేశాల్లో.. ఓటాన్ అకౌంట్ బడ్జెట్ స్థానంలో వచ్చే ఏడు మాసాలకు బడ్జెట్(ఆగస్టు నుంచి మార్చి-2025) ను ప్రవేశ పెట్టనుంది. ఇక.. ఇదే సమయంలో ప్రస్తుతం చేస్తున్న రైతు రుణమాఫీ అంశాన్ని ప్రధానంగా చర్చించనుంది.అదేవిధంగా రాబోయే రోజుల్లో ప్రవేశ పెట్టనున్న పథకాలు.. ప్రస్తుతం జరుగుతున్న అభివృద్ధి వంటివాటిని రేవంత్ రెడ్డి సర్కారు చర్చకు పెట్టే అవకాశం ఉంది. ఈ క్రమంలోనే సవాళ్లు-ప్రతి సవాళ్లపైనా సభలో చర్చ పెరిగే అవకాశం కనిపిస్తోంది.

**విపక్షం వ్యూహం..:** ఇక, విపక్షం బీఆర్ ఎస్‌ను గమనిస్తే.. చర్చలకు బదులుగా రచ్చలకు తెరదీసేందుకు రెడీ అవుతోంది. అంటే.. ఇప్పటికే తమ ఎమ్మెల్యేలను కాంగ్రెస్ పార్టీ చేర్చుకున్న నేపథ్యంలో వీరిపై వేటు వేయాలని స్పీకర్‌కు ఫిర్యాదు చేసిన.. బీఆర్ ఎస్ పార్టీ.. దీనిపై పట్టుబట్టే అవకాశం.. చర్చించేందుకు రచ్చ చేసే అవకాశం రెండూ కనిపిస్తున్నాయి. సహజంగానే కాంగ్రెస్ పార్టీ దీనికి అవకాశం ఇవ్వకపోవచ్చు. ఫలితంగా.. సభలో అరుపులు కేకలు కామన్ కానున్నాయి. అయితే.. గతంలో విపక్ష సభ్యులను సస్పెండ్ చేయబోమన్న సీఎం రేవంత్‌రెడ్డి.. ఇప్పుడు ఏం చేస్తారో చూడాలి.

అదేసమయంలో ఆగస్టు 15 లోపు ఆరు గ్యారెంటీలను అమలు చేయాల్సిందేనని పట్టుబడుతున్న బీఆర్ ఎస్ నాయకులు.. ఈ విషయాన్ని కూడా ప్రస్తావించే అవకాశం ఉంది.

ముఖ్యంగా హరీష్ రావు రాజీనామా వ్యవహారం సభలో ప్రధాన అంశంగా అధికార పక్షం వైపు నుంచి తెరమీదికి వచ్చినా ఆశ్చర్యం లేదని అంటున్నారు. సో.. ఎలా చూసుకున్నా.. తెలంగాణ అసెంబ్లీలో నిప్పులు కురిసే అవకాశం కనిపిస్తోంది.

# సంపాదకీయం

## అప్పుడు కూడా భయపెట్టే పార్టీలో చేర్చుకున్నారా కేటీఆర్?

తాము చేస్తే నీతి.. ఎదుటోడు చేస్తే అవినీతి అన్నట్లు మాట్లాడటంలో అర్థం లేదు. ఇప్పుడు తెలంగాణలో అలాంటి సీనే కనిపిస్తోంది. ఎన్నికల్లో ఓటమితో పదేళ్ల అధికారం చేజారి పోయిన గులాబీ పార్టీ.. రేవంత్ సర్కారు కొలువు తీరిన మూడో రోజునే.. ఆర్నెల్లకు మించి ఆ పార్టీ అధికారంలో ఉండదంటూ ప్రకటనలు చేయటం తెలిసిందే. ప్రభుత్వం కూలిపోతుందంటూ కూల్చే ప్రయత్నాలు ముమ్మరం చేసిన వేళ.. ప్రజలు ఎన్నుకున్న ప్రభుత్వాన్ని కాపాడుకునే ప్రయత్నం చేస్తున్నామన్న ముఖ్యమంత్రి రేవంత్ మాటల్లో తప్పు పట్టాల్సిన అవసరం ఏమిటి? తమ పార్టీకి చెందిన ఎమ్మెల్యేలను భయపెట్టి కాంగ్రెస్ పార్టీలో చేరుస్తున్నారంటూ గవర్నర్ ను కలిశారు బీఆర్ఎస్ ఎమ్మెల్యేల టీం. ఈ సందర్భంగా గవర్నర్ రాధాక్రిష్ణన్ కు వినతి పత్రం ఇస్తూ.. న్యాయం చేయాలని కోరారు. భయపెట్టి కాంగ్రెస్ పార్టీలో చేర్చారన్న వాదనను తెర మీదకు తీసుకొస్తున్న కేటీఆర్ అండ్ కో ఒక సూటి ప్రశ్నకు సమాధానం చెప్పాలి. పదేళ్ల కేసీఆర్ పాలనలో ప్రభుత్వం ఎన్నికైన రెండు దఫాలు.. విపక్షం నుంచి పోటీ చేసి గెలిచిన వారంతా కారు పార్టీలోకి ఎలా చేరినట్లు? కాంగ్రెస్ పార్టీలోకి ఈ రోజున భయపెట్టి చేర్చుకుంటే.. అప్పట్లో కారు పార్టీలో కూడా భయపెట్టే చేర్చుకున్నారా? అన్న ప్రశ్నకు సమాధానం చెప్పేదెవరు? నిజానికి గవర్నర్ కు తాజాగా వినతిపత్రం అందించిన గులాబీ ఎమ్మెల్యేల్లో అత్యధికులు.. కేసీఆర్ సర్కారు హయాంలో ఇతర పార్టీల నుంచి ఎమ్మెల్యేలుగా గెలిచి.. కారు పార్టీ తీర్థం పుచ్చుకున్న వారే. వినతిపత్రం ఇస్తూ ఫోటోకు ఫోజు ఇచ్చిన మాగంటి గోపీనాథ్.. వివేకానంద.. మల్లారెడ్డి.. సబితా ఇంద్రారెడ్డితో సహా పలువురు ఈ కోవలోకి చెందిన వారే. అప్పుడు గుర్తుకు రాని నీతి.. కేటీఆర్ కు ఇప్పుడే ఎందుకు గుర్తుకు వస్తుంది? నిజానికి రేవంత్ ప్రభుత్వం కొలువు తీరిన తర్వాత.. బాధ్యత కలిగిన ప్రతిపక్షంగా వ్యవహరిస్తూ.. పాలన చేసేందుకు వీలుగా కొంత కాలం వేచి చూసే ధోరణిని ప్రదర్శించినా.. ఆర్నెల్లలో ప్రభుత్వం పడిపోతుందని ఒకరంటే.. కాదు మూడు నెలల్లోనే ప్రభుత్వానికి నూకలు చెల్లుతాయంటూ పోటీ ప్రకటనలు చేయకుండా ఉండి ఉంటే.. రేవంత్ ప్రభుత్వం గులాబీ ఎమ్మెల్యేల్ని పార్టీలో చేర్చుకునే కార్యక్రమాన్ని తప్పు పట్టేవాళ్లు. ఓవైపు ప్రభుత్వం కూలిపోతుందంటూ అల్టిమేటం ఇచ్చినప్పుడు.. పార్టీలో చేర్చుకోవటానికి మినహా ఉండే అల్టర్ నేట్ ఇంకేం ఉంటుంది? చేసుకున్నోడికి చేసుకున్నంత అని ఊరికే అనరు కదా? ఈ చిన్న విషయాన్నికేటీఆర్ అండ్ కో ఎందుకు మర్చిపోతున్నట్లు?

## డ్రగ్స్ రహిత సమాజమే లక్ష్యంగా శామీర్ పేట పోలీసుల అవగాహన సదస్సు




శామీర్ పేట, జులై 22 (గరుడ వార్త) : డ్రగ్స్ నిర్మూలనకు యువకులు ముందుకు రావాల్సిన అవసరం ఉందని పేట్ బషీరాబాద్ ఏసిపి రాములు పిలుపునిచ్చారు. శామీర్‌పేట మండలం ఉప్పరపల్లి పరిధిలోని ఎక్సెలెన్సియా కళాశాలలో శామీర్ పేట పోలీస్ ఇన్స్పెక్టర్ శ్రీనాథ్ ఆధ్వర్యంలో డ్రగ్స్ వ్యతిరేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏసీబీ రాములు మాట్లాడుతూ మహమ్మారి మాదకద్రవ్యాలను సమూలంగా నిర్మూలించడానికి యువత, విద్యార్థులు ముందుకు రావాలని సూచించారు. ఈ మాదకద్రవ్యాలతో యువత పెడదారిన పడటంతో పాటు ఆరోగ్యం క్షీణిస్తుందని చెప్పారు. యువత మాదకద్రవ్యాలకు అలవాటు పడితే వాళ్ల జీవితం పూర్తిగా నాశనం అవుతుందని తెలిపారు. ఎక్కడైనా డ్రగ్స్, గంజాయి లాంటి మాదకద్రవ్యాలు విక్రయిస్తున్న, వాడుతున్న వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని చెప్పారు. మాదకద్రవ్యాలు విక్రయించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటానని హెచ్చరించారు. ఈ అవగాహన కార్యక్రమంలో 250 మంది



విద్యార్థులకు ఆడియో, వీడియో పరికరాలతో అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎస్సై హారిక, ఏఎస్ఐ, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. 250 మంది విద్యార్థులకు ఆడియో, వీడియో పరికరాలతో అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎస్సై హారిక, ఏఎస్ఐ, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## పరిసరాలను పరిశుభ్రంగా చేయగలిగినప్పుడే వ్యాధులను నిర్మూలించగలం





శామీర్ పేట, (గరుడ వార్త) : పరిసరాలను పరిశుభ్రంగా ఏర్పాటు చేసుకోవడం వలన వ్యాధులను రూపుమాపముగలమని మునిసిపల్ చైర్మన్ రాజేశ్వరరావు సూచించారు. సోమవారం శామీర్ పేట మండలం తుమ్ముకుంట మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ కమిషనర్ వెంకట గోపాల ఆధ్వర్యంలో సీజనల్ వ్యాధుల నివారణపై అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ పరిసరాల పరిశుభ్రత విషయంలో ప్రతి ఒక్కరు భాద్యతగా వ్యవహరించాలన్నారు. వార్డుల్లోని ప్రజలు తమ ఇంటి పరిసరాల్లో పిచ్చి మొక్కలను తొలగించి వర్షపు నీరు నిలువ లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. మున్సిపల్ పరిధిలో మెడికల్, మున్సిపల్, మెప్మా (ఎం ఈ పి ఎం ఎ) వారితో సంయుక్తముగా ఫీవర్ సర్వే చేయాలని ఆదేశించారు. పట్టణ ప్రజలు చెత్తను ఆరుబయట, రోడ్ల పై, చేరువులలో వేయకుండా కేవలం స్వచ్ఛ ఆటోలకే వేసేలా మున్సిపల్ సిబ్బంది చూడాలని తెలిపారు. నీరు నిలువ ఉన్న చోట ఆయిల్ బాల్స్ వేయాలని, చుట్టు బ్లీచింగ్ పౌడర్ చల్లాల్లని ఆదేశించారు. ప్రస్తుత వర్షాలు కురుస్తున్నందున ప్రజలు విద్యుత్ స్థంబాల వద్దకు వెళ్లరాదని, వాటిని తాకరాదని తెలిపారు. చెరువుల వద్ద, రోడ్ల పైన చెత్త వేస్తే జరిమానా విదిస్తామని హెచ్చరించారు. రోడ్ల పై స్పెషల్ శానిటేషన్ డ్రైవ్ నిర్వహించి రోడ్లకు ఇరువైపులా ఉన్న చెత్తను వెంటనే తొలగిస్తామని చెప్పారు. ఒక ప్రత్యేక షెడ్యూల్ తయారు చేసి అన్ని ప్రభుత్వ విభాగాలతో సంయుక్తముగా ప్రతి రోజు ఒక వార్డులో పర్యటించి స్థానిక సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి తగు చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రస్తుత వర్షాభావ పరిస్తితుల్లో విపత్తులను ఎదుర్కొనడానికి ప్రత్యేక ఎమర్జెన్సీ రెస్పాన్స్ టీంలను ఏర్పాటు చేసి నిరంతరమూ అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు, మున్సిపల్ మేనేజర్ శ్రవణ్ కుమార్, ఆర్ ఐ భాస్కర్, శానిటరీ ఇన్స్పెక్టర్ రేణుక, కార్యాలయ వార్డు ఆఫీసర్లు, జవాన్లు, శానిటేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాలలకు మహర్దశ




మిర్యాలగూడ : ప్రభుత్వ పాఠశాలలకు ఏటా వచ్చే అరకొర నిధులతో కనీసం సౌకర్యాలు కల్పించలేకపోతున్నారు. దీంతో విద్యాప్రమాణాలు తగ్గిపోతున్నాయనే ఉద్దేశంతో.. మౌలిక వసతుల కల్పనే లక్ష్యంగా ప్రారంభించిన ప్రధాన మంత్రి స్కూల్స్ ఫర్ రైజింగ్ ఇండియా (పీఎంశ్రీ) పథకం కింద రెండో విడత ఉమ్మడి జిల్లాలో పలు పాఠశాలలు ఎంపిక చేశారు. గతేడాది కేంద్ర ప్రభుత్వం పీఎంశ్రీ పేరుతో కొత్త పథకానికి శ్రీకారం చుట్టింది. మొదటి దశలో పలు పాఠశాలలు ఎంపిక చేయగా వాటికి నిధులు కేటాయించారు. ఉమ్మడి నల్గొండ జిల్లాలో రెండో విడత కింద 33 పాఠశాలలను ఎంపిక చేశారు. యూడైస్ ప్లస్ ప్రోగ్రాంలో నమోదైన సమాచారం ప్రకారం జిల్లాల వారీగా పీఎంశ్రీ పథకానికి ఎంపిక ప్రక్రియ చేపట్టారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు 60 రకాల ప్రశ్నావళిని పూరించారు. పాఠశాల ఫొటోలు, పంచాయతీ, పాఠశాల తీర్మాన ప్రతులను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలి. సొంత భవనం, అగ్ని ప్రమాదాల నుంచి రక్షణ, విద్యార్థుల నమోదు, మూత్రశాలలు, మరుగుదొడ్లు, తాగునీరు, చేతుల శుభ్రత, సరిపడే సంఖ్యలో ఉపాధ్యాయులు, విద్యుత్తు, గ్రంథాలయ వసతి, వంటి అంశాలను అందులో నింపారు. దాని ఆధారంగా మొదటి విడతలో జిల్లాలో 30 పాఠశాలలను ఎంపిక చేశారు. తాజాగా రెండో విడతలో 11 పాఠశాలలను ఎంపిక చేశారు.

నిధుల మంజూరు ఇలా..

ఎంపికైన పాఠశాలలకు నాలుగేళ్లలో రూ.లక్షల్లో నిధులు విడుదలకానున్నాయి. ఇందులో కేంద్రం 60 శాతం, రాష్ట్రం 40శాతం నిధులు అందిస్తుంది. ఈ నిధులతో పోషకాహారం, తాగునీటి వసతి, సౌర విద్యుత్తు, ప్రయోగశాలలు, అంతర్జాల సదుపాయం, డిజిటల్ బోధన, వృత్తి విద్యా కోర్సులు, ప్లాస్టిక్ రహితంగా తీర్చిదిద్దడం, డిజిటల్ గ్రంథాలయం, క్రీడా మైదానం, నైపుణ్యాభివృద్ధి పెంపునకు చర్యలు తీసుకోనున్నారు. పాఠశాల దశ నుంచే వృత్తివిద్యా కోర్సులను ప్రోత్సహిస్తారు. విద్యార్థి డిగ్రీకి వచ్చే సరికి ఏదో ఒక రంగంలో ఉపాధి పొందేలా తీర్చిదిద్దాలని జాతీయ విద్యావిధానం లక్ష్యం.

నల్గొండ జిల్లాలో ఎంపికైనవి.. టీఎస్‌డబ్ల్యూఆర్‌ఈఐఎస్ నకిరేకల్, జడ్పీ ఉన్నత పాఠశాల దేవరకొండ, జడ్పీ ఉన్నత పాఠశాల మిర్యాలగూడ, టీఎస్‌డబ్ల్యూఆర్‌ఈఐఎస్ గంధంవారిగూడెం, టీడబ్ల్యూఆర్‌ఈఐఎస్ అవంతిపురం, జడ్పీ ఉన్నత పాఠశాల కట్టంగూర్, టీఎస్‌ఎమ్‌ఎస్ బొత్తలపాలెం, జడ్పీ ఉన్నత పాఠశాల వెంకటేశ్వరనగర్, జడ్పీ ఉన్నత పాఠశాల తిప్పర్తి, జడ్పీ ఉన్నత పాఠశాల చిట్యాల, జడ్పీ ఉన్నత పాఠశాల బ్రాహ్మణవెల్లంల, ఎమ్‌పీపీఎస్ నోముల, గౌట్ పీఎస్ నాగార్జునసాగర్, ఎమ్‌పీపీఎస్ బాడయిగడ్డ, ఎమ్‌పీపీఎస్ కాసనగౌడ్ పాఠశాలలు రెండో విడత పీఎంశ్రీ పథకం కింద ఎంపిక చేశారు.
ఎంపికైన పాఠశాలల్లో అవసరమైన వాటిని గుర్తించి నివేదిక ఇస్తామని డీఈవో భిక్షపతి తెలిపారు.

## కొత్త పాసుపుస్తకాలు పొందిన రైతులు రైతు బీమా పథకం కొరకు దరఖాస్తు చేసుకోవాలి

శామీర్ పేట, (గరుడ వార్త) : కొత్త పాసు పుస్తకాలు పొందిన రైతులు రైతు బీమా పథకం కొరకు దరఖాస్తు చేసుకోవాలని మూడు చింతలపల్లి మండల వ్యవసాయ అధికారి కృష్ణవేణి సోమవారం తెలిపారు. రైతు భీమా పథకం 2024 సంవత్సరానికి గాను కొత్తగా పట్టా పాసుపుస్తకాలు పొందిన రైతు ధరఖాస్తు చేసుకోవాలని సూచించారు. జూన్ 28, 2024 వరకు పట్టా పాసుపుస్తకాలు పొందిన రైతులు దీనికి అర్హులని చెప్పారు. ఈ ధరఖాస్తుకు ఆగష్టు 5 చివరి తేదని, రైతుభీమాకు



ధరఖాస్తు చేసుకోనే రైతులు పట్టాదారు పాసుపుస్తకం, ఆధార్ కార్డు, నామినీ ఆధార్ కార్డు, ధరకాస్తు ఫారం మూడుచింతలపల్లి రైతు వేదికలో ఇవ్వాలని చెప్పారు. ఈ పథకానికి ఆధార్ కార్డులో 18 సంవత్సరాల నుండి 59 సంవత్సరాల వయస్సు గల రైతులు అర్హులన్నారు. గతంలో భీమా ఉన్న రైతులు మరలా ధరఖాస్తు చేసుకోవలసిన అవసరం లేదని తెలిపారు. ఏమైనా మార్పులు చేసుకో దలిసిన వారు ఈనెల 30 లోగా చేసు కోవాలని సూచించారు. కొత్తగా పాసుపుస్తకాలు పొందిన రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## జిల్లా అదనపు కలెక్టరుగా రాధికా గుప్తా...

### అభినందనలు తెలిపిన జిల్లా కలెక్టర్ గౌతం...



జిల్లా బ్యూరో మేడ్చల్ మల్కాజ్గిరి (గరుడ వార్త) : మేడ్చల్ మల్కాజ్ గిరి జిల్లా అదనపు కలెక్టరు (లోకల్ బాడీస్)గా రాధికా గుప్తా సొమవా రం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం జిల్లా కలెక్టర్ గౌతం ను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసారు. అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి, డి ఆర్ ఓ హరిప్రియలు అమెకు అభినందనలు తెలిపారు.

## అత్యవసర దందా

హైదరాబాద్: వర్షాకాల అత్యవసర బృందాల ఏర్పాటు పనుల్లో కొందరు జీహెచ్ఎంసీ ఇంజినీర్లు చేతివాటాన్ని ప్రదర్శించారు. బినామీ గుత్తేదారులకు కాంట్రాక్టులు అప్పగించాలన్న ఉద్దేశంతో అధికార దుర్వినియోగానికి పాల్పడ్డారు. అందుకోసం రూ.లక్షల్లో లంచం తీసుకున్నారన్న ఆరోపణలున్నాయి. వర్షాకాలంలో ప్రజలకు ఇబ్బంది కలగకూడదన్న లక్ష్యంతో జీహెచ్ఎంసీ ఏటా రూ.కోట్లు వెచ్చిస్తుంటే.. సహాయక చర్యలను నామమాత్రంగా చేపడుతున్న ఇంజినీర్లు ఖజానాకు కన్నం వేస్తున్నారు.

ఎవరెవరంటే..: వర్షాకాల సహాయక చర్యల కోసం ఈ నెల 24న కూకట్‌పల్లి సర్కిల్ ఇంజినీరు అయిదు డివిజన్లకు ఒక్కో టెండరు నోటిఫికేషన్ ఇచ్చారు. వాటిలో రెండు డివిజన్ల పనులను ఆ ఇంజినీరు బినామీ గుత్తేదారుకు అడ్డదారిలో ఇచ్చారన్న ఆరోపణలున్నాయి. దాంతో ఆయనకు పనులను అప్పగించలేదంటూ ఆ రెండు డివిజన్లకు గురువారం మళ్లీ టెండరు నోటిఫికేషన్ ఇచ్చారు. అంతవరకు బాగానే ఉన్నా 29న జారీ చేసిన మూడు టెండర్ల నోటిఫికేషన్లను కూడా సర్కిల్ కార్యనిర్వాహక ఇంజినీరు ఎలాంటి కారణం లేకుండా రద్దు




చేసి మళ్లీ నోటిఫికేషన్ ఇవ్వడం వివాదానికి దారితీసింది. ఈ విషయమై ఈఈ చిన్నారెడ్డిని వివరణ కోరగా నిబంధనల ప్రకారమే టెండర్లను రద్దు చేసి కొత్తగా పిలిచామని తెలిపారు.

చందానగర్ సర్కిల్ కోసం అయిదు నోటిఫికేషన్లకు పలువురు దరఖాస్తు చేసుకున్నారు. వాటిని పక్కనపెట్టి గురువారం మళ్లీ టెండరు నోటిఫికేషన్ ఇవ్వడంతో విమర్శలు వచ్చాయి. ఆ తప్పును దిద్దుకునేందుకు.. ఉన్న టెండరు నోటిఫికేషన్లు అన్నీ రద్దు చేసి పాత నోటిఫికేషన్‌కు వచ్చిన దరఖాస్తులను ఆమోదించారు.

# అపార నష్టం.. సాయం అంతంతే!

ధర్మపురి : గోదావరినది తీర ప్రాంతంలో వరదల భయంతో ప్రజలు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. ఏటా వరదల సమయంలో బిక్కుబిక్కుమంటూ కాలం వెళ్లదీస్తున్నారు. నదికి వరద పోటెత్తిందంటే చాలు ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని జీవిస్తున్నారు. ధర్మపురి మంగళిగడ్డపై సుమారు వంద మందికి పైగా చిరు వ్యాపారులు భక్తులకు పూజా సామగ్రి విక్రయిస్తూ ఉపాధి పొందుతున్నారు. గోదావరినది తీర ప్రాంత గ్రామాలైన రాయపట్నం, తిమ్మాపూర్, ధర్మపురి, దమ్మన్నపేట, రాజారం, జైన, దొంతాపూర్, ఆరెపల్లిలో గత ఏడాది వరద ప్రవాహం వల్ల ప్రజలకు అపారనష్టం వాటిల్లింది. సుమారు 269 ఇళ్లు దెబ్బతిన్నా ప్రభుత్వం ఎలాంటి సాయం మంజూరు చేయలేదని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ధర్మపురి గోదావరి తీరంలో వరద పోటెత్తడంతో చిరు వ్యాపారులకు సంబంధించిన రూ.లక్షల విలువైన సామగ్రి నీటిపాలైంది. అప్పట్లో ఒక్కరికి కేవలం రూ.3800ల పరిహారం ఇచ్చి చేతులు దులుపుకొన్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. అన్ని రకాలుగా ఆదుకుంటామని ప్రకటించినా నేటికీ ఎటువంటి చర్యలు చేపట్టలేదు. ప్రభుత్వం ప్రకటించిన రూ.5 వేల ఆర్థికసాయం చాలామంది వరద బాధితులకు అందలేదు.

**కంటి తుడుపు చర్య** – బొమ్మకంటి రమ్య, వరద బాధితురాలు

గత ఏడాది గోదావరి వరదల కారణంగా మేము సర్వం కోల్పోయాం. విలువైనసామగ్రి అంతా ఇక్కడే ఏర్పాటు చేసుకుని చిరు వ్యాపారం కొనసాగిస్తున్నాం. రెక్కాడితే డొక్కాడని బతుకులు మావి. ఇదే వ్యాపారంతో కుటుంబ పోషణ ఉంటుంది. వరదల్లో ఫ్రిజ్, విలువైన సామగ్రి



అంతా కొట్టుకు పోయింది. అధికారులు వచ్చి ఆదుకుంటామన్నారు. కంటి తుడుపుగా కేవలం రూ.3800 మాత్రమే అందజేశారు. ప్రభుత్వం మాలాంటి పేదలకు శాశ్వత ఇంటి నిర్మాణం చేపట్టి ఇవ్వాలి.

**కార్యాలయాల చుట్టూ తిరిగినా ఫలితం లేదు**

– సత్యనారాయణ, చిరు వ్యాపారి

మా దుకాణంలో బొమ్మలు, గాజులు, ఫొటోలు విక్రయిస్తాం. వరద విషయంలో అధికారులు ముందస్తుగా తమకు ఎలాంటి సమాచారం ఇవ్వలేదు. దుకాణంలోని సామగ్రి అంతా వరదపాలైంది. మాకు ఇబ్బందులు లేకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి. శాశ్వత నిర్మాణాలు చేపట్టాలి. సాయంకోసం ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరిగినా ఎలాంటి ఫలితం ఉండటం లేదు.

**ప్రభుత్వం ఆదుకోవాలి**

– నర్సయ్య, చిరు వ్యాపారి, ధర్మపురి

ధర్మపురి మంగళిగడ్డ వద్ద చిరు వ్యాపారులు సుమారు వంద మంది కొబ్బరి కాయలు, ఇతర సామగ్రి విక్రయిస్తూ ఉపాధి పొందుతున్నారు. ఏటా వరదల కారణంగా తమకు కడగండ్లు తప్పడం లేదు. గోదావరి ఉగ్రరూపం దాల్చినప్పుడల్లా ప్రతిసారి మేము నష్టపోతున్నాం. ప్రభుత్వాలు ఏమాత్రం పట్టించుకోవడం లేదు. ఇప్పటికైనా శాశ్వత ప్రాతిపదికన చర్యలు తీసుకోవాలి.

# ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలకు మహర్దశ

జగిత్యాల : నిధుల కొరత కారణంగా కొన్నేళ్లుగా అభివృద్ధికి నోచుకోని జగిత్యాల ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలకు కేంద్రం మంజూరు చేసిన నిధులతో కొత్తరూపు సంతరించుకోనుంది. ప్రధాన మంత్రి ఉచ్చతర్ శిక్ష అభియాన్ (పీఎం ఉష) కింద రూ.5 కోట్లు నిధులు మంజూరు చేసింది. శాతవాహన విశ్వవిద్యాలయం పరిధిలోని కరీంనగర్, జగిత్యాల ప్రభుత్వ మహిళా కళాశాలలకు రూ.5 కోట్ల చొప్పున నిధులు కేటాయించారు. రాష్ట్రంలోని 132 కళాశాలల్లో 65 కళాశాలలు ఈ నిధుల కోసం దరఖాస్తు చేసుకోగా రాష్ట్రంలో 13 మాత్రమే ఎంపికయ్యాయి. ఇందులో కరీంనగర్, జగిత్యాలకు మాత్రమే ఊరట లభించింది. నాక్ గుర్తింపు, విద్యా ప్రమాణాలు, విద్యార్థుల ప్రవేశాలు, అధ్యాపకుల కృషి తదితర ప్రామాణికత ఆధారంగా నిధులు మంజూరు చేశారు.

**943 మంది విద్యార్థినులు.. :** స్థానిక ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో మొత్తం 943 మంది విద్యార్థినులు అభ్యసిస్తున్నారు. జగిత్యాల నియోజకవర్గంతోపాటు పొరుగు జిల్లాల్లోని ఖానాపూర్, నిర్మల్ నియోజకవర్గాలతోపాటు జగిత్యాల జిల్లాలోని కోరుట్ల, ధర్మపురి నియోజకవర్గానికి చెందిన



విద్యార్థినులు సైతం ఏటా ప్రవేశాలు పొందుతున్నారు. నాక్ బి ప్లస్ ప్లస్ గుర్తింపుతోపాటు అనుబంధంగా హాస్టల్ సౌకర్యం ఉండటంతో మహిళా కళాశాల ప్రత్యేక గుర్తింపు సాధించింది. ఈ క్రమంలో విద్యార్థుల సంఖ్య పెరగడంతో తరగతి గదులు సరిపోక ఉన్న గదులను రెండుగా విభజించి బోధన కొనసాగి స్తున్నారు. నిధుల మంజూరుతో కళాశాలలో సమస్యలు గట్టెక్కనున్నా యని విద్యార్థినులు భావిస్తున్నారు.

**సమకూరనున్న సదుపాయాలు**

ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో రూ.3.92 కోట్లతో 12 అదనపు తరగతి గదులు నిర్మించనున్నారు. కళాశాల ఆవరణలో రెండు శిథిలమైన భవనాలను కూల్చివేసి నిర్మాణాలు చేపట్టనున్నారు. మొదటి అంతస్తు లోనూ మరికొన్ని గదులు నిర్మించాలని ప్రతిపాదించారు. ఇంజినీర్లు మ్యాప్‌లు కూడా రూపొందించారు. కళాశాలలో రూ.1.08 కోట్లు వెచ్చించి కంప్యూటర్లు కొనుగోలు చేయనున్నారు. తరగతి గదుల్లో డిజిటల్ బోర్డులు ఏర్పాటు చేయనున్నారు. కార్పొరేట్ తరహాలో ఫర్నిచర్ సామగ్రి, ఇన్వర్టర్లు అమర్చి విద్యార్థినులకు అవసరమైన కంప్యూటర్ వ్యవస్థను పూర్తిస్థాయిలో అందుబాటులోకి తేనున్నారు.

**కేతిక విద్యకు దోహదం** – డాక్టర్ వై.సత్యనారాయణ, ప్రిన్సిపల్

మంజూరైన రూ.5 కోట్ల నిధులతో కళాశాలలో అదనపు సౌకర్యాలు సమకూరనున్నాయి. కంప్యూటర్లు, డిజిటల్ బోర్డులు విద్యార్థినుల సాంకేతిక విద్యకు దోహదం చేయనున్నాయి. త్వరలో కళాశాల స్వయంప్రతిపత్తి హోదా కూడా సాధించనుండటంతో ప్రవేశాలు పెరిగే అవకాశం ఉంది. నిధుల మంజూరుకు కృషి చేసిన ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి, ఎమ్మెల్యే సంజయ్‌కుమార్‌లకు కృతజ్ఞతలు.

# సాగు కాలం... ఎగువ మానేరు కాల్వ ఇలా..



ముస్తాబాద్ : వానాకాలం సాగు పనుల్లో అన్నదాతలు నిమగ్నమయ్యారు. వర్షాలు పెద్దగా లేకపోవడంతో రైతులు ఎగువ మానేరుపై ఆశలు పెట్టుకున్నారు. మరోవైపు జలాశయం నుంచి నీరు వదిలినా చివరి ఆయకట్టు వరకు చేరని పరిస్థితి నెలకొంది. కాల్వలో తుంగ, పిచ్చి మొక్కలు ఏపుగా పెరగడమే ఇందుకు కారణం. ఏళ్ల తరబడి తూంలు, డిస్ట్రిబ్యూటర్లకు మరమ్మతులు చేపట్టక సాగు నీరు ముందుకు సాగని దుస్థితిపై ప్రత్యేక కథనం.

ఎగువ మానేరు కుడి కాల్వ ద్వారా మూడు మండలాలకు సాగునీరందుతుంది. జలాశయం నుంచి చివరి ఆయకట్టు తెర్లుమద్ది వరకు 21 డిస్ట్రిబ్యూటర్లు ఉన్నాయి. గంభీరావుపేట మండలంలో కొత్తపల్లి, లింగన్నపేట, మల్లారెడ్డిపేట, ఎల్లారెడ్డిపేట మండలంలోని బందలింగంపల్లి శివారు, ముస్తాబాద్ మండలంలో గోపాల్‌పల్లె, రాంరెడ్డిపల్లె, కొండాపూర్, గూడెం, గుడూరు, నామాపూర్, ముస్తాబాద్, పోత్గల్, తెర్లుమద్ది గ్రామాల ఆయకట్టుకు కుడి కాల్వ ద్వారా సాగు నీరందుతుంది. మూడు మండలాల్లో కలిపి దాదాపు 13 వేల ఎకరాలకుపైగా ఆయకట్టు ఉంది. ఇందులో ముస్తాబాద్ మండలంలోనే 8 వేల ఎకరాలు పైగా ఉంది. అడపా దడపా కురుస్తున్న వర్షాలకు అన్నదాతలు సాగు పనుల్లో తలమునకలయ్యారు. బోరుబావులు ఉన్న రైతులు వరినాట్లు వేసుకొంటున్నారు. ఎగువ మానేరు కాల్వపై ఆధారపడిన రైతులు సాగునీటి కోసం ఎదురు చూస్తున్నారు. ఒకవేళ సమృద్ధిగా వర్షాలు కురిసినా కాల్వలో పెరిగిన తుంగ, పిచ్చిమొక్కల వల్ల నీరు ముందుకు కదలని పరిస్థితి నెలకొందని అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**యాసంగిలో తొలగించినా...**

యాసంగి సీజన్‌లో పంటల సాగు కోసం నీటిపారుదలశాఖ అధికారులు జేసీబీ ద్వారా కాల్వలో పెరిగిన తుంగ, పిచ్చి మొక్కలను తొలగించారు. మళ్లీ ఏపుగా పెరిగాయి. వానాకాలం పంటల సాగుకోసం ముందస్తుగా కాల్వలో ఉపాధి హామీ కూలీల ద్వారా కొంతవరకు తొలగించారు. ముస్తాబాద్ గ్రామ సమీపంలో కాల్వలో మురుగు చేరి దుర్గంధం వెదజల్లుతోంది. దీనికితోడు తుంగ, పిచ్చి మొక్కలు ఏపుగా పెరగడంతో మురుగు ముందుకు సాగక సమీప కాలనీవాసులు దుర్వాసనతో ఇబ్బంది పడుతున్నారు. వీటికి తోడు ఏళ్ల తరబడి ప్రధాన కాల్వ తూంలకు మరమ్మతులు చేపట్టలేదు. వాటికి మరమ్మతులు చేపట్టాలని ఏటా సంబంధిత అధికారులను కోరుతున్నా పట్టించుకున్న నాథుడు లేడు. ఇప్పటికైనా కాల్వలో పూడికతీతతోపాటు తూంలు, అక్విడెట్‌ల మరమ్మతులు చేపట్టాలని కర్షకులు కోరుతున్నారు.

**చివరి ఆయకట్టు వరకు నీరందించాలి**

– పరకాల బాల్‌చంద్రంగౌడ్, రైతు

మాది తెర్లుమద్ది గ్రామం. ఎగువ మానేరు కాల్వ ఆయకట్టు కింద నాకు రెండున్నర ఎకరాలు ఉంది. గత యాసంగిలో వరిపైరు పొట్ట దశలో ఉన్నప్పుడు పొలానికి నీరందక చాలా ఇబ్బందులు పడ్డాను. వానాకాలం సాగు ప్రారంభమైనందున అధికారులు కాల్వల్లో పెరిగిన తుంగ, పిచ్చి మొక్కలను తొలగించేందుకు చర్యలు చేపట్టాలి. ఎగువ మానేరు కుడికాల్వ ద్వారా చివరి ఆయకట్టు వరకు నీరందేలా చూడాలి. తూములు, షట్టర్లకు మరమ్మతులు చేపట్టాలి. ఎగువమానేరు నీటిని విడుదల చేసి అన్నదాతలకు అండగా నిలవాలి.

**ప్రణాళికలు సిద్ధం చేస్తున్నాం**

– రవికుమార్, డీఈ, నీటిపారుదలశాఖ

ఎగువ మానేరు కాల్వలో పేరుకుపోయిన తుంగ, పిచ్చి మొక్కలు తొలగించేలా గ్రామ పంచాయతీ కార్యదర్శికి, పిల్ల కాల్వలను ఉపాధి హామీ పథకం ద్వారా శుభ్రం చేయించాలని సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లాం. వారు సానుకూలంగా స్పందించారు. వీటికి తోడు ఎగువ మానేరు కాల్వ లైనింగ్ పనులు చివరి ఆయకట్టు వరకు, అక్విడెట్‌లు, తూముల మరమ్మతులకు ప్రణాళికలు రూపొందించి ఉన్నతాధికారులకు పంపిస్తాం. నిధులు రాగానే పనులు ప్రారంభిస్తాం. చివరి ఆయకట్టుతోపాటు నక్కవాగు ప్రాజెక్టులో నీరు నింపేలా, అన్నదాతల భవిష్యత్ తరాలకు ఉపయోగపడేలా రూ.28 కోట్లతో ప్రణాళికలు సిద్ధం చేస్తున్నాం.

# మోత్కూరుకు ఇచ్చారు.. పెద్దపల్లికి ఎప్పుడు?



పెద్దపల్లి : పెద్దపల్లిలో ఆర్టీసీ బస్సు డిపో ఏర్పాటు దాదాపు 30 ఏళ్లుగా ప్రజలకు కలగానే మిగిలింది. జిల్లాకేంద్రంగా ఏర్పడిన తర్వాత కూడా చేస్తున్న ప్రయత్నాలు ఫలించలేదు. గత ఎన్నికల్లో ప్రచారాస్త్రంగా మారినా అడుగు ముందుకు పడటం లేదు. యాదాద్రి భువనగిరి జిల్లా తుంగతుర్తి నియోజకవర్గ పరిధిలోని మోత్కూరులో ఆర్టీసీ బస్సు డిపో ఏర్పాటుపై రెండు రోజుల కిందట ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిన నేపథ్యంలో పెద్దపల్లి ప్రజల ఆకాంక్ష మరోసారి తెరపైకి వచ్చింది.

**మూణ్నాళ్ల ముచ్చటగా హబ్**

పెద్దపల్లి జిల్లాకేంద్రంగా మారిన తర్వాత స్థానికంగా ఆర్టీసీ సేవలను అందుబాటులోకి తెచ్చేందుకు అధికారులు బస్సు హబ్ ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించారు. అందుకు తగ్గట్లుగా కొన్నాళ్లు బస్ స్టేషన్‌లో అవసరాలకు అనుగుణంగా నడిపించేందుకు రెండు, మూడు బస్సులను ఉంచారు. అయిదే ఇది మూణ్నాళ్ల ముచ్చటగానే మారింది. దీంతో గతంలో మాదిరిగానే ప్రయాణానికి గోదావరిఖని, మంథని, మంచిర్యాల డిపో బస్సులపై ఆధారపడాల్సి వస్తోంది. ముఖ్యంగా వివిధ గ్రామాల నుంచి జిల్లా కేంద్రానికి రావడానికి ప్రజలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. కరీంనగర్ డిపో అధికారులు జూలపల్లి, ఎలిగేడు మండలాన్ని పెద్దపల్లి నుంచి వేరు చేసి బస్సులు నడుపుతుండగా జగిత్యాల డిపో ఆధ్వర్యంలో ధర్మారం, మంథని డిపో అధికారులు కాల్వశ్రీరాంపూర్ మండలాలను జిల్లాకేంద్రంతో విభజించి మరో ప్రాంతానికి అనుసంధానిస్తూ బస్సులు నడుపుతున్నారు.

**అందుబాటులో స్థలాలు**

డిపో ఏర్పాటుకు పెద్దపల్లిలో అందుబాటులో ఉన్న స్థలాన్ని సద్వినియోగం చేసుకోవడంపై పాలకులు దృష్టి సారించడం లేదు. బస్‌స్టేషన్ సమీపంలోని ఎంపీడీవో కార్యాలయం లేదా తహసీల్దార్ కార్యాలయాలను మరో చోటుకు తరలిస్తే ఆ స్థలం డిపో ఏర్పాటుకు అనుకూలంగా ఉంటుంది. ప్రస్తుత బస్‌స్టేషన్ సమీపంలోని రెండు డీసీఎంఎస్ గోదాములను అక్కడి నుంచి తొలగించి, ఖాళీ గోదాముల్లో ఆర్టీసీ డిపోను ఏర్పాటు చేయొచ్చు. అది కాకుంటే వ్యవసాయ మార్కెట్ యార్డు, ఐటీఐ మైదానంలలోనూ ఎక్కడో చోట డిపో ఏర్పాటుకు అనుకూలంగా ఉంటుంది.

**జిల్లాకేంద్రంతో అనుసంధానమేదీ!**

పెద్దపల్లిలో బస్సు డిపో ఏర్పాటు కోసం 80వ దశకంలోనే ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. అప్పట్లో పట్టణంలో స్థలం అందుబాటులో లేకపోవడం, పలు చోట్ల ప్రభుత్వ స్థలాలు ఆక్రమణకు గురి కావడం, స్థానికంగా స్థలం కోసం ప్రయత్నించే నాయకుడు లేకపోవడంతో అమలుకు నోచలేదు.

సింగరేణి సంస్థ గోదావరిఖనిలో ఉచితంగా స్థలం ఇవ్వడంతో డిపో అటు తరలిపోయింది. ఆ తర్వాత ఉమ్మడి జిల్లాలో అనేక కొత్త డిపోలు ఏర్పాటు చేసినప్పటికీ పెద్దపల్లికి అవకాశం దక్కలేదు.

పదిహేనేళ్ల కిందట రంగంపల్లిలోని రెండు పడక గదుల ఇళ్ల సముదాయం సమీపంలో స్థలాన్ని పరిశీలించినప్పటికీ రైల్వే ట్రాక్ అవతలి వైపు ఉండటంతో ఆర్టీసీ అధికారులు అభ్యంతరం తెలిపారు. ఆ తర్వాత డిపో కోసం మాటలు చెప్పడమే తప్ప ఆచరణకు నోచుకోలేదు. ఇటీవలి అసెంబ్లీ ఎన్నికల సమయంలో ప్రస్తుత ఎమ్మెల్యే విజయరమణారావు బస్సు డిపో ఏర్పాటు తన ప్రథమ ప్రాధాన్యంగా ప్రకటించారు.

**త్వరలోనే కల సాకారం**–సీహెచ్ విజయరమణారావు, పెద్దపల్లి ఎమ్మెల్యే

పెద్దపల్లిలో డిపో ఏర్పాటుపై సీఎం రేవంత్‌రెడ్డి స్పష్టమైన హామీ ఇచ్చారు. ఇందుకు అవసరమైన స్థలం కోసం అన్వేషిస్తున్నాం. ఈ ప్రక్రియ పూర్తి కాగానే డిపో ఏర్పాటు దిశగా అడుగు పడుతుంది. ఇందుకు ఆరు నెలల సమయం పట్టే అవకాశముంది. డిపో ఏర్పాటుతోపాటు బస్‌స్టేషన్‌ను ఆధునికీకరిస్తాం.

# బదిలీల్లో భర్తీ అయ్యేనా!

కరీంనగర్ : పురపాలికల్లో ఉద్యోగుల కొరత పట్టి పీడిస్తోంది.. ఏళ్ల తరబడి పోస్టుల భర్తీ జరగడం లేదు. దీంతో ఉన్న ఉద్యోగులపై భారం మోపుతున్నారు.. ఈ క్రమంలో జవాబుదారీ లేకుండా పోతోంది.. పనులు ఆలస్యమవుతున్నాయి.. సాధారణ బదిలీల నేపథ్యంలోనైనా ఈ పరిస్థితి మారాలని.. ఖాళీలు భర్తీ కావాలన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఉమ్మడి జిల్లాలో రెండు నగర పాలికలు, 14 పురపాలికలు ఉన్నాయి. అభివృద్ధి పనులు, పారిశుద్ధ్యం, తాగునీటి సరఫరా, వీధి దీపాల నిర్వహణ, పట్టణ ప్రణాళిక, ఇంజినీరింగ్, పరిపాలన, రెవెన్యూ వంటి విభాగాల ద్వారా ప్రజలకు సౌకర్యాలు కల్పించాల్సి ఉంటుంది. వీటన్నింటిని పర్యవేక్షణ చేసేందుకు కమిషనర్ స్థాయి అధికారులతోపాటు పూర్తి స్థాయిలో ఆయా విభాగాల అధికారులు పని చేయాల్సి ఉంటుంది. కరీంనగర్ నగరపాలక సంస్థలోనే ఉద్యోగులు, అధికారులు పూర్తి స్థాయిలో లేకపోవడంతో నెట్టుకొచ్చే పరిస్థితి ఉంది. భర్తీపై ఆశలుసాధారణ బదిలీల్లో ప్రతి పురపాలికలోని ఉద్యోగుల్లో 40 శాతం మందిని స్థాన చలనం చేసేందుకు ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. నాలుగేళ్లుగా ఒకే స్థానంలో ఉన్నవారికి తప్పనిసరిగా బదిలీలు చేసే అవకాశముంది. వీరితోపాటు అదనంగా ఇతర ప్రాంతాల నుంచి వచ్చే ఉద్యోగులతో ఖాళీలు భర్తీ అవుతాయనే ఆశలో పాలకవర్గాల సభ్యులు ఉన్నారు. కరీంనగర్ నగరపాలికలో కమిషనర్ సెలవులో ఉండగా ఇన్‌ఛార్జిగా అదనపు కలెక్టర్‌కు బాధ్యతలు అప్పగించారు. అదనపు కమిషనర్, సహాయ కమిషనర్, ఎస్ఈ, ఈఈ, డీఈఈలు, ఏఈఈలు, డీసీపీ, టీపీవో, టీపీఎస్‌లు, రెవెన్యూ అధికారి, పశు వైద్యాధికారి, ప్రజారోగ్యశాఖ అధికారి, శానిటరీ పర్యవేక్షకులు, ఇతర విభాగాల్లోని సిబ్బంది పోస్టులు ఖాళీగానే ఉన్నాయి. దాదాపు అన్ని పురపాలికల్లోనూ ఇదే పరిస్థితి నెలకొంది. నగర, పురపాలికల్లో పని చేస్తున్న ఉద్యోగులు ఇప్పటికే ఐచ్ఛికాలు పెట్టుకున్నారు. హైదరాబాద్ పురపాలిక, ఇంజినీరింగ్, కార్యాలయాల్లో బదిలీల ప్రక్రియకు కౌన్సెలింగ్ జరుగుతోంది.

# జనరల్ ఆసుపత్రి కిటకిట

కరీంనగర్ : కరీంనగర్ జనరల్ ఆసుపత్రికి వచ్చే వారిలో అతిసార బాధితులు అధిక మంది ఉంటున్నారు. రోజూ సగటున 400 ఓపీ ఉండాల్సి ఉండగా.. వారం రోజులుగా రెట్టింపు సంఖ్యలో నమోదవుతోంది. వైద్య విధాన పరిషత్ సిబ్బంది ఎక్స్‌రే, సిటి స్కాన్, మందుల పంపిణీ తదితర సేవలు రోగులకు అందించేవారు. వారు వారి మాతృ స్థానానికి బదిలీపై వెళ్లడంతో రోగులు ఇబ్బందులు పడుతున్నారు. కాంట్రాక్టు పద్ధతిలో ఉద్యోగులను నియమించుకోవడానికి అవకాశం లేకపోవడంతో ఏం చేయాలేని పరిస్థితి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి తగిన సిబ్బందిని నియమించాలని రోగులు కోరుతున్నారు.

**వాంతులు.. విరేచనాలతో..**

ఆసుపత్రిలో వాంతులు, విరేచనలతో అధికంగా అడ్మిట్ అవుతున్నారు. చిన్నపిల్లలు ఎక్కువగా దగ్గు, జ్వరం, గొంతు, కడుపు నొప్పితో వస్తున్నారు. వీటికి కారణం వాతావరణంలో మార్పులతోపాటు దోమలు, ఈగలని వైద్యులు చెబుతున్నారు. తగినన్ని జాగ్రత్తలు తీసుకోవాలని




వైద్యులు సూచిస్తున్నారు. గత పది రోజుల్లో 4985 మంది ఓపీకి వచ్చారు. లోపలకు వచ్చింది మొదలు.. మందులు తీసుకొని ఇంటికి వెళ్లే వరకు ప్రతి చోట రోగులు గంటల తరబడి నిల్చోవలసి వస్తోంది. ఉదయం వచ్చిన రోగులు పరీక్షలన్నీ అయిపోయి ఇంటికి వెళ్లే వరకు సాయంత్రం అవుతుంది. జూన్, జులై నెలలో ప్రభుత్వ ఆసుపత్రిలో రక్త పరీక్షల్లో 23 మందికి డెంగీ పాజిటివ్ వచ్చింది.

ఈ చర్యలు పాటిస్తే మేలు..ఓపీ కేంద్రాలు రెండున్నాయి. మరొకటి ఏర్పాటు చేస్తే రద్దీని నియంత్రించవచు.

ఎక్స్‌రే, సిటి స్కాన్ టెక్నీషియన్‌లను తాత్కాలిక పద్ధతిలో నియమించాలి మందుల పంపిణీ కేంద్రం వద్ద అదనపు సిబ్బందిని ఏర్పాటు చేయాలి. వైద్యులందరూ విధి నిర్వహణలో ఉండేలా చూడాలి. సమయానికి రావాలి. సాధ్యమైనంత వరకు రోగులు ఎక్కడికక్కడ కూర్చునే వ్యవస్థను ఏర్పాటు చేయాలి. రిపోర్టులను త్వరితగతిన అందజేయాలి.

సీజనల్ వ్యాధుల నేపథ్యంలో అవసరమైన సిబ్బందిని అత్యవసరంగా నియమించుకోవాలి.

మా దృష్టికి తీసుకురండి– డాక్టర్ వీరారెడ్డి, ఆసుపత్రి సూపరింటెండెంట్ గతంలో ఆసుపత్రికి వచ్చే వారి కంటే ప్రస్తుతం అధికంగా వస్తున్నారు. రోగులకు ఇబ్బందులేకుండా అన్ని రకాల ఏర్పాట్లు చేస్తున్నాం. ఎక్కడైనా ఇబ్బందులు ఉంటే మా దృష్టికి తీసుకురండి. వాటిని పరిష్కరిస్తాం.

# ఘన లక్ష్యం.. ఆచరణలో నిర్లక్ష్యం

కరీంనగర్ : అన్నదాతకు ఉపయోగపడతాయని ఘనమైన లక్ష్యంతో నిర్మించిన రైతు వేదికలు చాలా చోట్ల వృథాగా ఉంటున్నాయి. ఆధునిక, సాంకేతిక నైపుణ్యంతో అధిక దిగుబడులు సాధించేందుకు, రైతు సమస్యలపై చర్చించేందుకు వీటిని నిర్మించారు. ఏ రైతు పట్టణాలకు వెళ్లకుండా సమీపంలోనే అన్ని రకాల సహాయ సహకారాలు అందేలా ఉండాలనేది రైతు వేదిక లక్ష్యం. వీటిల్లోనే వ్యవసాయ విస్తరణ అధికారి కార్యాలయం ఏర్పాటు చేయాలని నిర్దేశించారు. కానీ జిల్లాలో సింహాభాగం వ్యవసాయ విస్తరణ అధికారులు అక్కడ ఉండట్లేదు.

**జిల్లాలో ఇలా..**

జిల్లాలో అయిదు వేల ఎకరాలకు ఒక క్లస్టర్ చొప్పున 76 వ్యవసాయ క్లస్టర్లున్నాయి. ఒక్కో క్లస్టర్లో 10 గుంటల నుంచి ఎకరం వరకు స్థలం కేటాయించి 76 రైతు వేదికలు నిర్మించారు. ఒక్కో దానికి ఎన్ఆర్ఈజీఎస్ నుంచి రూ.8 లక్షలు, వ్యవసాయ శాఖ నుంచి రూ.12 లక్షలు కలిపి రూ.20 లక్షలతో నిర్మించారు. 2,046 చదరపు అడుగుల విస్తీర్ణంలో పెద్ద హాల్, రెండు గదులను నిర్మించారు. జిల్లా మొత్తంగా రైతు వేదికల నిర్మాణానికి రూ.15.2 కోట్లు ఖర్చు చేశారు.

**చాలా చోట్ల అలంకారప్రాయంగా...**

రైతులకు ఆధునిక, సాంకేతిక పంటల సాగు విధానంపై శిక్షణ ఇవ్వాలి.




కానీ ఎక్కడో ఒక చోట తప్పితే మిగిలిన చోట్ల ఇవ్వడంలేదు. రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల మండలానికి ఒక రైతు వేదికను 'రైతు నేస్తం'గా మార్చేందుకు ప్రతిపాదనలు పంపించాలని కోరింది. జిల్లాలోని కరీంనగర్ గ్రామీణ మండలంలో గోపాల్‌పూర్, కొత్తపల్లి, మానకొండూరు, రామడుగు, గన్నేరువరం, గంగాధర, చొప్పదండి, తిమ్మాపూర్, ఇల్లందకుంట, శంకరపట్నం, జమ్మికుంట, హుజూరాబాద్‌లోని రాంపూర్, చిగురుమామిడి, సైదాపూర్, వీణవంక కేంద్రాలను రైతు నేస్తాలుగా వినియోగించుకునేలా ప్రతిపాదనలు పంపించారు.

**భారంగా నిర్వహణ..**

రైతు వేదికల నిర్మాణానికి అనువైన స్థలాలు అందుబాటులో లేక.. చాలా చోట్ల గ్రామాలకు దూరంగా నిర్మించారు. వాటి నిర్వహణకు ప్రభుత్వం ప్రత్యేకంగా ప్రతి నెలా డబ్బులు విడుదల చేయట్లేదు. గత రెండేళ్లలో ఒకటి, రెండు సార్లు మినహా నిధులు విడుదల కాలేదు. రైతు వేదికల నిర్వహణ బాధ్యత విస్తరణ అధికారి చేతిలో పెట్టడంతో నిధుల లేమితో నిర్దేశిత లక్ష్యం చేరుకోవట్లేదు. కొన్ని చోట్ల అన్నదాతలకు అవసరాలకు కాకుండా, ప్రైవేట్ ఫంక్షన్ల నిర్వహణకు వినియోగిస్తున్నారనే ఆరోపణలున్నాయి.

**నిధులుంటేనే ఉపయోగం..**

అనుకున్న లక్ష్యం అందుకోవాలంటే వేదికల నిర్వహణకు ప్రత్యేక నిధులు కేటాయించాలి. విస్తరణ అధికారి అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలి. కర్షకులు అధిక దిగుబడులు సాధించేందుకు దోహదపడేలా నిరంతరం కార్యక్రమాలు నిర్వహించాలి. సంబంధిత ఉద్యోగులు చిత్తశుద్ధితో విధులు నిర్వర్తించేలా ప్రత్యేక పర్యవేక్షణ ఉండాలి.

# అందిన నివేదిక.. కార్డులే ఇవ్వాలిక

హైదరాబాద్: కొవిడ్ సమయంలో వలసదారులు పడిన ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని బల్దియా 2020లో సదుపాయాల కల్పన, సంక్షేమ పథకాల అమలుకు ప్రత్యేక సర్వే చేపట్టింది. వారి ఆర్థిక పరిస్థితి, ఇతర మౌలిక సదుపాయాల గురించి అందులో పేర్కొంది. ఈ మేరకు నిర్మాణ రంగంలో, ఇతర ఉపాధి పనులకు వెళ్లే కార్మికుల వివరాలను నమోదు చేసింది. వలసదారులకు రేషన్‌కార్డులు మంజూరు చేయాలంటూ సుప్రీం కోర్టు ఆదేశాలు జారీ చేయడంతో బల్దియా చేపట్టిన సర్వే ఆధారంగా మూడు జిల్లాల పౌరసరఫరాల శాఖ అధికారులు అర్హుల వెరిఫికేషన్ ప్రక్రియ ప్రారంభించి నాలుగు వారాల్లో పూర్తిచేశారు. అనంతరం ఈ నివేదికను ఉన్నతాధికారులకు పంపించారు. ఇప్పటికీ కార్డుల మంజూరుపై స్పష్టమైన ప్రకటన రాలేదు. ప్రభుత్వ పథకాల అమలుకు రేషన్‌కార్డు ప్రామాణికం కావడం, వాటి జారీలో జాప్యంతో నష్టపోతున్నామని అర్హులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.సిద్ధం చేశారిలా.. నగరవ్యాప్తంగా 2లక్షల మందికి పైగా వలస కార్మికులు ఉండగా గతంలోనే 80వేల మంది వరకు దరఖాస్తు చేసుకున్నారు. సగం మందికి కార్డులు జారీ అయ్యాయని అధికారులు



గుర్తించారు. నంబర్లు సరిగా ఇవ్వనివారి చిరునామాలకు వెళ్లి మరోసారి పరిశీలించి పేర్ల తొలగింపు లేదా అర్హులుగా గుర్తించడానికి సమాయత్తమవుతున్నారు.

**మార్పులు, చేర్పులకు జాప్యమే...**

కొత్త రేషన్‌కార్డుల జారీపైనా అర్హులు ఎదురుచూస్తున్నారు. ప్రభుత్వం సానుకూల ప్రకటనలు జారీ చేయడంతో ఎప్పుడు ప్రక్రియ ప్రారంభమవుతుందోనని వేచిచూస్తున్నారు. 2014 నుంచి కొత్త కార్డులివ్వకపోవడంతో దరఖాస్తుదారుల సంఖ్య భారీగా పెరిగిపోయింది. ప్రజాపాలనలో లక్షలాది మంది దరఖాస్తు చేసుకున్నారు. గ్రేటర్‌లో వలసదారులు మినహా 2లక్షల మంది కొత్త పేర్ల నమోదు, చిరునామాలో మార్పులు, తప్పుడు వివరాల సవరణ తదితరాలపై దరఖాస్తు చేసుకున్నారు.

**ఆధునికత తోడుగా.. అంతరాయానికి దూరంగా!**

విద్యుత్తు అంతరాయాల మరమ్మతుల్లో ఆలస్యానికి ప్రధాన కారణం.. అసలు సమస్య ఎక్కడుందో తెలియకపోవడమే. ఇందుకే సిబ్బందికి ఎక్కువ సమయం పడుతోంది. లైన్లవెంట పరుగెత్తాల్సి వస్తోంది. దీనికి పరిష్కారంగా 33కేవీ విద్యుత్తు లైన్లలో 'ఫాల్స్ పాసేజ్ ఇండికేటర్లు' ఏర్పాటుకు డిస్కం నిర్ణయించింది. అంతరాయాలకు ఆస్కారముండే లైన్లలో 216చోట్ల వీటిని ఏర్పాటుచేసి స్కాడాకు అనుసంధానం చేయనున్నారు. జీహెచ్ఎంసీ పరిధిలో 675 వరకు 33 కేవీ ఫీడర్లున్నాయి. వీటిలో సగం భూగర్భ కేబుల్ లైన్లుండగా.. మిగతావి ఓవర్‌హెడ్ లైన్లు. ఈదురుగాలులు, వర్షాల వేళ చెట్లు పడటం, కటౌట్లు తీగలకు చుట్టుకుని అంతరాయాలకు దారితీస్తున్నాయి. సగటున ఒక్కో 11కేవీ ఫీడర్ లైన్ 5 కి.మీ. వరకు ఉంది. అంతరాయం ఎక్కడనేది గుర్తించేందుకు కొన్నిసార్లు సిబ్బందికి ఎక్కువ సమయం పడుతోంది. ఫాల్స్ పాసేజ్ ఇండికేటర్లను తీగలకు అమర్చడంతో సమస్య ఎక్కడ ఉందో ఎర్రగడ్డలోని స్కాడా కార్యాలయానికి తెలిసిపోతుంది. అక్కడినుంచి సిబ్బందిని అప్రమత్తం చేస్తారు. సమస్య ఉన్న లైన్ మినహాయించి మిగతా ప్రాంతానికి సరఫరా పునరుద్ధరిస్తారు. గతంలో 11కేవీ ఫీడర్లలో 600 లైన్లలో ఫాల్స్ పాసేజ్ ఇండికేటర్లను ఏర్పాటుచేశారు. ఆ పరిధిలో నాలుగేళ్లలో బ్రేక్‌డౌన్లే నమోదు కాలేదు. అంతరాయాలు గంట దాటితే బ్రేక్‌డౌన్‌గా పరిగణిస్తుంటారు.

# హద్దుమీరకుండా సరిహద్దులు

హైదరాబాద్: గ్రేటర్ హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల్లో ప్రభుత్వ భూములను ఆక్రమించకుండా.. అక్రమార్కులు హద్దు మీరకుండా వాటిని కాపాడాలని రెవెన్యూ అధికారులు నిర్ణయించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇటీవల నిర్వహించిన కలెక్టర్ల సమావేశంలో ఇచ్చిన ఆదేశాల మేరకు.. కార్యాచరణ నిర్ణయించారు. మండలాల వారీగా ప్రభుత్వ భూములను క్షేత్రస్థాయిలో పరిశీలించి ఆక్రమణలుంటే ఫోటోలు తీసి తక్షణం తొలగించేలా ప్రత్యేక బృందాలను నియమించనున్నారు. పంద్రాగస్టులోపు నివేదికలు తయారు చేసి ప్రభుత్వానికి సమర్పిస్తారు.

**సర్వేల్యాండ్ రికార్డులు.. పహాణీలు**



హైదరాబాద్ సమీపంలో మూడువందలకు పైగా గ్రామాలు రంగారెడ్డి, మేడ్చల్ జిల్లా సరిహద్దులో ఉన్నాయి. పన్నులు మున్సిపాలిటీలు, గ్రేటర్‌కు చెల్లిస్తున్నా.. భూముల పరంగా రెవెన్యూ అధికారులతోనే ఆయా గ్రామాల ప్రజలకు అవసరాలున్నాయి. చాలామంది తమ భూముల వివరాలు రికార్డుల్లో సక్రమంగా లేవంటూ అధికారులను ఆశ్రయిస్తున్నారు. సమస్యలను తొలగించేందుకు సర్వేల్యాండ్ విభాగం అధికారుల సహకారం తీసుకుంటున్నారు. రెవెన్యూ రికార్డులు, పాత పహాణీలను క్షేత్రస్థాయిలో పరిశీలించి పెండింగ్ దరఖాస్తులు పరిష్కరించనున్నారు. వివరాల నవీకరణ పహాణీలు, రెవెన్యూ రికార్డులు, ధరణి పోర్టల్‌లో ప్రభుత్వ భూముల వివరాలున్నా.. వాటిల్లో చాలావరకూ నవీకరణ కాలేదు. గ్రేటర్ హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల్లోని ప్రభుత్వ భూముల్లో కొన్నింటిని హెచ్ఎండీఏ, ఐటీ, పరిశ్రమల శాఖలు, ఇతర సంస్థలకు కేటాయించారు. ధరణి పోర్టల్‌లో ఈ భూముల్లో కొన్ని ఇంకా ప్రభుత్వ భూములుగానే కొనసాగుతున్నాయి. హెచ్ఎండీఏ భూముల్లో కొంత వేలం ద్వారా విక్రయించినా.. నిషేధిత జాబితాలో ఉన్నాయి. వాటన్నింటినీ హెచ్ఎండీఏ, పరిశ్రమలు, రిజిస్ట్రేషన్ శాఖల అధికారులతో రెవెన్యూ అధికారులు రికార్డులను నవీకరించనున్నారు.

# తనిఖీలు ఇంటింటా.. సరకు బయట!



హైదరాబాద్ : ధూల్‌పేట.. నగరంలో గంజాయి విక్రయాలు ఎక్కువగా జరిగే కీలక ప్రాంతం.. కొన్ని కుటుంబాల ప్రధాన ఆదాయ వనరు ఇదే. అలాంటి చోట గంజాయి కట్టడి చేసేందుకు ఈ నెల 13న అబ్కారీ శాఖ దాదాపు 120 మందికిపైగా సిబ్బందితో కలిసి ఇంటింటా జల్లెడ పట్టారు. ఆశ్చర్యకరంగా ఒక్క కిలో సరకు కూడా దొరకలేదు. ఈనెల 16న సాయంత్రం 6:10 గంటల వరకు మరోమారు జిల్లా టాస్క్‌ఫోర్స్ ఆధ్వర్యంలో 50 మంది సిబ్బంది ఐదు ప్రత్యేక బృందాలుగా ఏర్పడి తనిఖీలు నిర్వహించినా అదే ఫలితం. తనిఖీల్లో మాత్రం 2 కిలోల గంజాయితో ఇద్దరు పట్టుబడ్డారు. గంజాయి విక్రయాలే ఉపాధిగా మార్చుకున్న కుటుంబాలను గుర్తించి.. పదుల సంఖ్యలో సిబ్బంది ఇంటింటికీ వెళ్లి క్షుణ్నంగా తనిఖీ చేస్తున్నా ఏమాత్రం ఫలితం లేకపోవడం ఆరోపణలకు తావిస్తోంది. గంజాయి విక్రేతలు తనిఖీల గురించి ముందస్తు సమాచారంతో అందడం వల్లే జాగ్రత్త పడుతున్నారా లేక అధికారులే నామమాత్రంగా సోదాలు చేస్తున్నారా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ధూల్‌పేట క్షేత్రస్థాయి పరిస్థితికి.. తనిఖీల్లో సరకు పట్టుబడకపోవడం ఆశ్చర్యకరమని కొందరు అధికారులు అభిప్రాయపడుతున్నారు.

**నగరంలో మెజార్టీ వాటా..!**

ధూల్‌పేట ప్రాంతం ఒకప్పుడు గుడుంబా వ్యాపారానికి అడ్డాగా ఉండేది. ఆబ్కారీ శాఖ విస్తృత తనిఖీలతో గుడుంబా రక్కసి దాదాపు అంతమైంది. ఆయా కుటుంబాలకు ప్రత్యామ్నాయ ఉపాధి కల్పించేందుకు చర్యలు తీసుకుంది. కొన్నాళ్లు అంతా సవ్యంగా ఉన్నా.. కొందరు డబ్బు కోసం గంజాయి విక్రయాలు మొదలు పెట్టారు. ఆదిలోనే అడ్డుకోకపోవడంతో ఇది మరింత విస్తరించింది. ఆబ్కారీ, పోలీసు శాఖ అంచనా ప్రకారం నగరంలో గంజాయి మార్కెట్‌లో ధూల్‌పేట ప్రాంతానిదే మెజార్టీ వాటా. దాదాపు 200 మంది గంజాయి విక్రయాలు, వివిధ ప్రాంతాలకు చేర్చడంలో ప్రధాన పాత్ర పోషిస్తున్నారు. సుమారు 20 మంది పెద్ద డీలర్లు ఉన్నారు. ముఖ్యంగా మహిళలు ఇళ్లల్లో ఉంటూ విక్రయిస్తుంటే.. యువకులు ద్విచక్రవాహనాల మీద చిన్నచిన్న పొట్లాల్లో ఎక్కడికక్కడ చేరవేస్తూ దందాలో కీలక పాత్ర పోషిస్తున్నారు. వీరి మూలాలు ధూల్‌పేట నుంచి నానక్‌రాంగూడ వరకూ విస్తరించి ఉన్నాయి. ఈ వ్యాపారం చేస్తూ కొందరు రూ.కోట్ల విలువైన ఆస్తులు కూడగడుతున్నారని పోలీసులే నిర్ధారించారు.

**సోదాలు నామమాత్రమేనా..?**

ఆబ్కారీ శాఖ అధికారులు భారీగా సిబ్బందితో ధూల్‌పేటలో తనిఖీలు నిర్వహిస్తున్నా.. స్థానికంగా పరిస్థితులపై అనుభవమున్న వారు లేకపోవడం ఒక లోపం. ధూల్‌పేట ఆబ్కారీ స్టేషన్‌లోని అధికారుల్లో ఎక్కువ మంది ఇటీవల బదిలీపై వచ్చినవారు. తనిఖీల కోసం ఇతర ప్రాంతాల నుంచి వస్తున్నవారికి అక్కడి స్థితిగతుల మీద అవగాహన తక్కువ. గంజాయి దందాలో కీలకంగా వ్యవహరించేవారు ఎక్కడుంటారు..? వారికి వెన్నుదన్ను అందించేవారిని, రహస్య స్థావరాలను గుర్తించడం లేదన్న విమర్శ ఉంది. ఇంటింటి జల్లెడ పడుతున్నట్లు అధికారులు ప్రకటిస్తున్నా క్షేత్రస్థాయిలో పరిస్థితి భిన్నంగా ఉంటోంది.

# కూడళ్లు.. అక్రమార్కుల లోగిళ్లు



హైదరాబాద్ : కాలి బాటలు, రహదారి కూడళ్ల ఆక్రమణలు రోజురోజుకు పెరుగుతున్నాయి. ఓ వైపు ట్రాఫిక్ సమస్య తీవ్రమవుతుంటే.. మరోవైపు రహదారుల కబ్జా ఆందోళన కలిగిస్తోంది. అడ్డు, అదుపు లేకుండా ప్రజా మరుగుదొడ్లు, పాన్ డబ్బాలు, టిఫిన్ షాపులు, చిన్నపాటి హోటళ్లు.. రోడ్ల పొడవునా పుట్టుకొస్తున్నాయి. వాటి వద్ద ద్విచక్ర వాహనాలు, కార్లు, ఆటోలు నిలుస్తుండటంతో రాకపోకలకు అంతరాయం కలుగుతోంది. ఇంత జరుగుతున్నా.. జీహెచ్ఎంసీ ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం, ట్రాఫిక్ పోలీసులు ఏమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారు.

**ఉదాహరణలివిగో..**

మాసబ్ ట్యాంక్ మహవీర్ ఆసుపత్రి వద్ద పాదచారుల పైవంతెన (ఎఫ్‌వోబీ) ఉంటుంది. ఆస్పత్రి వైపు ఎఫ్‌వోబీ చుట్టూ పండ్లు విక్రయించే తోపుడుబండ్లు, కొబ్బరి బోండాల బండి ఉంటాయి. అవి చాలవన్నట్లుగా.. కాలిబాటపై పూర్తి స్థాయి దుకాణాలు వెలిశాయి. తాజాగా.. ఎఫ్‌వోబీని ఆనుకుని ప్రజా మరుగుదొడ్డి నిర్మించారు.

మాసబ్‌ట్యాంక్ కూడలిలోని ప్యారడైజ్ హోటల్ పక్కనున్న కాలిబాటపై మరో దుకాణం వెలిసింది. ఫ్రీ లెఫ్ట్ మార్గానికి అడ్డంకిగా మారుతోంది. బంజారాహిల్స్ ట్రాఫిక్ పోలీసు స్టేషన్ ఎదురుగా, నిత్యం ముఖ్యమంత్రి రాకపోకలు సాగించే రహదారిపై గత కొన్ని రోజులుగా దుకాణాలు పెరుగుతున్నాయి. ఇటీవల ఓ వ్యక్తి పాన్ డబ్బా పెట్టగా, తాజాగా పండ్ల దుకాణాలు మొదలయ్యాయి.

సనత్‌నగర్ ఈఎస్ఐ నుంచి ఎర్రగడ్డ వరకు పండ్ల దుకాణాలు నిండిపోయాయి. ః మూసాపేట, కేపీహెచ్‌బీ, అమీర్‌పేట, మైత్రీవనం, సత్యం థియేటర్ రోడ్డు, అమీర్‌పేట ఆసుపత్రి మార్గాల్లోనూ ఇదే పరిస్థితి.

ఐడీఎల్ చెరువు, సున్నం చెరువు బఫర్ జోన్ ప్రాంతాన్ని కూడా వ్యాపారులు వదలట్లేదు. రేకుల షెడ్లతో హోటళ్లు నిర్మించి ట్రాఫిక్ సమస్యను సృష్టిస్తున్నారు.

మెహిదీపట్నం నుంచి మొదలుపెడితే రెడ్‌హిల్స్, నాంపల్లి, బహదూర్‌పురా, అత్తాపూర్ తదితర ప్రాంతాల్లో కాలనీ రోడ్లపై ప్రైవేటు వ్యక్తులు తాగునీటి శుద్ధి కేంద్రాలు నిర్మించారు. యథేచ్ఛగా జలమండలి నీటిని వాడుకుంటూ ఏళ్లుగా వ్యాపారం సాగిస్తున్నారు.

**విధానం లేకపోవడంతో..**

పేద, మధ్య తరగతి కుటుంబాలు పొట్టకూటి కోసం రోడ్ల పక్కన తోపుడు బండ్లు, వాహనాలను నిలిపి రకరకాల వ్యాపారం చేస్తుంటాయి. సొంతంగా జీవనోపాధి చూసుకునే ఆయా కుటుంబాలు, వ్యక్తులు తాత్కాలిక ఏర్పాట్లు చేసుకుని వ్యాపారం చేస్తున్నారు. కొందరు నేతలు, వ్యాపారులు, ఆక్రమణ దారులు నిజమైన చిరు వ్యాపారులను అడ్డుపెట్టుకుని దందా చేస్తుండటం ఆందోళనకు తావిస్తోంది. ప్రభుత్వ స్థలాలను ఆక్రమించి, సామాన్యులకు అద్దెకిస్తున్నారు. తోపుడు బండ్లకు బదులు.. పక్కా నిర్మాణాలు చేపడుతున్నారు. నగరంలో చిరువ్యాపారులకు నిర్దేశిత ప్రాంతాన్ని చూపి, అక్కడ వ్యాపారాలకు అవకాశం కల్పించే వీధి వ్యాపారుల విధానం లేకపోవడం వల్లే ఈ సమస్య నెలకొందని పలువురు అభిప్రాయపడుతున్నారు.

# సగం చెత్త.. సంపదగా



హైదరాబాద్: జవహర్‌నగర్ డంపింగ్‌యార్డుకు తరలుతోన్న వ్యర్థాల్లో.. దాదాపు నాలుగో వంతు విద్యుత్తుగా మారుతోంది. నాలుగేళ్ల కిందట ఇక్కడ విద్యుదుత్పత్తి కేంద్రం ప్రారంభమవగా.. ఇప్పటి వరకు 590మిలియన్ యూనిట్ల ఉత్పత్తి అవడం గమనార్హం. మార్కెట్లో దాని విలువ రూ.450కోట్లు ఉండొచ్చని అంచనా. అదే డంపింగ్‌యార్డులో.. ఈ ఏడాది చివరికి మరో విద్యుదుత్పత్తి కేంద్రం అందుబాటులోకి రానుంది. రెండు కేంద్రాలు నడిస్తే.. సగం చెత్త సంపదగా మారినట్లేనని ఇంజినీర్లు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

**దేశంలోనే ముందుంటాం..**

జవహర్‌నగర్‌లో రోజువారీ వ్యర్థాల నుంచి వేరవుతోన్న 4వేల టన్నుల పొడి చెత్తలో 1,500 టన్నులు అక్కడున్న విద్యుదుత్పత్తి కేంద్రంలో బూడిదవుతోంది. మరో వెయ్యి టన్నుల పొడి చెత్త దుండిగల్‌లోని 14.5మెగావాట్ల విద్యుదుత్పత్తి కేంద్రానికి తరలుతోంది. ఇటీవలే ఆ కేంద్రం అందుబాటులోకి వచ్చింది. ఇది కాకుండా ప్యారానగర్‌లో మరో కేంద్రం నిర్మాణం కావాల్సి ఉంది. బీబీనగర్‌లోని పాత విద్యుదుత్పత్తి కేంద్రాన్ని పునరుద్ధరించాల్సి ఉంది. యాచారం మండలం, ఫార్మాసిటీ దగ్గరున్న విద్యుదుత్పత్తి కేంద్రాన్ని గతంలో పురపాలకశాఖ అధికారులు తీవ్ర నిర్లక్ష్యం చేశారని, ప్రస్తుత సర్కారు ఆ కేంద్రాన్ని ఉపయోగించుకుంటే.. ఎల్బీనగర్ జోన్‌లో ఉత్పత్తవుతున్న 2 వేల టన్నుల చెత్తను ఆదాయ వనరుగా మార్చుకునే వీలుందని అధికారులు సూచిస్తున్నారు. ఈ రకంగా నగరంలో ఉత్పత్తయ్యే చెత్త మొత్తాన్ని సంపదగా మార్చుకుని, ఆ విభాగంలో హైదరాబాద్‌ను జాతీయ స్థాయిలో అగ్రభాగాన నిలపొచ్చని జీహెచ్ఎంసీ అంచనా వేస్తోంది.

**మెరుగవ్వాల్సిన రీసైక్లింగ్..**

డంపింగ్‌యార్డులో చివరి దశలో 1,300 టన్నుల చెత్త మిగులుతుంది. అదంతా.. డంపింగ్‌యార్డులోని చెత్త గుట్టల్లోకి చేరుతుంది. దాని వల్ల డంపింగ్‌యార్డులోని చెత్త కొండలుగా పేరుకుపోతోంది. రీసైక్లింగ్ ప్రక్రియను మెరుగు పరిస్తే.. వ్యర్థాల పరిమాణాన్ని తగ్గించవచ్చని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

# పర్యవేక్షణ లోపం.. నిర్లక్ష్యానికి మూల్యం

గోదావరిఖని : సింగరేణిలో ప్రతిసారీ ప్రమాదాలు జరిగిన తర్వాత లోపాలపై విచారణ చేపడుతున్నారు. కనీస రక్షణ చర్యలు పాటించకపోవడంతో ప్రమాదాలు జరుగుతున్నట్లు గుర్తిస్తున్నా అవే తప్పులు పునరావృతమవుతున్నాయి. తాజాగా ఓసీపీ-2లో జరిగిన ప్రమాదంలో సైతం అధికారులు కనీస పర్యవేక్షణ లేకుండా పనులు చేయించారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. కేవలం ఒక ఫిట్టర్, ముగ్గురు కార్మికులతో పనులు చేయిస్తున్నారు. ఓసీపీ-2 క్వారీలోంచి నీటిని బయటకు తోడేందుకు ఏర్పాటు చేసిన పైపులైను లీకేజీని అరికట్టేందుకు కార్మికులకు కేటాయించిన పనుల్లో ఎలాంటి రక్షణ చర్యలు పాటించలేదు. మట్టి కూలడం వల్ల వెంకటేశ్వర్లు, విద్యాసాగర్‌లు అందులో కూరుకుపోయి దుర్మరణం చెందారు. మరో ఇద్దరు కార్మికులు ప్రాణాలతో బయటపడ్డారు.

**మట్టి కుప్పలకు కనీస దూరం పాటించాలి**

మట్టి కుప్పల సమీపంలో పనులు నిర్వహించే సమయంలో కనీస జాగ్రత్తలు పాటించాలి. పక్కనే మట్టి కుప్ప ఉండటంతో పాటు డంపర్లు నడిచే దారి కూడా దానికి సమీపంలోనే ఉంది. మరో వైపు వర్షం కురుస్తుంది. పైపులైను లీకేజీ కోసం తవ్విన గుంత పరిసర ప్రాంతం విశాలంగా ఉండే విధంగా చర్యలు తీసుకోవాలి. కాగా పనిప్రదేశంలో ఒక్క సూపర్‌వైజర్‌ను కూడా ఏర్పాటు చేయలేదు. కనీసం అధికారులు పర్యవేక్షణ చేయలేదు. కేవలం నలుగురు మాత్రమే అక్కడ పనులు చేపట్టారు. పైనుంచి జరిగే పరిణామాలను గమనించే అవకాశం లేదు. ఫిట్టర్‌తో సహా ముగ్గురు కార్మికులు లోపలికి దిగి తమ పనిలో నిమగ్నమై ఉన్నారు. లీకేజీని అరికట్టేందుకు తవ్విన గుంత లోతు ఎక్కువగా ఉంది. లోపలికి దిగి పనిచేస్తున్న కార్మికులకుపై నుంచి మట్టి కుప్ప ఒరిగి అక్కడున్న మట్టి గుంతలోకి తోసుకుంటూ వస్తున్న విషయాన్ని



ఎవరూ గమనించే అవకాశం లేకుండా పోయింది. అక్కడి పని స్థలంలో ఒక సూపర్‌వైజర్‌ను పర్యవేక్షణకు ఏర్పాటు చేయడంతో పాటు రక్షణ అధికారిని పరిశీలించే విధంగా ఏర్పాటు చేస్తే ప్రమాదం జరిగేది కాదన్న విషయాన్ని సంచాలకులే వెల్లడించారు. ప్రమాదం జరిగిన పని స్థలంలో లోపాలున్నాయని సింగరేణి ఆపరేషన్ సంచాలకులు శ్రీనివాస్ వెల్లడించారు. దీనిపై విచారణకు సీఎండీ బలరాం ఆదేశించారు. అధికారుల పర్యవేక్షణ లోపం కనిపిస్తుందని కార్మిక సంఘాలు ఆరోపిస్తున్నాయి.

**పెరిగిన ప్రమాదాలు**

సింగరేణిలో గత ఏడాది కంటే మరణ ప్రమాదాలు పెరిగాయి. 2023 ఏడాదిలో అయిదు మరణ ప్రమాదాలు నమోదు కాగా ఈ ఏడాది ఆరు నెలల్లోనే అయిదుగురు కార్మికులు మృతి చెందారు. గత ఏడాది ఆర్జీ-3 ప్రాంతంలో ఇద్దరు కార్మికులు మరణించారు. ఈ ఏడాది ఇప్పటి వరకు ఆర్జీ-3 డివిజన్‌లోనే ఇద్దరు కార్మికులు దుర్మరణం చెందారు. గత ఏడాది జరిగిన అయిదు మరణాల్లో ఆర్జీ-3 ప్రాంతంలోనే ఇద్దరున్నారు. ఈ ఏడాది కూడా ఇప్పటి వరకు జరిగిన మరణాల్లో ఇద్దరు ఆర్జీ-3 ప్రాంతంలోనే ఉండటం ప్రమాదాలపై అధికారుల పర్యవేక్షణ ఏ విధంగా ఉందో అర్థమవుతుంది.

# ముందస్తు ఎత్తిపోతలే దిక్కు

జగిత్యాల : ఈ ఏడాది జూన్ 1 నుంచి ఇప్పటివరకు ఉమ్మడి జిల్లాలో సాధారణ వర్షపాతం నమోదైనట్లు గణాంకాలు వెల్లడిస్తున్నా ప్రధాన ప్రాజెక్టులు, చెరువుల్లోకి ఆశించినట్లుగా నీరు చేరలేదు. దీంతో ఇప్పట్లో ఆయకట్టుకు నీటిని వదిలే పరిస్థితి లేకపోగా రైతులు భూగర్భ జలాలతోనే సాగు కొనసాగిస్తున్నారు. గత సంవత్సరాల్లో ఆలస్యంగా భారీ వర్షాలు కురిసి పెద్దఎత్తున మిగులు జలాలు సముద్రంలోకి తరలిపోగా ప్రస్తుత సీజన్‌లో ముందస్తు ఎత్తిపోతలను చేపట్టి నీటిని నిల్వచేస్తే ఆయకట్టుకు భరోసా కలగనుంది.

**శ్రీరామసాగర్ జలాశయం**

ఎస్సారెస్పీ పునరుజ్జీవ పథకంలో భాగంగా నిరుడు తొలిసారి వరదకాలువ ద్వారా శ్రీరామసాగర్‌లోకి ఎత్తిపోతలను ప్రారంభించగా భారీవర్షాలతో తదుపరి ఎత్తిపోతలకు అవకాశం కలగలేదు. ఈ నేపథ్యంలో ప్రస్తుతం వరదకాలువ ద్వారా ఎస్సారెస్పీలోకి నీటిని ఎత్తిపోసేలా చర్యలు తీసుకోవాల్సి ఉంది. ఎస్సారెస్పీలో నీటినిల్వ 112 టీఎంసీలనుంచి 90.313 ప్రస్తుతం 80.500 టీఎంసీలకు తగ్గినందున



ప్రాజెక్టులో పూడికతీత, గరిష్ఠస్థాయి నీటినిల్వను ముమ్మందు చేపడితేనే జిల్లాకు జల అభయం కలుగుతుంది.

**ఇతరత్రా అవకాశం**

గోదావరిపై జగిత్యాల, నిర్మల్ జిల్లాల మధ్యలో నిర్మించిన సదర్‌మాట్ ప్రాజెక్టులో 1.58 టీఎంసీల నీటి నిల్వకు అవకాశం ఉండగా నిల్వనీటిని ఎత్తిపోసి కాకతీయ, వరదకాలువలోకి తరలించే అవకాశముంది. ఎల్లంపల్లి ప్రాజెక్టు నీటిని పెద్దపల్లి జిల్లాలోని దేవికొండవద్ద తలపెట్టిన పత్తిపాక జలాశయానికి తరలించవచ్చు. బీర్‌పూర్ మండలంలో రూ.153 కోట్లతో చేపట్టిన రోళ్లవాగు ప్రాజెక్టులోకి రంగసాగర్ వద్ద గోదావరి నుంచి ఎత్తిపోతలు చేపట్టవచ్చు. వరదకాలువ నుంచి వేములవాడ నియోజకవర్గంలోని పలు ప్రాంతాలకు చేపట్టిన ఎత్తిపోతల పథకాలను పూర్తి చేయాల్సి ఉంది. గోదావరి నుంచి 28 గ్రామాలకు ఎత్తిపోతల పథకాల పూర్తి, పాతవాటి మరమ్మతుకు నిధుల విడుదల ద్వారా ఉమ్మడి జిల్లాకు జల అభయం కలుగుతుంది.

## ఆక్వాహబ్ ప్రకటనలకే పరిమితం

సిరిసిల్ల : దేశవ్యాప్తంగా ఎక్కడైనా ప్రాజెక్టులు, పరిశ్రమలను స్థాపించాలంటే భూసేకరణ పెద్ద సవాల్‌గా మారుతుంది. ప్రభుత్వాలకు భూములు దొరక్క ఇబ్బంది పడుతుంటే జిల్లాలో పరిస్థితి అందుకు భిన్నంగా ఉంది. రెండేళ్ల క్రితం మధ్యమానేరు జలాశయంలో కేజ్ కల్చర్ విధానంలో మంచినీటిలో చేపలను పెంచి ఎగుమతి చేసేలా ఆక్వాహబ్ ఏర్పాటుకు ప్రణాళికలు సిద్ధం చేశారు. దీనికి అవసరమైన 364.99 ఎకరాల భూమిని తంగళ్లపల్లి మండలం చీర్లవంచ, చింతల్‌ఠాణాల్లోని ముంపు ప్రాంతాల్లో సేకరించారు. 2023 జులైలో అప్పటి ప్రభుత్వం శంకుస్థాపనకు కూడా సిద్ధమైంది. కొన్ని అనివార్య కారణాలతో కార్యక్రమం రద్దయింది. ఇక అప్పటి నుంచి దీని ఊసేలేకుండా పోయింది. ఇటీవల ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, పరిశ్రమలశాఖ మంత్రి శ్రీధర్‌బాబు కలిసి తెలంగాణ స్టేట్ ఇండస్ట్రియల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ (టీఎస్‌ఐఐసీ) ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. రాష్ట్రంలో పారిశ్రామిక అభివృద్ధికి సంబంధించి కొత్త పాలసీలను రూపొందించాలని అధికారులకు సూచించారు. మధ్యమానేరుకు కాళేశ్వరం, ఇటు ఎస్సారెస్పీల నుంచి ఏడాది పొడవునా నీటి లభ్యత ఉంటుంది. ఆక్వా రంగంలో ఎగుమతి రకాల ఉత్పత్తులతో సత్తాచాటాలనుకునే కంపెనీలకు ఇక్కడ వనరులు పుష్కలంగా ఉన్నాయి.

ముందుకొచ్చిన మూడు కంపెనీలు

అంతర్జాతీయంగా మంచినీటిలో పెరిగే తిలాఫియా చేపలకు మంచి మార్కెటింగ్ ఉంది. జలాశయంలో కేజ్ కల్చర్ యూనిట్లను ఏర్పాటు చేసి చేపలను పెంచుతారు. దీనికోసం 2022లో ఫిషిన్ అనే సంస్థ తొలి విడత రూ.వెయ్యి కోట్ల పెట్టుబడితో ముందుకొచ్చింది. అప్పటి ప్రభుత్వంతో ఒప్పందం కూడా చేసుకుంది. నమూనాగా ఏడాది పాటు చేప పిల్లలను వేసి పెంపకం కూడా చేశారు. ఈ కంపెనీతోపాటు ఆక్వా ఉత్పత్తుల ఎగుమతుల్లో పేరున్న ఆనంద్ గ్రూప్స్, ఫ్రెష్ టు హోమ్ సంస్థలు కూడా ముందుకొచ్చాయి. ప్రభుత్వంతో అవగాహన ఒప్పందం చేసుకున్నాయి. జిల్లా రెవెన్యూశాఖ ఇక్కడ పరిశ్రమలు స్థాపించేందుకు అనువుగా స్థలాన్ని సేకరించి టీఎస్‌ఐఐసీకి అప్పగించింది. దీనిలో మౌలిక వసతుల కల్పనకు హైదరాబాద్‌కు చెందిన ప్రైవేటు సంస్థతో నమూనాను సిద్ధం చేయించారు. దీనికి టీఎస్‌ఐఐసీ ద్వారా రూ. 102.9 కోట్లతో అభివృద్ధి పనులు చేసేలా ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. నిధుల కేటాయింపులో జాప్యం, తర్వాత వరుసగా అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికలు రావడం, ప్రభుత్వం మారడంతో దీనిపై మాట్లాడేవారు లేరు. గత ప్రభుత్వంతో ఒప్పందం చేసుకున్న మూడు కంపెనీలు కొత్త ప్రభుత్వంలోని ఆయా శాఖల మంత్రులను కలిసి ప్రాజెక్టును ముందుకు తీసుకెళ్లేలా ఉన్నతాధికారులతో సంప్రదింపులు జరుపుతున్నట్లు సమాచారం. ఇక్కడి వనరుల వినియోగం, పరిశ్రమల విస్తరణ, ఉపాధి అవకాశాలను ప్రస్తుత ప్రభుత్వంలోని పెద్దల అంగీకారంతో ముందుకు తీసుకెళ్లే యోచనలో అధికారులు ఉన్నారు.

ప్రభుత్వం దృష్టి సారిస్తేనే...

జలాశయం 750 హెక్టార్ల విస్తీర్ణంలో ఉంది. దీనిలో ఒక శాతం మాత్రం కంపెనీలు చేపల పెంపకానికి కేటాయిస్తారు. ఇతర యూనిట్లకు జలాశయం సమీపంలోని స్థలాలను ప్లాట్లుగా చేసి ఇస్తారు. జలాశయం సామర్థ్యం 27.5 టీఎంసీలు. దీనిలో 15 ఎంఎల్‌డీలు (మిలియన్ లీటర్ ఫర్ డే) నీటిని ఇంటిగ్రేటెడ్ కేజ్ కల్చర్ పద్ధతిలో చేపల పెంపకానికి వినియోగిస్తారు. ఎగుమతులు చేసేందుకు శుద్ధి చేయడం, ప్రాసెసింగ్, ప్యాకింగ్ యూనిట్ల ద్వారా 10 ఎంఎల్‌డీల నీరు విడుదలవుతుంది. ఈ నీటిని శుద్ధి చేసేందుకు 13 ఎంఎల్‌డీల సామర్థ్యంతో ఈటీపీ, ఎస్టీపీలను నిర్మిస్తారు. ఇక్కడ ఆక్వాహబ్ ఏర్పాటైతే ఏటా సగటున 85 వేల టన్నుల చేపలను జిల్లా నుంచి ఎగుమతి చేయాలనేది లక్ష్యం. వీటిలో పని చేసేందుకు దశల వారీగా 20 వేల మందికి ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి లభించనుంది. పరిశ్రమలు స్థాపించబోయే కంపెనీలకు తొలుత ప్రభుత్వమే టీఎస్‌ఐఐసీ ద్వారా మౌలిక వసతులు కల్పించి ఇవ్వాలని నిర్ణయించారు. కానీ ప్రస్తుతం యూఎల్‌డీ (అన్ డెవలప్‌డ్‌ల్యాండ్)ను అందించే ఆలోచనలో ఉన్నారు. దీంతో ప్రభుత్వానికి మౌలిక వసతులకయ్యే ఖర్చు తగ్గుతుందని రాష్ట్ర పరిశ్రమల అభివృద్ధి కమిటీ నిర్ణయించినట్లు తెలుస్తుంది. జిల్లాలో ఆక్వాహబ్ ఏర్పాటు అంశం ప్రస్తుత ప్రభుత్వ నిర్ణయంపై ఆధారపడి ఉంది.

ప్రణాళికలు సిద్ధం చేశాం

రెవెన్యూశాఖ గుర్తించిన ప్రభుత్వ స్థలాన్ని సర్వే చేసి అప్పగించారు. ఆక్వాహబ్‌లో మౌలిక వసతుల కల్పనకు అవసరమైన ప్రణాళికలు సిద్ధం చేశాం. టెండర్లు పిలిచి పనులు అప్పగించాల్సి ఉంది. ప్రభుత్వ నిర్ణయంకోసం వేచిచూస్తున్నాం. వసతుల కల్పన పూర్తయితే మరిన్ని కంపెనీలు ముందుకు వచ్చే అవకాశం ఉంటుంది.- బహుగుణ, జిల్లా మేనేజర్, టీఎస్‌ఐఐసీ

## అనుమతి కొంత.. తరలింపు కొండంత

పెద్దపల్లి : జిల్లాలో ఓవైపు ఇటుక బట్టీలకు చెరువు మట్టి రవాణా జరుగుతుండగా, మరోవైపు స్థిరాస్తి వెంచర్లకు, ఇళ్ల నిర్మాణాలకు ఎర్ర మట్టి తరలింపు జోరుగా సాగుతోంది. అనుమతించిన పరిమాణం కంటే ఎక్కువ మొత్తంలో మట్టి తరలించేందుకు రాత్రి సమయమే అనువైందిగా భావిస్తుండటంతో చీకట్లో అక్రమ దందా జోరుగా సాగుతోంది. అనుమతి పత్రాల అవసరం ఉండకపోగా ట్రాఫిక్ ఇబ్బందులు కూడా ఉండవు. అధిక లోడ్‌పై ప్రశ్నించే వారే ఉండరు. దీంతో అక్రమార్కులు నిశీధిలోనే మట్టి రవాణాకు తెగబడుతున్నారు.

రూటు.. సప'రేటు'

అనుమతులు లేకుండా మట్టి తరలిస్తున్న అక్రమార్కులు మార్గమధ్యంలో ఓ గ్రామస్థులు అడ్డగిస్తే, మరో ఊరి మీదుగా తీసుకెళ్లడాన్ని అలవాటుగా మార్చుకున్నారు.

రెండు రోజుల కిందట పెద్దపల్లి మండలం తుర్కలమద్దికుంట నుంచి మట్టి రవాణాకు గ్రామస్థులు అభ్యంతరం తెలపగా, పక్కనే ఉన్న జూలపల్లి మండలం కాచాపూర్ శివారు నుంచి ఎర్రమట్టిని తరలిస్తున్నారు. రాత్రి సమయంలో మట్టి తరలింపుపై నిట్టూరు గ్రామస్థులు అభ్యంతరం తెలపగా రవాణాదారులు అక్కడి నాయకులను తమవైపు తిప్పుకొన్నారు.

ఈ ఎర్రమట్టిని జిల్లా కేంద్రం చుట్టూ విస్తరించిన స్థిరాస్తి వెంచర్లు, కొత్తగా నిర్మిస్తున్న భవనాలకు వినియోగిస్తున్నారు. ప్రభుత్వానికి ఎలాంటి రాయల్టీ చెల్లించకుండా రాత్రి వేళల్లో జరుగుతున్న మట్టి రవాణాపై మైనింగ్ అధికారులు దృష్టి సారించాల్సి ఉంది.

'ఎల్లంపల్లి'నీ వదలడం లేదు

ఇటుకల తయారీ కోసం చెరువు మట్టి తరలిస్తున్న బట్టీల యజమానులు అనుమతి పొందిన పరిమాణం కంటే ఎక్కువ మొత్తంలో రవాణా చేస్తున్నారనే ఆరోపణలున్నాయి. దీనికితోడు ఇన్నాళ్లూ చెరువు మట్టికే పరిమితమైన బట్టీల నిర్వాహకులు ఇటీవల ఎల్లంపల్లి బ్యాక్‌వాటర్ నిలిచే ప్రాంతం నుంచి కూడా తీసుకెళ్లేందుకు అనుమతి పొందారు. దీంతో వారం రోజులుగా ఎల్లంపల్లి గ్రామం మీదుగా జిల్లాలోని వివిధ ఇటుక బట్టీలకు పెద్ద ఎత్తున మట్టి రవాణా జరుగుతోంది. ఇక్కడ కూడా అనుమతి తీసుకున్న పరిమాణం కంటే తరలించిన మట్టి అధికంగా ఉంటోంది. ఈ మట్టి రవాణా పరిమాణంపై నీటిపారుదల, మైనింగ్ శాఖల అధికారుల వద్ద కనీస గణాంకాలు కూడా అందుబాటులో లేవు.

రవాణాపై ప్రత్యేక నిఘా

జిల్లాలో రాత్రి సమయంలో జరుగుతున్న మట్టి రవాణాపై ప్రత్యేక నిఘా ఉంచాం. అక్రమ రవాణాను అరికడతాం. జిల్లాలో నాలుగు క్వారీలకు మాత్రమే అనుమతి ఉంది. అనుమతి లేని క్వారీలపై విచారణ జరిపి, బాధ్యులపై చర్యలు తీసుకుంటాం.
-పి.శ్రీనివాస్, భూగర్భ గనుల శాఖ ఏడీ

## ఈ-సిగరెట్.. సరదాగా తాగినా చేటే!



హైదరాబాద్: నగర యువతలో ఈ-సిగరెట్ (ఎలక్ట్రానిక్ సిగరెట్) వినియోగం భారీగా పెరుగుతున్నట్లు అధ్యయనాలు చెబుతున్నాయి. సాధారణ సిగరెట్‌తో పోల్చితే ఇది ప్రమాదకరం కాదనే ధీమాతో చాలామంది ఈ-సిగరెట్‌ను అలవాటుగా చేసుకుంటున్నట్లు వైద్యులు చెబుతున్నారు. ఏ సిగరెట్ తాగినా సరే...అనారోగ్యం తప్పదని హెచ్చరిస్తున్నారు. గుండె వ్యాధులతోపాటు నోటి, ఊపిరితిత్తుల క్యాన్సర్లకు ఈ-సిగరెట్లు కూడా కారణమేనని స్పష్టం చేస్తున్నారు. ప్రభుత్వ ఎంఎన్‌జే క్యాన్సర్ ఆసుపత్రికి వస్తున్న క్యాన్సర్ కేసుల్లో 25-30 శాతం పొగాకు సంబంధించినవేనని వైద్యులు వెల్లడిస్తున్నారు. ముఖ్యంగా 25-40 ఏళ్ల వయస్సులో యువత సైతం నోటి, ఊపిరితిత్తుల క్యాన్సర్ల బారిన పడుతున్నారని పేర్కొంటున్నారు. మే 31న పొగాకు వ్యతిరేక దినం సందర్భంగా ప్రత్యేక కథనం...

అత్యంత ప్రమాదం: సాధారణ సిగరెట్లలో 7 వేల రకాల రసాయనాలుంటాయి. వీటిలో 70 రకాల రసాయనాలు క్యాన్సర్ కారకాలు. పలు రసాయనాలు నేరుగా మనిషి దేహంపై ప్రభావం చూపుతాయి.

పొగకు బానిస అయితే... ఆ అలవాటు నుంచి బయటపడలేక ఎంతోమంది సతమతమవుతుంటారు. మరికొందరు ఈ-సిగరెట్ తాగేందుకు అలవాటు పడుతున్నారు. యువత కూడా.. ఇదో ఫ్యాషన్‌గా ఈ-సిగరెట్లకు అలవాటు పడుతున్నారు. తర్వాత తెలియకుండానే వీటికి బానిసలవుతున్నారు.

పబ్‌కల్చర్ పెరిగిన తర్వాత ఈ-సిగరెట్ వాడకం మరింత పెరిగింది. ఈ-సిగరెట్‌ను ఎలక్ట్రానిక్ నికోటిన్ డెలివరీ సిస్టమ్(ఈఎన్‌డీఎస్) అని కూడా వ్యవహరిస్తారు. ద్రవరూపంలో ఉన్న నికోటిక్ సిగరెట్ లాంటి ఎలక్ట్రానిక్ పరికరంలో ఉంటుంది. అందులో బ్యాటరీ అమర్చి ఉంటుంది. నోట్లో పెట్టుకొని పీల్చినప్పుడు బ్యాటరీ నికోటిన్‌ను మండిస్తుంది. సిగరెట్‌లా మండుతుంది. సాధారణ సిగరెట్ కంటే ఇందులో దీర్ఘంగా పీల్చే అవకాశం ఉంటుంది. దీంతో ధారాళంగా పొగ ఊపిరితిత్తులను చేరుతుంది. నికోటిక్ ఎక్కువగా తీసుకోవడం వల్ల అధిక రక్తపోటు, గుండెపోటు ఇతర అనారోగ్య సమస్యలు వచ్చే ప్రమాదం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. : పొగ తాగడం అనేది క్యాన్సర్‌కు దగ్గర దారి అని అపోలో కేన్సర్ ఇన్‌స్టిట్యూట్ డైరెక్టర్ డాక్టర్ విజయానందరెడ్డి అన్నారు. నగరంలో పొగ తాగే వాళ్ల శాతం బాగా పెరుగుతోందన్నారు. : ఇంట్లో పొగ తాగే వారి కారణంగా మిగతా సభ్యులు కూడా అనారోగ్య సమస్యలు ఎదుర్కొంటున్నారు. ఇంట్లో భర్త లేదా భార్యలో ఎవరికి పొగతాగే అలవాటు ఉన్నాసరే...ఇతర కుటుంబ సభ్యులకు 30 శాతం కేన్సర్, 91శాతం గుండెజబ్బులు వచ్చే ప్రమాదం ఉంది.

ఎట్టి పరిస్థితుల్లోనూ సురక్షితం కాదు

– డాక్టర్ శ్రీకృష్ణ రాఘవేంద్ర, కన్సల్టెంట్ జనరల్ ఫిజీషియన్, కామినేని హాస్పిటల్స్

ఈ-సిగరెట్లు సురరక్షితం కాదు. వాటితో ఊపిరితిత్తుల్లో వాపు ఏర్పడటం, ఇరిటేషన్లు కలగడం, కీలక అవయవాలు దెబ్బతినే ప్రమాదం ఉంది. దీర్ఘకాలంలో నోటి, ఊపిరితిత్తుల కేన్సర్లకు దారి తీస్తుంది. నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హెల్త్ పరిశోధనలో.. ఈ-సిగరెట్లతో రక్తనాళాల పనితీరు దెబ్బతింటున్నట్లు తేలింది. గుండెవ్యాధుల ముప్పు పెరుగుతుంది. పొగతాగడం పూర్తిగా మానేయాలి. నికోటిక్ ఛూయింగ్‌గమ్, నికోటిక్ ప్యాచ్ వాడితే కొంత ప్రయోజనముంటుంది. దీనికితోడు సంకల్ప బలం, పట్టుదల ఉండాలి. ఇంకా మానలేకపోతే డీఅడిక్షన్ సెంటర్‌లో చేరి చికిత్స తీసుకోవాలి.

## చెల్లింపుల్లో జాప్యం.. పనులపై ప్రభావం



సారంగాపూర్ : మండలంలోని కోనాపూర్ ప్రభుత్వ పాఠశాలలో తరగతి గదుల కొరతతో గత ప్రభుత్వం 'మన ఊరు-మన బడి'లో భాగంగా రూ.97 లక్షలతో పక్కా భవనం, మరో రూ.25లక్షలతో డైనింగ్ హాల్, ఇతర పనులు చేపట్టారు. కేవలం గుత్తేదారుకు రూ.30 లక్షల బిల్లులు మాత్రమే రావడంతో దాదాపు రెండేళ్లుగా పనులు కొనసాగిస్తూ ఇప్పుడిప్పుడే పనులు పూర్తి చేశారు. జిల్లా వ్యాప్తంగా దాదాపు ఎంపిక చేసిన సగానికి పైగా బడుల్లో పనులు పూర్తి కాకపోవడంతో విద్యార్థులకు ఇబ్బందులు తలెత్తనున్నాయి. పాత పనులతోపాటు కొత్త పనులు పూరి చేస్తేనే ప్రభుత్వ పాఠశాలలు ప్రైవేట్‌కు దీటుగా పనిచేయనున్నాయి. సర్కారు బడుల్లో మౌలిక వసతులు కల్పించి, విద్యారంగాన్ని పటిష్ఠం చేసేందుకు గతం ప్రభుత్వం 'మన ఊరు-మన బడి' పథకం ప్రారంభించగా.. ప్రస్తుత ప్రభుత్వం ఏర్పాటు చేసిన అమ్మ ఆదర్శ కమిటీల పేరుతో అభివృద్ధి పనులు చేపడుతున్నారు. రెండేళ్ల కిందట జిల్లా వ్యాప్తంగా 274 ప్రభుత్వ పాఠశాలల్లో అభివృద్ధి పనులు పారంభించగా నిధుల లేమితో సగానికి పైగా పాఠశాలలు అసంపూర్తి పనులతో నిలిచిపోయాయి. ఇందులో దాదాపు 28 పాఠశాలలు పనులు పూర్తి కావడంతో ఎన్నికల నోటిఫికేషన్‌కు ముందు ప్రారంభించారు. ఇందులో మరిన్ని పాఠశాలల పనులు పూర్తి కాగా ప్రారంభానికి సిద్ధం చేశారు. గతంలో ఎంపిక చేసిన బడులను మినహాయించి మిగతా పాఠశాలల్లో ప్రస్తుత ప్రభుత్వ ఆదేశాలను అనుసరించి ప్రత్యేక అభివృద్ధి నిధులు(ఎస్‌డీఎఫ్), అమ్మ ఆదర్శ పాఠశాలల పథకం నిధులతో పనులు జరుగుతున్నాయి. గత పథకంలో ఎంపికైన పాఠశాలలకు నిధులు మంజూరు చేయకపోవడంతో గుత్తేదారులు అనేక చోట్ల పనులు నిలిపివేశారు. కొత్త పనులు కొనసాగుతుండడంతో పాత పనుల పురోగతిపై ఆందోళన వ్యక్తమవుతోంది.

విద్యార్థులు చేరేనా?గతంలో విద్యార్థులు లేకపోవడంతో పాఠశాలను మూసివేశారు. మూతబడిన పాఠశాలలను ప్రభుత్వం తిరిగి తెరిపిస్తామనడంతో జిల్లా వ్యాప్తంగా దాదాపు 50 పాఠశాలలను గుర్తించారు. గతంలోనే ప్రభుత్వ పాఠశాలలు ఉన్నప్పటికీ విద్యార్థులు రాకపోవడంతో మూసేయాల్సి వచ్చింది. ఒకే గ్రామంలో రెండు, మూడు పాఠశాలలు ఉండడం, గ్రామానికి ప్రైవేట్ పాఠశాలల బస్సులు రావడంతో విద్యార్థులు ముందుకు రావడంలేదు. ప్రస్తుతం ఆయా పాఠశాలను తెరిపిస్తే విద్యార్థులు వచ్చే అవకాశాలపై అధికారులు కసరత్తు చేస్తున్నారు. ప్రభుత్వం మౌలిక వసతులతోపాటు పూర్తిస్థాయిలో ఉపాధ్యాయుల నియామకం చేపట్టినప్పుడే ప్రభుత్వ పాఠశాలలకు మనుగడ ఉండనుంది.

రూ.31.49 కోట్లతో..

జిల్లాలో 788 ప్రభుత్వ పాఠశాలల్లో 4002 పనులు గుర్తించి రూ.31.49 కోట్ల నిధులు మంజూరు చేయగా పనులు కొనసాగుతున్నాయి. ఇందులో 1818 పాఠశాలల్లో మూత్రశాల మరమ్మతుకు రూ.6.36 కోట్లు, తాగునీటి కోసం 724 పాఠశాలల్లో రూ.7.24 కోట్లు, చిన్నచిన్న మరమ్మతులు 461 పాఠశాలల్లో రూ.9.22 కోట్లతో చేపట్టనున్నారు. అలాగే 809 పాఠశాలల్లో రూ.2.02 కోట్లు, 57 పట్టణ పాఠశాలల్లో బాలికల మూత్రశాలల నిర్మాణానికి రూ.1.99కోట్లు, గ్రామీణ ప్రాంతాల్లోని 133 పాఠశాలల్లో రూ.4.65 కోట్లతో నిర్మాణాలు చేపడుతున్నారు. ఇందుకు అవసరమైనన మౌలిక వసతులు, బాలికల మూత్రశాలల నిర్మాణాలు, తాగునీటి అవసరాలు, మైనర్, మేజర్ మరమ్మతు పనులు, నిరుపయోగంగా ఉన్న మూత్రశాలల పునరుద్ధరణ, పాఠశాల పరిసర ప్రాంతాల్లో పారిశుద్ధ్యం, ఇతర పనులు, సౌరశక్తి విద్యుత్తు పరికరాలు ఏర్పాటు, పాఠశాల యూనిఫాం తయారీపై వ్యయం చేయనున్నారు.

## ఈ నామ్‌కే వాస్తే!

హుజూరాబాద్ : వ్యవసాయ మార్కెట్‌లలో మోసాలను అరికట్టి రైతులకు గిట్టుబాటు ధర కల్పించే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం జాతీయ వ్యవసాయ విపణి(ఈ-నామ్) విధానాన్ని తీసుకొచ్చింది. కానీ ఎనిమిదేళ్లు దాటుతున్నా సాంకేతిక కారణాలతో పూర్తిస్థాయిలో అమలు కావడం లేదు. ఫలితంగా మార్కెట్‌లలో కమీషన్ ఏజెంట్లు, వ్యాపారుల హవానే కొనసాగుతూ సేటు చెప్పిందే ధర అన్న చందంగా మారడంతో రైతులకు గిట్టుబాటు ధర లభించక నష్టపోతూనే ఉన్నారు.

ఎనిమిది విపణుల్లో.. కేంద్ర ప్రభుత్వం 2016లో ఈ-నామ్‌ను ప్రారంభించి దేశవ్యాప్తంగా 615 వ్యవసాయ మార్కెట్లను పరిధిలోకి చేర్చింది. కరీంనగర్, జమ్మికుంట, చొప్పదండి, గంగాధర, గొల్లపల్లి, జగిత్యాల, మెట్‌పల్లి, పెద్దపల్లి మార్కెట్లు ఈ-నామ్ పరిధిలో ఉన్నాయి కానీ.. పలు మార్కెట్లకు సాంకేతిక పరికరాలను సమకూర్చకపోవడంతో ఈ-నామ్ అమలుకు నోచుకోవడం లేదు. పంట ఉత్పత్తులకు మంచి ధర వచ్చే అవకాశాలు ఉన్నప్పటికీ మార్కెట్లలో ఈ-నామ్ ద్వారా కొనుగోలు చేయకుండా వ్యాపారులు రైతుల దృష్టిని మళ్లిస్తున్నారు. ఈ-నామ్ ద్వారా కొనుగోలు చేస్తే సమయానికి డబ్బులు అందవని, బ్యాంకు ఖాతాలో జమ చేస్తే రుణాల కింద రికవరీ చేస్తారని, అదే తమకు అమ్మితే వెంటనే డబ్బులు ఇస్తామని నమ్మబలుకుతున్నారు. ప్రస్తుతం పంట ఉత్పత్తులు వస్తున్నాయి. రైతులు మార్కెట్లకు రాగానే కమీషన్ ఏజెంట్లు, వ్యాపారులు రంగ ప్రవేశం చేసి తేమ శాతం ఎక్కువగా ఉందని ఆరబెట్టుకోవాలని చెబుతున్నారు. అలా రైతులను నాలుగైదు రోజులు మార్కెట్లలోనే ఉంచడంతో విసుగు చెంది ఎంతకో కొంతకు అమ్ముకోవాల్సిన పరిస్థితి వస్తోంది.

కొనేది స్థానిక వ్యాపారులే..ఈ-నామ్ ద్వారా దేశంలోని వివిధ రాష్ట్రాలకు చెందిన వ్యాపారులు పోటీ పడటం వల్ల రైతులు తాము ఆశించిన ధర కంటే ఎక్కువే వస్తుంది. మార్కెట్లను జాతీయ సర్వర్‌కు అనుసంధాన్న చేయకపోవడంతో స్థానిక మార్కెట్ల పరిధిలోని వ్యాపారులే సరకులను కొనుగోలు చేస్తున్నారు. వాస్తవానికి గేట్ ఎంట్రీ, లాట్ నంబరు కేటాయింపు, బిడ్డింగ్ వంటి ప్రక్రియ చేపట్టాలి. విక్రయానికి వచ్చిన పంట ఉత్పత్తులను ప్లాట్‌ఫాంలపై కుప్పగా పోసి వాటి చిత్రాలు, వీడియోలు తీసి దేశవ్యాప్త సర్వర్ ద్వారా అప్‌లోడ్ చేయాలి. నిర్ణీత సమయంలో ఆన్‌లైన్‌లో వీక్షించే వ్యాపారులు సరకును ఎంత ధరకు కొనుగోలు చేస్తున్నారనే వివరాలను కోట్ చేస్తారు. బిడ్డింగ్ అనంతరం జరిగే డిక్లరేషన్‌లో ఏ వ్యాపారి ఎంత ధరకు ఏ సరకును కొనుగోలు చేశారనే వివరాలు తెలుస్తుంది కానీ.. ఇవేవీ లేకుండానే ఈ-నామ్ విధానానికి తూట్లు పొడుస్తున్నారు. సాంకేతికంగా ఇబ్బందులు తలెత్తకుండా స్థానిక వ్యాపారులతో ధర కుదిరిన రోజు రైతుల పంట వివరాలను సిబ్బంది ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నారు. వెంటనే స్థానిక వ్యాపారులతో ధరలు కోట్ చేయిస్తూ ఈ-నామ్ విధానంలో కొనుగోలు చేసినట్లు చూపిస్తున్నారు. పేరు జాతీయ వ్యవసాయ విపణి.. అమలయ్యేది మాత్రం స్థానిక ఈ-నామ్ విధానం అమలవుతోంది. రైతులు ఈ-నామ్ విధానంలోనే వ్యవసాయోత్పత్తులు అమ్ముకోవాలని మార్కెటింగ్ శాఖ అధికారులు చెబుతున్నా ఇదెక్కడా అమలు కాకపోవడం గమనార్హం.

అమలైతే రెట్టింపు ఆదాయం

ఉమ్మడి జిల్లాలోని 39 వ్యవసాయ మార్కెట్లలో ప్రతీ సీజన్‌లో వందల కోట్ల రూపాయల విలువైన పంట ఉత్పత్తుల క్రయవిక్రయాలు జరుగుతున్నాయి. వీటి ద్వారా మార్కెట్లకు ఆదాయం సమకూరుతోంది. 2023-24 సంవత్సరానికి ఉమ్మడి జిల్లాలోని మార్కెట్ల ఆదాయం రూ.86.94 కోట్లు సమకూరేలా లక్ష్యాన్ని నిర్దేశించగా.. నిర్ణీత లక్ష్యాన్ని అధిగమించి రూ.96.21 కోట్ల ఆదాయం వచ్చింది. అదే ఎనిమిది మార్కెట్లలో ఈ-నామ్ విధానం పక్కాగా అమలైతే జీరో వ్యాపారానికి పూర్తిస్థాయిలో అడ్డుకట్ట పడి ఆదాయం రెట్టింపయ్యే అవకాశం ఉంది.

ప్రయోజనాలు ఇలా..మార్కెట్లలోని అన్ని విభాగాలను ఈ-నామ్ విధానంలో కంప్యూటరీకరిస్తారు.రైతులు పంట ఉత్పత్తులను మార్కెట్‌కు తేగానే నాణ్యతను పరీక్షించి గ్రేడింగ్ వివరాలు, లాట్ నంబర్లను ఆన్‌లైన్‌లో నమోదు చేస్తారు.
ఇతర రాష్ట్రాలు, జిల్లాల వ్యాపారులు ఖరీదు చేసేలా ప్రత్యేక ఏర్పాట్లు
కనీస మద్దతు ధరకు తక్కువ కోట్ చేయకుండా ఆన్‌లైన్‌లో ఏర్పాట్లు
నాణ్యత ఆధారంగా దేశవ్యాప్తంగా ఉన్న వ్యాపారులు ధరను కోట్ చేస్తారు. తద్వారా వ్యాపారుల మధ్య పోటీ పెరుగుతుంది. దేశంలోని ఏ వ్యాపారి ఎక్కువ ధర కోట్ చేస్తే వారికే పంట ఉత్పత్తులను అమ్ముకోవచ్చు. రైతులకు గిట్టుబాటు ధర లభించడంతో పాటు అదే రోజు ఆన్‌లైన్‌లో రైతుల జరుగుతుంది.

## నిధులు మింగేసి.. నాలాలను వదిలేసి

హైదరాబాద్: రూ.వెయ్యి కోట్లతో నాలాల ఆధునికీకరిస్తామంటూ మూడేళ్ల క్రితం చేపట్టిన వ్యూహాత్మక నాలాల అభివృద్ధి కార్యక్రమం(ఎస్ఎన్‌డీపీ)పై ప్రశ్నలు రేకెత్తుతున్నాయి. నిధులు ఖర్చయినా బస్తీలు, కాలనీల్లో ముంపు ఆగట్లేదు. నాలాల పొడవునా జాలీలు లేక ఇటీవలే ఇద్దరు మృత్యువాతపడగా గురువారం వానతో రెండుచోట్ల నాలా గోడలు కూలిపోయి సమీప బస్తీలు, కాలనీలు నీట మునిగాయి. నాలా ఆక్రమణలను అడ్డుకోకపోతే ఇళ్ల మీదుగా వరద పోటెత్తుతుందని దిల్‌సుక్‌నగర్‌లో చోటుచేసుకున్న ఘటన స్పష్టం చేస్తోంది. పరిస్థితి ఇలాగే కొనసాగితే.. భవిష్యత్తులో నగరంలోని వందల కిలోమీటర్ల నాలాలు కొద్దికొద్దిగా కుప్పకూలుతాయనే ఆందోళన వ్యక్తమవుతోంది.రూ.985 కోట్లతో..: 2020 అక్టోబరులో భారీ వర్షంతో మహేశ్వరం, ఎల్బీనగర్ నియోజకవర్గాల పరిధిలోని వందలాదికాలనీలు రెండు నెలలపాటు ముంపులో కొట్టుమిట్టాడాయి. దీంతో నాలాలను ఆధునికీకరించి కొత్తవాటినీ నిర్మిస్తామని జీహెచ్ఎంసీ రూ.985 కోట్ల పనులు చేపట్టింది. మరో రూ.2,500 కోట్లతో రెండోదశ పనులు చేపడతామని అప్పట్లో జీహెచ్ఎంసీ ప్రభుత్వానికి



ప్రతిపాదనలు పంపింది. తొలుత చేపట్టిన పనులనే ఇంజినీర్లు పూర్తి చేయలేదు. పాతబస్తీలో పనులు ఎక్కడికక్కడ పడకేశాయి. సరూర్‌నగర్ చెరువుతో ముడిపడిన నాలా పనులు, ఇతర తటాకాల దిగువనున్న నాలాలు, హుస్సేన్‌సాగర్ వరద నాలా రక్షణగోడ పనులు నిధుల సమస్యతో అయోమయంలో పడ్డాయి.

ఆక్రమణలతోనే ముప్పు..

రెండు నాలా ప్రమాదాలకు నాలా ఆక్రమణలే కారణమన్న వాదన వినిపిస్తోంది. బంజారాహిల్స్ ఉదయ్‌నగర్ నాలాపై అనేక నిర్మాణాలతో వెడల్పు తగ్గిపోయింది. వరద తీవ్రతతో గోడలు కొట్టుకుపోయి, రోడ్డు కోతకు గురైందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేశారు.

సరూర్‌నగర్ చెరువు వరద నాలా శంకేశ్వర్ బజార్ మీదుగా వెళ్లి మూసీలో కలుస్తుంది. శివగంగా థియేటర్‌వద్ద ఇటీవల నాలాపై ఓ నిర్మాణంతో విస్తీర్ణం తగ్గింది. ఎగువ నుంచి వరద ధాటికి రక్షణ గోడ తెగిపోయిందని స్థానికులు తెలిపారు.

## పెరిగిన గడువు.. అవకాశం మెరుగు

గోదావరిఖని : సింగరేణిలో ఉద్యోగ నియామకాలకు మరి కొంత మంది దరఖాస్తు చేసుకునే అవకాశం ఏర్పడింది. మే 4 వరకు దరఖాస్తులకు చివరి గడువు విధించిన యాజమాన్యం తాజాగా జూన్ 4 వరకు పెంచింది. నెల రోజుల సమయం పెరగడంతో ఎక్కువ మంది నిరుద్యోగులు దరఖాస్తు చేసుకునే అవకాశం ఏర్పడింది. సింగరేణి సంస్థ మార్చి 14న ఉద్యోగ నియామకాలకు నోటిఫికేషన్ విడుదల చేసింది. ఎగ్జిక్యూటివ్ ఉద్యోగాలు 49, ఉద్యోగ కేడర్‌లో 278 ఖాళీలను భర్తీ చేసేందుకు నియామక ప్రక్రియను ప్రారంభించింది. దీనికోసం మార్చి 14న నోటిఫికేషన్ ఇచ్చిన యాజమాన్యం మే 4 వరకు గడువు ఇచ్చింది. ఎన్నికల నేపథ్యంలో దరఖాస్తులు చేసుకునేందుకు నిరుద్యోగులు పెద్దగా ఆసక్తి చూపలేదు. ఎన్నికల కోడ్ నేపథ్యంలో దరఖాస్తుల స్వీకరణను యాజమాన్యం ఆన్‌లైన్‌లో నిలిపివేయడంతో నెల రోజుల పాటు ఎవరూ దరఖాస్తు చేసుకోలేదు. దీంతో యాజమాన్యం జూన్ 4 వరకు గడువును పొడగించింది. నెల రోజుల పాటు సమయం ఇవ్వడంతో చాలా మంది నిరుద్యోగులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకునే అవకాశం ఉంది. సింగరేణి ప్రాంతాల్లో చాలా మంది నిరుద్యోగులు ఇంజినీరింగ్, డిప్లొమా, ఐటీఐ పూర్తి చేసి ఖాళీగా ఉన్నారు. ఆయా విద్యార్హతలతోనే యాజమాన్యం ఖాళీల భర్తీకి నోటిఫికేషన్ జారీ చేసింది. కొంత మంది ఇంజినీరింగ్ చివరి సంవత్సరం చదువుతున్న విద్యార్థులకు ముందుగా ఇచ్చిన గడువు ప్రకారం దరఖాస్తు చేసుకునే అవకాశం లేకపోగా ప్రస్తుతం గడువు పెంచడంతో వారికి సైతం అవకాశం లభించనుంది.

అధికారుల హోదా ఉద్యోగాలు 49

సింగరేణిలో అధికారుల హోదా కలిగిన ఉద్యోగ ఖాళీలు 49 భర్తీ చేయనున్నారు. ఇందులో ఇంజినీరింగ్‌లో ఎలక్ట్రికల్, మెకానికల్ కోర్సు పూర్తి చేసిన వారికి ఎగ్జిక్యూటివ్ మేనేజ్‌మెంటు ట్రైనీ హోదాలో 42



ఖాళీలను భర్తీ చేయనున్నారు. సిస్టమ్స్ మేనేజ్‌మెంట్ ట్రైనీ ద్వారా ఏడు ఖాళీలను భర్తీ చేసేందుకు నిర్ణయించారు. తాజాగా పెంచిన గడువుతో ఈ ఉద్యోగాలకు విద్యార్హత కలిగిన అభ్యర్థులు దరఖాస్తు చేసుకునే అవకాశం ఉంది.సింగరేణిలో కింది స్థాయి ఉద్యోగుల కోసం ఖాళీలను భర్తీ చేయనున్నారు. మొత్తం 278 ఖాళీలను భర్తీ చేసేందుకు నిర్ణయించిన యాజమాన్యం ఆయా పోస్టులకు అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తుంది. జూనియర్ మైనింగ్ ఇంజినీర్ ట్రైనీ ద్వారా 100, అసిస్టెంట్ ఫోర్‌మెన్ మెకానికల్ ట్రైనీ ద్వారా 9 మందిని, అసిస్టెంట్ ఫోర్‌మెన్ ఎలక్ట్రికల్ ట్రైనీ 24 ఖాళీలను భర్తీ చేయనున్నారు. ఇక ఫిట్టర్ ట్రైనీ 47, ఎలక్ట్రీషియన్ ట్రైనీ 98 ఖాళీలను భర్తీ చేయనున్నారు. విద్యార్హత ఆధారంగా అభ్యర్థులు జూన్ 4న సాయంత్రం 5 గంటల లోపు దరఖాస్తులు చేసుకునే అవకాశం యాజమాన్యం కల్పించింది.

90 శాతం రిజర్వేషన్‌తో స్థానికులకు లాభం

కోల్‌బెల్టు ప్రాంతాలు విస్తరించి ఉన్న ఉమ్మడి నాలుగు జిల్లాలకు చెందిన నిరుద్యోగులతో 90 శాతం ఖాళీలను భర్తీ చేయనున్నారు. మిగతా 10 శాతం ఇతర ప్రాంతాల వారికి వర్తింపజేస్తారు. సింగరేణి విస్తరించి ఉన్న ఉమ్మడి కరీంనగర్, ఆదిలాబాద్, వరంగల్, ఖమ్మం ఉమ్మడి జిల్లాల్లో నిరుద్యోగులకు రిజర్వేషన్ వర్తిస్తుంది. దీంతో చాలా మంది నిరుద్యోగులకు అవకాశం లభించనుంది.




## వెంకటపాలెంలో ఎన్టీఆర్ విగ్రహానికి నివాళుల్పించిన సీఎం చంద్రబాబు

అమరావతి: అసెంబ్లీ సమావేశాల ప్రారంభం నేపథ్యంలో వెంకటపాలెంలోని ఎన్టీఆర్ విగ్రహానికి సీఎం చంద్రబాబు నివాళులర్పించారు. మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో కలిసి అక్కడికి చేరుకుని విగ్రహానికి పూలమాలలు వేశారు. అనంతరం అసెంబ్లీకి బయల్దేరారు.

## పార్లమెంట్ రాజకీయాలకు కాదు.. దేశం కోసం: ప్రధాని మోదీ



రాజకీయాలు చేయడానికి పార్లమెంట్ వేదిక కాదని.. దేశం కోసం ఉందని ప్రధాని మోదీ ప్రతిపక్షాలకు హితవు పలికారు. నేడు పార్లమెంట్ సమావేశాలకు ముందు ఆయన మాట్లాడుతూ "మనం 2029 ఎన్నికల్లో మరోసారి తలపడదాం. అప్పటివరకు పార్లమెంట్‌ను మహిళలు, రైతులు, యువత జీవితాలను బాగు చేసేందుకు వాడదాం'' అని పేర్కొన్నారు. సభలో నిరంతరం గందరగోళం వల్ల కొందరు సభ్యులు తమ పాయింట్లను చెప్పలేకపోతున్నారని పేర్కొన్నారు. ప్రజలు తీర్పు ఇచ్చేశారని చెప్పిన మోదీ.. ఇక ఆ రాజకీయాల నుంచి పార్టీలు బయటకువచ్చి దేశం కోసం పని చేయాలని పిలుపునిచ్చారు. ఈసారి ప్రవేశ పెట్టబోయే బడ్జెట్ అత్యంత కీలకమైందని ప్రధాని మోదీ అభివర్ణించారు. వచ్చే ఐదేళ్లకు తమకు కార్యనిర్దేశం చేసేదిగా ఈ బడ్జెట్ ఉంటుందని పేర్కొన్నారు. అంతేకాదు.. వికసిత్ భారత్‌కు ఇది పునాది వేస్తుందని చెప్పారు. దాదాపు 60 ఏళ్ల తర్వాత మూడోసారి ఒకే ప్రభుత్వం అధికారం చేపట్టిందన్నారు. కేంద్రంలో ఎన్డీయే సర్కారు మూడోసారి కొలువుదీరిన తర్వాత తొలిసారి బడ్జెట్‌ను సమర్పించేందుకు పార్లమెంటు సోమవారం నుంచి సమావేశమైంది. ఈ సమావేశాలు ఆగస్టు 12 వరకు కొనసాగుతాయి. మంగళవారం పూర్తిస్థాయి బడ్జెట్‌ను ప్రవేశపెట్టనున్నారు. ప్రభుత్వం ఆరు బిల్లులను సభామోదం కోసం తీసుకురానుంది. కాగా, నీట్ ప్రశ్నపత్రం లీకేజీ, రైల్వే భద్రత, కావడి (కన్వర్) యాత్ర మార్గంలో హోటళ్లపై యజమానుల పేర్లు రాయాలనే నిబంధన వంటి అంశాలపై కేంద్రాన్ని ఐక్యంగా నిలదీయాలని విపక్షం భావిస్తోంది. మరోవైపు బడ్జెట్ సమావేశాల కార్యాచరణపై చర్చించేందుకు రక్షణమంత్రి రాజ్‌నాథ్ సింగ్ అధ్యక్షతన ప్రభుత్వం దీనిని నిర్వహించింది.

## హాయ్ జగన్ అంటూ దగ్గరకు వెళ్లి...




అమరావతి: ఏపీ అసెంబ్లీ సమావేశాలు నేటి నుంచి ప్రారంభమయ్యాయి. ఈ క్రమంలోనే అసెంబ్లీ హాల్‌లో ఆసక్తికర ఘటన చోటు చేసుకుంది. అసెంబ్లీ హాల్‌లో వైసీపీ అధినేత జగన్ భుజంపై చెయ్యి వేసి మరీ టీడీపీ ఎమ్మెల్యే రఘురామ కృష్ణరాజు మాట్లాడటం అక్కడున్న వారందరినీ ఆశ్చర్యానికి గురి చేసింది. కనిపించిన వెంటనే హాయ్ జగన్ అంటూ రఘురామ ఆయన వద్దకు వెళ్లి మరీ పలకరించారు. ఇది జగన్‌కు కూడా ఒకింత ఆశ్చర్యాన్ని కలిగించి ఉండవచ్చు. ఇక ఇద్దరూ అసెంబ్లీలోనే ఉన్నారు కాబట్టి.. మరోసారి కూడా వారిద్దరూ ఒకరికొకరు తారస పడ్డారు. తర్వాత కలిసినప్పుడు 'రోజూ అసెంబ్లీకి రా జగన్' అని రఘురామ కోరారు. 'రెగ్యులర్ వస్తాను...మీరే చూస్తరుగా' అని జగన్ వినమ్రంగా చెప్పారు. ప్రతిపక్షం లేకపోతే ఎలా అని రఘురామ పేర్కొన్నారు. ఒకరకంగా ప్రతిపక్షం అసెంబ్లీలో ఉంటేనే సమావేశాలు మజాగా ఉంటాయన్నట్టుగా మాట్లాడారు. జగన్ చేతిలో చేయు వేసి మరీ రఘురామ మాట్లాడటం ఆసక్తిని రేకెత్తించింది. అంతటితో రఘురామ ఆగితే బాగానే ఉంటుంది. అసెంబ్లీకి ప్రతిరోజూ వస్తే బాగుంటుందని మరోసారి జగన్‌కు సూచించారు. పైగా అటుగా వెళుతున్న ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్‌ను తనకు జగన్ పక్కనే సీటు వేయించాలని రఘురామ కోరారు. తప్పని సరిగా అంటూ లాబీల్లో నవ్వుకుంటూ కేశవ్ అక్కడి నుంచి వెళ్లిపోయారు. వైసీపీ ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలు అందరూ కూడా రఘురామకు విష్ చేసి వెళ్లడం ఆసక్తికరంగా అనిపించింది.

## పవన్ మనసులో నుంచి పుట్టిన గొప్ప ఆలోచనే కార్యకర్తలకు బీమా

అమరావతి : కార్యకర్తలకు భద్రత, భరోసా కల్పించే క్రియాశీలక సభ్యత్వంలో అందరూ భాగస్వామ్యం కావాలని జనసేన నేత నాగబాబు అన్నారు. సోమవారం మీడియాతో మాట్లాడుతూ.. జనసేన అధినేత, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ మనసులో నుంచి పుట్టిన గొప్ప ఆలోచన "కార్యకర్తలకు బీమా" అని చెప్పుకొచ్చారు. ఇటీవల వేరు వేరు ప్రమాదాల్లో మృతి చెందిన 81 మంది క్రియాశీలక సభ్యుల కుటుంబాలకు రూ.4.05 కోట్ల బీమా చెక్కులను మంగళగిరి కేంద్ర కార్యాలయంలో పంపిణీ చేయడం జరిగిందని తెలిపారు. "ఎందరో కొడుకులని కోల్పోయిన తల్లిదండ్రులు, భర్తను కోల్పోయిన భార్యలు, తల్లిదండ్రులను కోల్పోయిన పిల్లలకు నా చేతుల మీదుగా ఒక్కొక్కరికి రూ.5 లక్షలు ఇస్తూ వారిని ఓదార్చినప్పుడు నా కళ్ళు చమర్చాయి" అంటూ నాగబాబు ఎమోషనల్ అయ్యారు. బాధిత కుటుంబాలకు వారు కోల్పోయిన మనిషిని వెనక్కి తీసుకురాలేము కానీ, వారి బాధలను ఒక కుటుంబ సభ్యునిగా నేను ఉన్నాను అని ధైర్యాన్ని ఇచ్చేది ఈ జనసేన క్రియాశీలక సభ్యత్వమని చెప్పుకొచ్చారు. ఒక కుటుంబాన్ని జనసేన పార్టీతో మమేకం చేసే ఈ కార్యక్రమాన్ని అందరూ పవిత్ర కార్యక్రమంగా భావించాలన్నారు. నిర్ణయించిన గడువు వరకు నిబద్ధతతో సభ్యత్వాలను చేయించాలని కోరారు. బాధల్లో ఉన్న కుటుంబాన్ని ఆదుకునే ప్రక్రియలో అందరూ కూడా అధ్యక్షులు పవన్ కళ్యాణ్‌తో తోడు నడవాలని జనసేన నేత నాగబాబు పిలుపునిచ్చారు. కాగా... ఈనెల 18 నుంచి జనసేన పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమం మొదలైంది. ఏపీ, తెలంగాణ రాష్ట్రాల్లో 18 నుంచి 28 వరకు జనసేన పార్టీ క్రియాశీలక సభ్యత్వ నమోదు కార్యక్రమం జరగనుంది. జనసేన సభ్యత్వం తీసుకున్న వారికి రూ.5 లక్షల బీమా సభ్యత్వంతో పాటు రూ.50 వేలు ప్రమాద బీమా కల్పించనున్నారు. ఈ అవకాశాన్ని జనసేన నేతలు, వీర మహిళలు సద్వినియోగం చేసుకోవాలని పార్టీ అధిష్టానం పేర్కొంది.

## శాంతి వ్యవహారంలో కొత్త ట్విస్ట్.. అసలు విషయంపై స్పందిస్తారా..!




దేవాదాయశాఖ అసిస్టెంట్ కమిషనర్ శాంతి వ్యవహారం రోజుకో మలుపుతిరుగుతోంది. శాంతి బిడ్డకు తండ్రి ఎవరో తేల్చాలంటూ మదన్‌మోహన్ చేసిన డిమాండ్‌తో ఒక్కసారిగా ఈ అంశం రాజకీయ రంగు పులుముకుంది. వైసీపీ ఎంపీ విజయసాయి రెడ్డి ద్వారానే శాంతి బిడ్డకు జన్మనిచ్చిందంటూ మదన్‌మోహన్ ఆరోపించారు. ఈ ఆరోపణలను ఎంపీ విజయసాయిరెడ్డి ఖండించారు. తనకు ఏ పరాయి మహిళతో ఎలాంటి అక్రమ సంబంధం లేదంటూ ఎక్స్‌లో పోస్టు చేశారు. వాస్తవానికి మదన్‌మోహన్ చేసిన ఆరోపణలు శాంతికి సంబంధించి వ్యక్తిగత జీవితానికి సంబంధించినవి. వీటితో ప్రజలకు ఎలాంటి సంబంధం లేదు. శాంతి బిడ్డకు తండ్రి ఎవరనే విషయంపై మదన్‌మోహన్ అవసరమైతే న్యాయపోరాటం చేయ్యొచ్చు. ఇది ప్రజలకు సంబంధించిన సమస్యకాదు. కానీ శాంతి ప్రభుత్వం అండతో అధికార దుర్వినియోగానికి పాల్పడ్డారంటూ తాజాగా దేవదాయ శాఖ కమిషనర్ ఆమెపై మోపిన అభియోగాల్లో పేర్కొన్నారు. దేవాదాయ భూముల లీజు విషయంలో నిబంధనలు పాటించలేదని.. శాంతికి సంబంధం లేని విషయాల్లో ఆమె జోక్యం చేసుకున్నారంటూ తాజా అభియోగాల్లో దేవదాయశాఖ పేర్కొంది. దేవాదాయ భూములు ప్రభుత్వానికి సంబంధించినవి.. అంటే ప్రజల ఆస్తి.. ఈ విషయంలో మాత్రం శాంతి స్పందించాల్సి ఉంటుంది. ఒకవేళ నిబంధనలకు విరుద్ధంగా ఆమె వ్యవహరిస్తే.. ఆమెతో పాటు ఆమెకు సహకరించిన వారిపై చట్టపరంగా చర్యలు తీసుకోవల్సి ఉంటుంది.

**అసలు విషయం ఏమిటంటే..** మదన్‌మోహన్ ఓ రాజకీయ పార్టీ నాయకుడిపై ఆరోపణలు చేయడంతో విషయం సంచలనమైంది. కానీ అదే సమయంలో ఆ రాజకీయనాయకుడి అండతో శాంతి అధికార దుర్వినియోగానికి పాల్పడ్డారా లేదా అనేది ప్రస్తుతం ప్రభుత్వం విచారణ ద్వారా తేల్చాల్సి ఉంది. అసిస్టెంట్ కమిషనర్‌తో ప్రభుత్వ అధికారిగా తనకు పరిచయం ఉందని.. తనకు బిడ్డ పుట్టినప్పుడు వెళ్లి పలకరించానని, తాడేపల్లిలోని తన ఇంటికి శాంతి బిడ్డతో వస్తే ఆశీర్వదించానని విజయసాయిరెడ్డి చెప్పారు. ఇక్కడివరకు పర్వాలేదు. అది వారి వ్యక్తిగత విషయం.

కానీ వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు విజయసాయిరెడ్డి పరపతిని ఉపయోగించి శాంతి అధికార దుర్వినియోగానికి పాల్పడ్డారా.. శాంతి అధికారాన్ని ఉపయోగించి విజయసాయిరెడ్డి లేదా ఇతర వైసీపీ నాయకులు లేదా మరెవరైనా వ్యక్తులు ప్రభుత్వ నిబంధనలు అతిక్రమించి లబ్ధిపొందారా అనేది తేలాల్సి ఉంది.

**శాంతిపై ఆరోపణలు..** దేవాదాయ అసిస్టెంట్ కమిషనర్‌గా శాంతికి అధికారం లేకపోయినా ఉమ్మడి విశాఖపట్టణం జిల్లా పరిధిలో అనకాపల్లి సిద్ధేశ్వరస్వామి ఆలయం, చోడవరంలో విఘ్నేశ్వర ఆలయం, హార్డేంజ్ రెస్ట్‌హౌస్, లంకెలపాలెం పరదేశమ్మ ఆలయం, పాయకరావుపేట పాండురంగస్వామి ఆలయం, ధారపాలెం ధారమల్లేశ్వరస్వామి ఆలయాలకు చెందిన దుకాణాలు, భూముల లీజు విషయంలో శాంతి నిబంధనలు పాటించలేదని దేవాదాయశాఖ అభియోగాలు మోపింది. ప్రభుత్వబ నిబంధనల ప్రకారం భూముల లీజును మూడు సంవత్సరాలకు బదులు 11 సంవత్సరాలకు రెన్యువల్ చేసేలా కమిషనర్‌కు ప్రతిపాదనలు పంపగా.. అవి రెన్యువల్ కావడంపై వివరణ ఇవ్వాలంటూ శాంతిని దేవాదాయశాఖ కమిషనర్ కోరారు. వాస్తవానికి ఆ భూముల లీజు విషయంలో తుది నిర్ణయం తీసుకోవల్సింది దేవాదాయ కమిషనర్. శాంతి నిబంధనలకు విరుద్ధంగా ప్రతిపాదనలు పంపిస్తే కమిషనర్ ఎలా అనుమతించారనేది అనేక అనుమానాలకు తావిస్తోంది. కమిషర్‌పై ప్రభుత్వం నుంచి ఎవరు ఒత్తిడి చేశారు. ఎవరి ఒత్తిడితో లీజుల రెన్యువల్ జరిగింది. ఈ రెన్యువల్ వల్ల లబ్ధిపొందింది ఎవరనేది తెలియాల్సిన అవసరం ఉంది. ఒకవేళ ఉద్దేశపూర్వకంగా కొంతమందికి లబ్ధిచేకూర్చడం కోసం నిబంధనలు అతిక్రమిస్తే.. రూల్స్ పాటించని వారందరిపై చట్టపరమైన చర్యలు తీసుకోవల్సి ఉంటుంది. ప్రస్తుతానికి దేవాదాయశాఖకు శాంతి ఎలాంటి వివరణ ఇస్తారు. అధికార దుర్వినియోగానికి సంబంధించి ఏమి చెబుతారనేది ఆసక్తిగా మారింది. ఈ ఎపిసోడ్ మరెన్ని మలుపులు తిరుగుతుందనేది వేచి చూడాల్సి ఉంది.




## అసెంబ్లీ గేటు వద్ద గొడవకు దిగిన జగన్

## జగన్ ఇక మారరా? అసెంబ్లీ గేటు బయటా గొడవేనా?

అమరావతి: మాజీ సీఎం, వైసీపీ అధినేత వైఎస్ జగన్మోహన్ రెడ్డి మారే సూచనలు అసలు కనిపించడమే లేదు. చివరకు పోలీసులతో కూడా గొడవ పడుతున్నారు. అసెంబ్లీ లోపలికి వైఎస్ జగన్ కారును అనుమతించేందుకు ఏపీ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. సాధారణంగా ఎమ్మెల్యేలు అసెంబ్లీ 4 వ నంబరు గేటు బయట దిగి లోపలికి వెళ్లేలా నిబంధనలు ఉన్నాయి. ప్రతిపక్ష హోదా లేకున్నా అసెంబ్లీ లోపలికి జగన్ వాహనం తీసుకోవాలని నిర్ణయం తీసుకుంది. వైసీపీ శాసన సభపక్ష విన్నపం మేరకు ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఏపీ ప్రభుత్వం ఇంతటి బంపరాఫర్ ఇచ్చినా కూడా పోలీసులతో తనను మెయిన్ గేటు నుంచి అసెంబ్లీలోకి వెళ్లనివ్వాలని జగన్ వాగ్వాదానికి దిగారు. తనను అసెంబ్లీ మెయిన్ గేటు నుంచి వెళ్లనివ్వాలని జగన్ డిమాండ్ చేశారు. అయితే గవర్నర్ వస్తున్నారని అందువలన వేరే గేట్ నుంచి వెళ్లాలని పోలీసులు సూచించారు. దీంతో గొడవకు దిగారు. శాసన సభ గేట్ వద్ద బైటాయించి నిరసన వ్యక్తం చేయాలని జగన్ సూచించారు. ఆపై పోలీసులు డౌన్ డౌన్ అంటూ గేటు వద్ద వైఎస్ జగన్, వైసీపీ ఎమ్మెల్యేలు ఓవర్ యాక్షన్ చేశారు. ఇదే సమయంలో గవర్నర్ కాన్వాయ్ రావడంతో వేరే గేట్ నుంచి జగన్ బృందం లోపలకు వెళ్లనివ్వలేదు. చివరకు చేసేది లేక వేరే గేట్ నుంచి జగన్ బృందం లోపలకి వెళ్లింది. విధుల్లో ఉన్న పోలీసులపై వైఎస్ జగన్ అనుచితంగా ప్రవర్తించడంపై సర్వత్రా విమర్శలు వినవస్తున్నాయి. రోజులు ఇలాగే ఉండవంటూ బహిరంగంగా పోలీసులను జగన్ బెదిరించారు. ప్ల కార్డులు, నల్ల కండవాలతో అసెంబ్లీకి వస్తున్న జగన్ ని పోలీసులు అడ్డుకున్నారు. ప్లకార్డ్స్, నల్ల కండవాలు తొలగించాలని పోలీసులకు ఎవరు ఇచ్చారు అధికారం అంటూ జగన్ ఫైర్ అయ్యారు. ఈ నేపథ్యంలోనే పోలీసులకు జగన్‌కు మధ్య తీవ్రస్థాయిలో వాగ్వాదం చోటు చేసుకుంది. పోలీసుల తీరుపై జగన్ మండిపడ్డారు.




## మదనపల్లె సబ్ కలెక్టరేట్‌లో అగ్నిప్రమాదంపై సీఎం చంద్రబాబు సీరియస్

అమరావతి: మదనపల్లె సబ్ కలెక్టరేట్‌లో అగ్నిప్రమాదంపై సీఎం చంద్రబాబు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఘటనపై అత్యవసర విచారణకు ఆదేశించారు. వెంటనే ఘటనాస్థలికి హెలికాప్టర్‌లో వెళ్లాలని డీజీపీ ద్వారకా తిరుమలరావుకు ఆదేశాలు జారీ చేశారు. కాసేపట్లో డీజీపీ, సీఐడీ చీఫ్ మదనపల్లెకు వెళ్లనున్నారు. అగ్నిప్రమాదంలో కీలక దస్త్రాలు కాలిపోయినట్లు సమాచారం. నూతన సబ్‌కలెక్టర్ బాధ్యతలు చేపట్టడానికి కొన్ని గంటల ముందే ఈ ఘటన చోటు చేసుకోవడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈ నేపథ్యంలో అగ్నిప్రమాదమా? కుట్రపూరితమా? అనే అంశంపై విచారణకు సీఎం ఆదేశించారు. ఈ ఘటనలో ఉద్దేశపూర్వకంగానే భూముల దస్త్రాలు తగులబెట్టారని ఆరోపణలు వస్తున్నాయి. మదనపల్లె సబ్ కలెక్టరేట్‌లో అగ్నిప్రమాదంపై సీఎం చంద్రబాబు అసెంబ్లీలోని తన ఛాంబర్‌లో ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. సమీక్షకు సీఎస్ నీరభ్ కుమార్ ప్రసాద్, ఇంటెలిజెన్స్ చీఫ్ మహేశ్ చంద్ర లడ్హా హాజరయ్యారు.

అగ్నిప్రమాదంలో అసైన్డ్ భూముల దస్త్రాలు దగ్ధమైనట్లు ప్రాథమిక సమాచారం. ఈ నేపథ్యంలో సీసీ ఫుటేజ్ సహా సమస్త వివరాలు బయటకు తీయాలని చంద్రబాబు ఆదేశించారు.

## ప్రభుత్వ ఉద్యోగులు ఆరెస్సెస్ కార్యక్రమాల్లో పాల్గొనడంపై నిషేధం ఎత్తివేత.. మండిపడిన కాంగ్రెస్



దిల్లీ: ప్రభుత్వ ఉద్యోగులు ఆరెస్సెస్ కార్యక్రమాల్లో పాల్గొనడంపై దశాబ్దాలుగా ఉన్న నిషేధాన్ని కేంద్రం ప్రభుత్వం ఎత్తివేసింది. గత వారమే ఇచ్చిన ఉత్తర్వుల కాపీని భాజపా నేత అమిత్ మాలవీయ ఎక్స్ వేదికగా షేర్ చేశారు. దీనిపై కాంగ్రెస్ తీవ్రంగా మండిపడింది. ఈమేరకు హస్తం పార్టీ నేత జైరాం రమేశ్ సుదీర్ఘ పోస్టు పెట్టారు. 58 ఏళ్ల క్రితం జారీ చేసిన రాజ్యాంగ విరుద్ధమైన ఆదేశాలను మోదీ ప్రభుత్వం ఉపసంహరించుకుందని మాలవీయ వెల్లడించారు. దీనిపై జైరాం రమేశ్ స్పందిస్తూ.."మహాత్ముడి హత్య తర్వాత 1948లో సర్దార్ వల్లభాయ్ పటేల్ ఆరెస్సెస్‌పై నిషేధం విధించారు. మంచి ప్రవర్తన హామీతో ఆ నిషేధాన్ని తొలగించారు. కానీ 1966లో మళ్లీ ఆ నిషేధం అమల్లోకి వచ్చింది. తాజా చర్య పలు అనుమానాలకు తావిస్తోంది" అని విమర్శించారు. ఇటీవల ఆర్ఎస్ఎస్-భాజపాల మధ్య సంబంధాలు దెబ్బతిన్నాయని వార్తలు వచ్చిన తరుణంలో ఈ నిషేధాన్ని ఎత్తివేయడాన్ని ప్రశ్నించారు. లోక్‌సభ ఎన్నికల ఫలితాల్లో భాజపా ఆశించిన స్థాయి విజయం సాధించలేక.. 240 సీట్లకే పరిమితమైంది. ఆ ఫలితాల అనంతరం ఆరెస్సెస్ పత్రిక ఆర్గనైజర్‌లో ఒక వ్యాసం ప్రచురితమైంది. లోక్‌సభ ఎన్నికల ఫలితాలు భాజపా కార్యకర్తల అతి విశ్వాసాన్ని కళ్లకు కట్టాయని, వారితోపాటు నేతలంతా 'గాలి బుడగ'ను నమ్ముకొని పని చేశారని, మోదీపైనే ఆధారపడ్డారని, వీధుల్లో ప్రజల గొంతుకలు వినలేదని ఆ వ్యాసం పేర్కొంది. "నిజమైన సేవకుడు అహంకారం కలిగిఉండడు. ఇతరులకు ఎలాంటి హాని కలిగించకుండా పని చేస్తాడు" అంటూ ఆరెస్సెస్ చీఫ్ మోహన్ భాగవత్ వ్యాఖ్యానించిన సంగతి తెలిసిందే. దాంతో భాజపాపై ఆరెస్సెస్ గుర్రుగా ఉందని వార్తలు వచ్చాయి. ఈ అంశాన్ని జైరాం రమేశ్ ప్రస్తావించారు.

## కుప్పం పోలీసుల అదుపులో వైకాపా నేత నాగార్జున యాదవ్



కుప్పం పట్టణం: వైకాపా నేత నాగార్జున యాదవ్‌ను కుప్పం పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఆదివారం అర్ధరాత్రి ఆయన్ను అదుపులోకి తీసుకుని పీఎస్‌కు తరలించారు. కుప్పం పోలీస్‌స్టేషన్‌లో నమోదైన ఓ కేసులో భాగంగా నాగార్జునను అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. వివిధ అంశాలపై అతడిని విచారించారు. 41ఏ నోటీసులు జారీ చేయనున్నట్లు తెలిసింది.

## లోక్‌సభలో టీడీపీ నేతల స్టార్ ప్రశ్నలివే..

ఢిల్లీ: నేడుపార్లమెంటు ఉభయ సభల సమావేశం జరుగుతున్నాయి. ఈ క్రమంలోనే లోక్‌సభ ప్రశ్నోత్తరాల సమయంలో అడిగేందుకు తెలుగు ఎంపీలు స్టార్ ప్రశ్నలు ముందుగానే సిద్ధం చేసుకున్నారు. కేంద్ర పథకాల ద్వారా ఏపీకి అందిన నిధుల వివరాలు తెలపాలని టీడీపీ ఎంపీలు దగ్గమళ్ల ప్రసాద రావు, కేశినేని శివనాథ్ (చిన్ని) కోరారు. కేంద్ర నిధులకు రాష్ట్ర ప్రభుత్వం మ్యాచింగ్ నిధులు ఇచ్చిందా అని మరో ప్రశ్న అడిగారు. అలాగే ఆ నిధుల ఖర్చుపై రాష్ట్రప్రభుత్వం యుటిలైజేషన్ సర్టిఫికెట్లు (యూసీ) ఇచ్చిందా? అని.. అంటూ మరో ప్రశ్న సంధించారు. యువతకు శిక్షణ కోర్సులపై టీడీపీ ఎంపీలు మాగుంట శ్రీనివాసులు రెడ్డి, పుట్టా మహేశ్ కుమార్ ప్రశ్నలు అడిగారు. ప్రధాన మంత్రి కౌశల్ వికాస్ యోజన పథకం కింద ఏపీకి ఇచ్చిన నిధుల వివరాలు కొందరు ఎంపీలు కోరారు. జిల్లాల వారీగా ఆ నిధుల వినియోగం వివరాలు తెలపాలని ఎంపీలు కోరారు. కాగా.. రేపు ఉదయం 11 గంటలకు కేంద్ర బడ్జెట్‌ను ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ సమర్పించనున్నారు. గత లోక్‌సభ ఎన్నికలకు ముందు కూడా నిర్మలానే మధ్యంతర కేంద్ర బడ్జెట్‌ను ప్రవేశ పెట్టారు. ఈ బడ్జెట్ ఫిబ్రవరి 1న లోక్‌సభ ఎన్నికలకు ముందు సమర్పించడం జరిగింది. ఆర్థిక సర్వే నివేదికను ఇవాళ సమర్పించనున్నారు. ఆర్థిక వ్యవస్థ వృద్ధిపై ఆ నివేదికలో పేర్కొననున్నారు. ఈ సర్వేలో వివిధ ఆర్థిక రంగాల పనితీరు, ఉపాధి, జీడీపీ వృద్ధి, ద్రవ్యోల్బణం, బడ్జెట్ లోటు వంటి వివరాలు ఉంటాయి. ఇక ఈ సమావేశంలో వివాదాస్పద అంశాలపై వాడీవేడి చర్చ జరిగే అవకాశం ఉంది. ఈ క్రమంలోనే ఏపీ సహా కొన్ని రాష్ట్రాలు ప్రత్యేక హోదా కోరే అవకాశం ఉంది. వీటన్నింటి నేపథ్యంలో పార్లమెంటు సమావేశాలు హాట్ హాట్‌గా జరగనున్నాయి.

# కృతి శెట్టి.. ది సన్ షైన్ బ్యూటీ!

కన్నడ బ్యూటీ కృతి శెట్టి.. హీరోయిన్ గా ఎలాంటి క్రేజ్ దక్కించుకుందో అందరికీ తెలిసిందే. చదువుకుంటూనే మోడల్ గా రాణించిన అమ్మడు.. చిన్నప్పటి నుంచే మంచి అవకాశాలు అందుకోవడం స్టార్ట్ చేసింది. పెంటాక్, లైఫ్ బాయ్, డైరీ మిల్క్ సిల్క్ వంటి పలు యాడ్స్ చేసి మెప్పించింది కృతి. బాలీవుడ్ స్టార్ హీరో హృతిక్ రోషన్ సూపర్ 30 మూవీలో స్టూడెంట్ పాత్రలో నటించి ఆకట్టుకుంది. ఆ తర్వాత ఉప్పెన మూవీకి హీరోయిన్ గా సెలెక్ట్ అయింది. లెక్కల మాస్టర్ సుకుమార్ శిష్యుడు బుచ్చిబాబు దర్శకత్వం వహించిన ఉప్పెన మూవీతో టాలీవుడ్ లోకి గ్రాండ్ ఎంట్రీ ఇవ్వడమే కాకుండా.. సూపర్ హిట్ అందుకుంది. ఆ సినిమాతోనే మెగా మేనల్లుడు వైష్ణవ్ తేజ్ హీరోగా తెరంగేట్రం ఇచ్చారు. బేబమ్మ పాత్రలో నటించి.. యూత్ కు ఫేవరెట్ హీరోయిన్ గా మారిపోయింది. ఆ తర్వాత తక్కువ గ్యాప్ లోనే నాని శ్యామ్ సింగరాయ్, నాగ చైతన్య బంగార్రాజు చిత్రాలతో హిట్స్ కొట్టేసింది కృతి శెట్టి. కానీ ఆ తర్వాత ఆమె తన వరుస సినిమాలతో మెప్పించలేకపోయింది. మాచర్ల నియోజకవర్గం, వారియర్, ఆ అమ్మాయి గురించి మీకు చెప్పాలి,



కస్టడీ చిత్రాలు అనుకున్న స్థాయిలో ఆడలేదు. రీసెంట్ గా వచ్చిన శర్వానంద్ మనమే మూవీ కూడా మిక్స్ డ్ టాక్ అందుకుంది. ప్రస్తుతం ఆమె చేతిలో తెలుగు సినిమాలు లేవు. కానీ తమిళ, మలయాళ ఇండస్ట్రీల్లో మాత్రం అమ్మడు అదరగొడుతోంది. అజయంటే రాందం మోషనమ్ సహ పలు సినిమాలు చేస్తోంది. సినిమాల సంగతి పక్కన పెడితే.. కొన్ని రోజులుగా సోషల్ మీడియాలో ఓ రేంజ్ లో సందడి చేస్తోంది కృతి శెట్టి. స్టైలిష్ ఔట్ ఫిట్స్ లో మెరుస్తూ.. ఆకట్టుకుంటోంది. ఫ్యాషన్ లవర్స్ కు తన డ్రెస్సెస్, గ్లామర్ తో మెప్పిస్తుంది. అదిరిపోయే అందాలతో వావ్ అనిపిస్తుంది. సన్నని నడుము, చిరునవ్వుతో అట్రాక్ట్ చేస్తుంది. సూపర్ స్కిన్ టోన్ తో కుందనపు బొమ్మలా కనిపిస్తుంది. ఎప్పటికప్పుడు ఆమె పిక్స్ నెట్టింట వైరల్ అవుతూనే ఉన్నాయి. తాజాగా లైట్ ఎల్లో కలర్ మినీ డ్రెస్ లో కనువిందు చేసింది అమ్మడు. వీపందాలను చూపిస్తూ కవ్విస్తోంది. సూర్యుని వెలుగులో తన గ్లోయింగ్ స్కిన్ తో మైమరపిస్తోంది. ఓర చూపులతో కుర్రాళ్లను మాయ చేస్తోంది. నడుము మడతలతో హీట్ పుట్టిస్తోంది. సోషల్ మీడియాలో ఫుల్ వైరల్ అవుతున్న కృతి పిక్స్ కు నెటిజన్లు లైకుల వర్షం కురిపిస్తున్నారు. బేబమ్మ అదుర్స్ అంటూ కామెంట్లు పెడుతున్నారు. బ్యూటిఫుల్ కృతి అంటూ పొగుడుతున్నారు.

## 'కల్కి' గెస్ట్ కి బాలీవుడ్ లో పెద్ద ఛాన్స్

సీతారామం సినిమాతో టాలీవుడ్ లో అడుగు పెట్టిన ముద్దుగుమ్మ మృణాల్ ఠాకూర్. తక్కువ సమయంలోనే తెలుగు ప్రేక్షకుల హృదయాలను కొల్లగొట్టిన ఈ అమ్మడు బ్యాక్ టు బ్యాక్ విజయాలను సొంతం చేసుకుంది. ఆ మధ్య విజయ్ దేవరకొండతో నటించిన ఫ్యామిలీ స్టార్ నిరాశ పరిచినా కూడా ఆఫర్లకు మాత్రం కొదవ లేదు. ఇటీవలే ఈ అమ్మడు ప్రభాస్ హీరోగా నాగ్ అశ్విన్ దర్శకత్వంలో వచ్చిన కల్కి సినిమాలో కీలక అతిథి పాత్రలో నటించడం ద్వారా మృణాల్ వార్తల్లో నిలిచిన విషయం తెల్సిందే. ఆ సినిమాలో కనిపించింది కొన్ని నిమిషాలు అయినా కూడా అందరి దృష్టిని మృణాల్ ఆకర్షించింది అనడంలో సందేహం లేదు. హీరోయిన్ గా మృణాల్ ప్రస్తుతం సౌత్ లో బ్యాక్ టు బ్యాక్ సినిమాలు చేస్తున్న విషయం



తెల్సిందే. ఇదే సమయంలో మళ్లీ బాలీవుడ్ నుంచి కూడా ఈ అమ్మడు ఆఫర్లు దక్కించుకుంటుంది. గతంలో హిందీలో చాలా సినిమాలు చేసిన మృణాల్ కి ఒక్కటి కూడా సరైన సక్సెస్ దక్కలేదు. ఇప్పుడు బాలీవుడ్ యంగ్ అండ్ క్రేజీ హీరో వరుణ్ ధావన్ సినిమాలో నటించే అవకాశం దక్కింది. వరుణ్ ధావన్ తండ్రి డేవిడ్ ధావన్ ఈ సినిమాను ప్రతిష్టాత్మకంగా తీసుకుని రూపొందిస్తున్నాడు. ఈ సినిమాలో మృణాల్ ఠాకూర్ హీరోయిన్ గా ఎంపిక అవ్వడంతో పాటు కొన్ని సన్నివేశాల చిత్రీకరణ కూడా పూర్తి అయ్యిందట. బాలీవుడ్ లో వరుణ్ ధావన్ సినిమాలో నటించే అవకాశం రావడం అనేది ఖచ్చితంగా పెద్ద అవకాశం. ఆ సినిమా హిట్ అయితే కచ్చితంగా మృణాల్ కి హిందీలో మరిన్ని సినిమాల్లో నటించే అవకాశాలు రావచ్చు. మరో వైపు తెలుగు మరియు తమిళంలో ఈ అమ్మడు సినిమాలు చేస్తూ బిజీగా ఉంది.





# చెత్త సినిమాకి భారీ ఓపెనింగులు?




ఏ సినిమాకి అయినా మంచి ఓపెనింగులు రావాలంటే ప్రచారం కీలకం. మంచి ప్రచారపు ఎత్తుగడ ఫలిస్తే అది చెత్త సినిమా అయినా కానీ తొలి మూడు రోజుల్లోనే సేఫ్ జోన్ లోకి వస్తుంది. అలాంటి ఒక చెత్త సినిమా ఇప్పుడు తొలి మూడు రోజుల్లోనే రూ.30 కోట్లు వసూలు చేస్తూ బాలీవుడ్ ట్రేడ్ ని ఆశ్చర్యపరుస్తోందని విశ్లేషిస్తున్నారు. ఇంతకీ ఇది ఏ సినిమా అంటే? విక్కీ కౌశల్- ట్రిప్తి దిమ్రీ- అమీ విర్క్ ప్రధాన పాత్రల్లో నటించిన బ్యాడ్ న్యూజ్ గురించే ఇదంతా. ఈ సినిమా ఓపెనింగుల్లో నిజంగానే గుడ్ న్యూస్ చెప్పగా, రివ్యూలు మాత్రం వెరీ బ్యాడ్ అని నిరాశపరిచాయి. బ్యాడ్ న్యూజ్ చిత్రం తొలి రోజు 8.7 కోట్లు వసూలు చేసింది. రెండోరోజు మూడోరోజు సెలవులు కలిసొచ్చి వసూళ్లు 30కోట్లకు చేరుకుంటాయని చెబుతున్నారు. అడల్ట్ కామెడీ, శృంగార సన్నివేశాలతో నింపేసిన ఈ సినిమా ఈ ఏడాది వచ్చిన బాలీవుడ్ చెత్త సినిమాల్లో ఒకటిగా ముద్ర వేస్తూ కొందరు హిందీ క్రిటిక్స్ తీవ్రంగా విమర్శించారు. ముఖ్యంగా శృంగారంలో హద్దు మీరే ఇలాంటి పాత్రలో నటించిన ట్రిప్తి దిమ్రీని అభిమానులు తిట్టి పోసారు. ఈ భామ హద్దు మీరిందని కూడా వ్యాఖ్యానించారు. ఇద్దరు కుర్రాళ్లతో రొమాన్స్ చేసే అమ్మాయి ప్రెగ్నెంట్ అయ్యాక.. బిడ్డ తండ్రి ఎవరో తెలీని సందిగ్ధంలోకి వెళ్లిపోతుంది. ఈ స్టోరీ లైన్ శ్రుతి మించిందని, ఇర్రిటేట్ చేసిందని కూడా కొందరు సమీక్షకులు అభిప్రాయపడ్డారు. ఒకరికి మించి భాగస్వాములతో శృంగారంలో పాల్గొనే యువతి కథను అనైతికంగా ఇలా తెరపై చూపడమేమిటీ అని కొందరు విరుచుకుపడ్డారు. అయితే బ్యాడ్ న్యూజ్ ఓపెనింగుల పరంగా యూరి రికార్డును బ్రేక్ చేస్తోంది. విక్కీకౌశల్ కెరీర్ లో యూరి క్లాసిక్ హిట్ గా నిలిచింది.

ఆ సినిమా రికార్డునే ఇది కొట్టేస్తోంది. చెత్త సినిమా అయినా కానీ ఇంత భారీ ఓపెనింగులు ఆశ్చర్యపరుస్తున్నాయని విశ్లేషిస్తున్నారు. సామ్ బహదూర్, జర హట్కే లాంటి హిట్ చిత్రాల తర్వాత విక్కీకి ఇది ఆశించిన మంచి సినిమా కాదని క్రిటిక్స్ వ్యాఖ్యానిస్తున్నారు. ఇక సోమవారం నుంచి బ్యాడ్ న్యూజ్ బాక్సాఫీస్ వద్ద ఎలాంటి రన్ కొనసాగిస్తుందోనన్న సందిగ్ధం ఉంది.

# జాన్వీకపూర్ కేరింగ్ అంతా ప్రియుడిదేనా?





కల్తీ ఆహారం కారణంగా అస్వస్థకు గురై ఆసుపత్రిలో చేరిన బాలీవుడ్ నటి జాన్వీ కపూర్ డిశ్చార్జ్ అయింది. ఈ విషయాన్ని ఆమె తండ్రి బోనీ కపూర్ వెల్లడించారు. ప్రస్తుతం ఆమె సోదరి ఖుషీకపూర్- బాయ్‌ఫ్రెండ్ షిఖర్ పహారియా పర్యవేక్షణలో ఉన్నట్టు తెలిపారు. ప్రస్తుతానికి బాగా నీరసంగా ఉందని ఒక రోజు పూర్తిగా విశ్రాంతి తీసుకుంటే కోలుకుంటుందని అన్నారు. అలాగే పూర్తిగా కోలుకోవడానికి వారం రోజులు సమయం పడుతుం దని తెలుస్తోంది. అంతవరకూ జాన్వీ ఇల్లు కదిలే పరిస్థితి ఉండదు. దీంతో జాన్వీ బాధ్యతలన్నింటిని ప్రియుడు శిఖర్ పహారియా ఇప్పటి నుంచే తీసుకున్నట్లు కనిపిస్తుంది. కొన్ని నెలలుగా జాన్వీ-శికర్ పహారియా ఎంత క్లోజ్ గా మూవ్ అవుతున్నారో తెలిసిందే. కలిసి పార్టీలకు వెళ్లడం, గుడులుగోపురాలు చుట్టేయడం, అంబానీ ఇంట వివాహ వేడుకకు జంటగా హాజరవ్వడం ఒకటేంటి? పహారియా ఎప్పుడు చూసినా జాన్వీ వెంటనే కనిపిస్తున్నాడు. జాన్వీ కూడా అతడికి అంతే ప్రాధాన్యత ఇస్తుంది. ఇంట్లో ఫ్యామిలీ మెంబర్ అయిపోయాడని ఎప్పుడో చెప్పేసింది. ఎమెర్జెన్సీ కాల్ లిస్ట్ లో ముందుగా అతడి నెంబర్ ఉంటుందని చెప్పింది. అప్పుడే అర్దమైంది ఇద్దరు మధ్య లవ్ ట్రాక్ వాకింగ్ రన్నింగ్ చేస్తుంది. కాబట్టి జాన్వీ తాజా పరిస్థితుల్లో కంటికి రెప్పాలా కాపాడుకోవాల్సిన బాధ్యత పహారియాపై అంతే ఉంది. అక్క అంటే ఖుషీకపూర్కి అంతే ఇష్టం. ఇద్దరు అక్కా-చెల్లికంటే క్లోజ్ ఫ్రెండ్స్ గా ఉంటారు. పార్టీలు..పబ్ ల్లో ఎంజాయ్ చేయడంలో సిస్టర్స్ చాలా చలాకీగా ఉంటారు. ఇక జీన్వీ కపూర్ , ఎన్టీఆర్-కొరటాల శివ కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న %-%దేవర%-% సినిమాలో నటిస్తోన్న సంగతి తెలిసిందే. అలాగే, రామ్ చరణ్ తదుపరి సినిమాకు కూడా ఆమె హీరోయిన్ గా ఎంపికైంది.

# ప్రాజెక్ట్ మొదలయ్యే దాకా డౌట్లు తప్పవా..?

సినిమాలో తను తెసుకునే రెమ్యునరేషన్ కి పూర్తి స్థాయిలో న్యాయం చేసే హీరోయిన్స్ లో బుట్ట బొమ్మ పూజా హెగ్దే ఒకరు. అమ్మడు సినిమాలో ఉంది అంటే గ్లామర్ విషయంలో ఎలాంటి ఢోకా లేదని అనిపిస్తుంది. చేసేది ఎలాంటి పాత్ర అయినా పూజా బేబీ చేసే థై షో కుర్రాళ్లకు సూపర్ కిక్ ఇస్తుంది. తెలుగులో చేసిన ఫస్ట్ రెండు సినిమాలు పెద్దగా ఆడకపోయినా అల్లు అర్జున్ తో చేసిన దువ్వాడ జగన్నాథం తో అమ్మడు పాపులారిటీ సంపాదించింది. అప్పటి నుంచి రాధే శ్యాం వరకు వరుసగా స్టార్ సినిమాల్లో నటిస్తూ సత్తా చాటింది. ఐతే రాధే శ్యాం సూపర్ హిట్ అయితే ఏమో కానీ అది నిరాశ పరచడం అమ్మడి కెరీర్ మీద ఎఫెక్ట్ పడేసింది. అటు తమిళ్ లోనూ బీస్ట్ దెబ్బ కొట్టింది. అందుకే పూజాకి ఆఫర్లు కరువయ్యాయి. మహేష్ గుంటూరు కారం సినిమాలో మొదట హీరోయిన్ గా ఓకే అనుకున్నా ఎందుకో చివర్లో ఆమెను తీసి శ్రీలీలని పిక్ చేసుకున్నారు. ప్రస్తుతం తెలుగులో ఛాన్స్ వస్తే మళ్లీ తన టాలెంట్ చూపించాలని చూస్తుంది పూజా హెగ్దే. నాగ చైతన్యతో విరూపాక్ష డైరెక్టర్ కార్తీక్ దండు చేస్తున్న



సినిమాలో పూజా హెగ్దే నటిస్తుందని టాక్ ఉంది.

పూజాతో ఒక లైలా కోసం సినిమా చేసిన నాగ చైతన్య మళ్లీ ఇన్నాళ్లకు జత కడుతున్నాడు. ఐతే పూజాకి నిజంగానే ఆ సినిమా ఆఫర్ వచ్చిందా ఇది కూడా అన్ని సినిమాల్లానే ఒక గాలి వార్తా అన్నది తెలియాల్సి ఉంది. పూజా సినిమా న్యూస్ లు అన్నీ ఒకటి అంటే మరోటి జరుగుతుంది. అందుకే చైతన్య సినిమా మొదలయ్యే దాకా పూజాని కన్ఫర్మ్ అని చెప్పడం కష్టం. ఈసారి ఛాన్స్ వస్తే మాత్రం అటు యాక్టింగ్ తోనే కాదు గ్లామర్ షోలో కూడా పూజా బేబీ అదరగొట్టాలని చూస్తుంది. ఇక ఈమధ్యనే సూర్య 44వ సినిమాలో ఛాన్స్ అందుకుంది పూజా హెగ్దే. దీనితో పాటు హిందీలో కూడా ఒక సినిమా చేస్తుంది. తెలుగులో తిరిగి పూజా ఫాం లోకి వస్తే మాత్రం అమ్మడి ఫ్యాన్స్ కి పండగే అని చెప్పొచ్చు. బుట్ట బొమ్మ సినిమాలకు కాస్త గ్యాప్ ఇచ్చినా తన ఫోటో షూట్స్ తో మాత్రం కావాల్సినంత ఎంటర్టైన్మెంట్ అందిస్తుంది. పూజా ఫోటో షూట్స్ ఆమె అభిమానులకు కన్నుల విందు కలిగిస్తుంది.

## మన వర్మను కాదని ఆదిత్యతో....!

బాలీవుడ్ స్టార్ హీరో రణవీర్ సింగ్ మొన్నటి వరకు మన టాలీవుడ్ దర్శకుడు ప్రశాంత్ వర్మతో సినిమా చేసేందుకు సిద్ధం అయ్యాడు. కానీ ప్రశాంత్ వర్మ స్క్రిప్ట్ విషయంలో రణవీర్ సింగ్ అసంతృప్తి వ్యక్తం చేయడంతో సినిమా మొత్తానికే ఆపేశారనే వార్తలు వస్తున్నాయి. దర్శకుడు ప్రశాంత్ వర్మ ఈ విషయాన్ని సన్నిహితుల వద్ద తెలియజేశాడట. ఇప్పటికే ప్రశాంత్ వర్మ తన కొత్త ప్రయత్నాలు షురూ చేశాడు. బాలకృష్ణ తనయుడు మోక్షజ్ఞ ను హీరోగా పరిచయం చేసే బాధ్యత ను బాలయ్య చాలా నమ్మకంతో ప్రశాంత్ వర్మకు అప్పగించే అవకాశాలు ఉన్నాయి అంటూ వార్తలు వస్తున్నాయి. ఆ విషయమై త్వరలోనే క్లారిటీ వచ్చే అవకాశం ఉంది. ప్రశాంత్ వర్మ తో సినిమాలకు ప్రముఖ హీరోలు సిద్ధంగా ఉన్నారు. మరో వైపు రణవీర్ సింగ్ తదుపరి సినిమా కూడా దాదాపుగా కన్ఫర్మ్ అయ్యింది. ఇప్పటికే సింగం ఎగైన్ ను ముగించిన రణవీర్ సింగ్ ఇటీవల ప్రశాంత్



వర్మ మూవీ క్యాన్సిల్ అవ్వడంతో ఆదిత్య ధర్ దర్శకత్వంలో సినిమాకు ఓకే చెప్పాడట. ఇప్పటికే ఆదిత్య ధర్ సినిమాకు సంబంధించిన ప్రీ ప్రొడక్షన్ వర్క్ ముగిసిందట. త్వరలోనే రణవీర్ సింగ్ షూటింగ్ లో జాయిన్ అవ్వబోతున్నాడని తెలుస్తోంది. జులై 25న సినిమా రెగ్యులర్ షూటింగ్ ను ప్రారంభించబోతున్నట్లుగా మేకర్స్ నుంచి అధికారిక ప్రకటన వచ్చింది. ఈ సినిమాలో రణవీర్ సింగ్ తో పాటు అర్జున్ రామ్ పాల్ మరియు సంజయ్ దత్ లు కీలక పాత్రలో నటించబోతున్నారు. థాయ్‌లాండ్ లో మొదటి షెడ్యూల్ ను ప్లాన్ చేస్తున్నారు. ఇండియన్ ఇంటిలిజెన్స్ ఏజెన్సీ కి సంబంధించిన కథ ను ఈ సినిమాలో చూపించబోతున్నారట. విదేశాల్లోనే ఎక్కువగా ఈ సినిమా షూటింగ్ ఉంటుందని తెలుస్తోంది. మరి మన ప్రశాంత్ వర్మ ను కాదన్న రణవీర్ సింగ్ ఎంతటి విజయాన్ని సొంతం చేసుకుంటాడో చూద్దాం అన్నట్లుగా తెలుగు ప్రేక్షకులు మరియు ప్రశాంత్ వర్మ అభిమానులు కామెంట్స్ చేస్తున్నారు.



# కేంద్రమంత్రితో సీఎం రేవంత్ రెడ్డి భేటీ.. ఆ అంశాలపై చర్చ..

ఢిల్లీ: రెండ్రోజుల ఢిల్లీ పర్యటనలో భాగంగా తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కేంద్ర జల్ శక్తి మంత్రి సి.ఆర్.పాటిల్‌తో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న మూసీ నది డెవలప్మెంట్, రాష్ట్రంలోని ఇళ్లకు నల్లా కనెక్షన్ల కోసం పెద్దఎత్తున నిధులు ఇవ్వాలని కేంద్ర మంత్రిని కోరారు. ఈ సమావేశంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి పాల్గొన్నారు. తెలంగాణ ప్రభుత్వం రూ. 1.5లక్షల కోట్లతో చేపడుతున్న మూసీ రివర్ ప్రక్షాళనకు సహకరించాలని కేంద్ర మంత్రికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. హైదరాబాద్ నగరంలోని మురికి నీరంతా మూసీలో చేరుతోందని, దానిని శుద్ధి చేయాలని రాష్ట్ర ప్రభుత్వం సంకల్పించినట్లు కేంద్ర మంత్రికి వివరించారు. జాతీయ నదీ పరిరక్షణ ప్రణాళిక కింద మురికి నీటి శుద్ధి పనులకు రూ.4వేల కోట్లు కేటాయించాలని పాటిల్‌ను కోరారు. అలాగే గోదావరి నదీ జలాలతో ఉస్మాన్ సాగర్, హిమాయత్ సాగర్‌లను నింపే పనుల కోసం మరో రూ. 6వేల కోట్లు కేటాయించాలని ముఖ్యమంత్రి విజ్ఞప్తి చేశారు. ఉస్మాన్ సాగర్, హిమాయత్ సాగర్లను గోదావరి నీటితో నింపితే హైదరాబాద్‌కు నీటి కష్టాలు ఉండవని కేంద్ర మంత్రికి రేవంత్ రెడ్డి వివరించారు. 2019లో జల్ జీవన్ మిషన్ ప్రారంభమైనా తెలంగాణకు ఇంతవరకూ నిధులు ఇవ్వలేదని గుర్తు చేశారు. రాష్ట్రంలోని 7.85లక్షల ఇళ్లకు నల్లా కనెక్షన్ లేదని పాటిల్ దృష్టికి తీసుకెళ్లారు.

నల్లా లేని ఇళ్లతోపాటు పీఎంఏవై అర్బన్, రూరల్ కింద చేపట్టే ఇళ్లకు సైతం నల్లా కనెక్షన్ ఇచ్చేందుకు రూ.16,100 కోట్లు వ్యయం అవుతుందని తెలిపారు. ఈ ఏడాది నుంచి తెలంగాణకు జల్ జీవన్ మిషన్ నిధులు కేటాయించాలని కేంద్ర మంత్రి సి.ఆర్.పాటిల్?ను తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కోరారు.



# వర్షాలు సమృద్ధిగా కురుస్తాయి.. పంటలు బాగా పండుతాయి: స్వర్ణలత భవిష్యవాణి

సికింద్రాబాద్: నగరంలోని ఉజ్జయిని మహాకాళి బోనాల వేడుకలో భాగంగా భక్తురాలు స్వర్ణలత భవిష్యవాణి వినిపించారు. మట్టి బోనమైనా, స్వర్ణ బోనమైనా.. ఎవరు తీసుకొచ్చినా తాను సంతోషంగా అందుకుంటానని చెప్పారు. వర్షాలు సమృద్ధిగా కురుస్తాయని, పంటలు బాగా పండుతాయని తెలిపారు. వ్యాధులు రాకుండా ప్రజలను కాపాడతానన్నారు. ప్రజలను చల్లగా చూస్తానని చెప్పారు. “పిల్లలు, పెద్దలు, జంతువులకు ఎలాంటి ఇబ్బందీ లేకుండా చూసుకుంటాను. నేను సంతోషంగా ఉండటానికి చల్లని శాక పెడుతున్నారు. ఈసారి కూడా 5 వారాలు పప్పు బెల్లాలతో శాక పెట్టండి. పాడి పంటలు గతంలో లాగా పండించడం లేదు. రసాయనాలు ఎక్కువ వాడుతున్నారు. అందుకే అనారోగ్యం. వాటిని తగ్గించుకుంటే మీకు వ్యాధులు తగ్గుతాయి” అని స్వర్ణలత భవిష్యవాణి వినిపించారు.

# కలెక్టర్లు అప్రమత్తంగా ఉండాలి మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి



హైదరాబాద్ : రాష్ట్రంలో విస్తృతంగా కురుస్తున్న వర్షాల నేపథ్యంలో అన్ని జిల్లాల కలెక్టర్‌లు అప్రమత్తంగా ఉండాలని రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆదేశించారు. జిల్లాల్లో వరద పరిస్థితిని ఆయన సమీక్షించారు. పునరావాస చర్యల్లో నిమగ్నమై ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. గోదావరి ఉధృతి వల్ల అక్కడి పరివాహక ప్రాంతాల ప్రజలకు ఎలాంటి ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా రెస్క్యూ టీమ్‌లు, ఎన్డీఆర్ఎఫ్ బృందాలను వినియోగించాలనీ సూచించారు.

ప్రధానంగా వాగుల వద్ద తగు బందోబస్తును ఏర్పాటు చేసి, ప్రమాదకరంగా ప్రవహించే వాగులను ప్రజలు దాటకుండా ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు. కలెక్టరేట్లలో కంట్రోల్ రూమ్‌లను ఏర్పాటు చేయాలని ఆయన సూచించారు.

# తెలంగాణ ధిక్కారస్వరం దాశరథి..: కేసీఆర్



హైదరాబాద్: తెలంగాణ సాధనకోసం తాను సాగించిన పోరాటపంథాలో దాశరథి అందించిన స్ఫూర్తి ఇమిడి వున్నదని బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ అన్నారు. తెలంగాణ ఆత్మగౌరవ ధిక్కారస్వరం, అభ్యుదయ కవి, రచయిత దాశరథి కృష్ణమాచార్య శతజయంతి సందర్భంగా వారందించిన స్ఫూర్తిని స్మరించుకున్నారు. ‘నా తెలంగాణ కోటి రతనాల వీణ’ అంటూ తన కవిత్వం ద్వారా తెలంగాణ గరిమను ప్రపంచానికి చాటి, తన సాహిత్యం ద్వారా ‘తిమిరంతో సమరం’ చేస్తూ, నాటి రైతాంగంలో రాచరికానికి వ్యతిరేకంగా సాయుధ పోరాట స్ఫూర్తిని రగిలించిన యోధుడు, బహుముఖ ప్రజ్ఞాశాలి.. దాశరథి అని కొనియాడారు. తెలంగాణ ఆత్మగౌరవాన్ని అత్యున్నత శిఖరాల మీద నిలబెట్టే దాశరథి కవిత్వం సాహిత్యం తెలంగాణ భబిష్యత్తు తరాలకు నిత్య స్ఫూర్తిదాయకమని కేసీఆర్ అన్నారు.

# స్మిత సబర్వాల్ వ్యాఖ్యలపై బాలలత స్ట్రాంగ్ కౌంటర్

హైదరాబాద్, జూలై 22: సివిల్స్‌లో దివ్యాంగుల కోటా అవసరమా అంటూ సీనియర్ ఐఏఎస్ అధికారిణి స్మితా సబర్వాల్ చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు రాష్ట్రవ్యాప్తంగా సంచలనంగా మారాయి. స్మిత వ్యాఖ్యలను పలువురు తీవ్రంగా తప్పుబడుతున్నారు. తాజాగా... ప్రముఖ మోటివేటర్, సీఎస్‌బీ ఐఏఎస్ అకాడమీ నిర్వాహకురాలు బాలలత స్పందిస్తూ స్మితపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అంగవైకల్యం ఉన్నవారి గురించి మాట్లాడటానికి స్మిత సబర్వాల్‌కు ఉన్న అర్హత ఏంటో చెప్పాలని ప్రశ్నించారు. సోమవారం మీడియాతో మాట్లాడుతూ.. జ్యుడిషియరీ, పార్లమెంటరీ వ్యవస్థలు తీసుకునే నిర్ణయాలకు వ్యతిరేకంగా మాట్లాడుతున్నారని మండిపడ్డారు. అసలు ఫీల్డ్‌లో పరిగెత్తుతూ స్మిత సబర్వాల్ ఎంతకాలం పనిచేశారని నిలదీశారు. వివక్షకు గురవుతున్న వికలాంగులను స్మిత సబర్వాల్ మాటలు మరింత కుంగదీశాయన్నారు. సీఎం అయ్యాక రేవంత్ రెడ్డి మొదట అపాయింట్‌మెంట్ వికలాంగురాలికి ఇచ్చారని గుర్తు చేశారు. స్మిత తన మాటలు వ్యక్తిగతంగా మాట్లాడుతున్నారా? లేక ప్రభుత్వం తరపున మాట్లాడుతున్నారా అనేది తెల్చాలన్నారు.

**స్మితకు సవాల్...** కోడ్ ఆఫ్ కండెక్ట్, సివిల్ సర్వేంట్ క్రమశిక్షణ రాహిత్యం కింద స్మిత సబర్వాల్‌పైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అంగవైకల్యం ఉన్న జై పాల్ రెడ్డి ఉత్తమ పార్లమెంటరీ సాధించారని తెలిపారు. స్మిత సబర్వాల్‌పైన చర్యలు తీసుకోవాలి అని సీఎం రేవంత్ రెడ్డిని కోరుతున్నామన్నారు. “ఇప్పటికైనా సివిల్స్ పరీక్ష రాస్తాను.. నాకన్నా ఎక్కువ మార్కులు సాధించమని స్మిత సబర్వాల్” సవాల్ విసిరారు. స్టీఫెన్ హాకింగ్, సుదా చంద్రన్ వంటి మేధావులు అంగవైకల్యం జయించారన్నారు. కేసీఆర్ హయాంలో పదేళ్ల పాటు సీఎంవోలో పనిచేసి కనీసం అడ్మినిస్ట్రేషన్‌పైన అవగాహన లేకుండా మాట్లాడటం బాధాకారమన్నారు. అంగవైకల్యంతో పద్మశ్రీ, పద్మ భూషన్ అవార్డులు తీసుకున్నవారు ఉన్నారన్నారు. 24 గంటల్లో స్మిత సభర్వాల్ తన మాటలు వెనక్కి తీసుకోవాలి అని డిమాండ్ చేశారు. రేపటిలోగా ప్రభుత్వం ఈ అంశంపైన స్పందించకపోతే టాంక్ బండ్‌పైన నిరసన తెలియజేస్తామని బాలలత స్పష్టం చేశారు.




# ఉగ్రరూపం దాల్చిన గోదావరి

భద్రాద్రి కొత్తగూడెం: భద్రాచలం వద్ద గోదావరి పరవళ్లు తొక్కుతోంది. గోదావరి నీటిమట్టం 46.40 అడుగులకు చేరుకుంది. వరద ప్రవాహం 10,68,602 క్యూసెక్కులకు చేరుకుంది. ఈ క్రమంలోనే గోదావరి ఉగ్రరూపం దాల్చింది. రెండవ ప్రమాద హెచ్చరిక దిశగా కొనసాగుతోంది.

48 అడుగులు దాటితే అధికారులు రెండవ ప్రమాద హెచ్చరికను జారీ చేయనున్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని తాలిపేరు ప్రాజెక్ట్‌కు వరద పోటెత్తింది. దీంతో అధికారులు ప్రాజెక్టుకు చెందిన 25 గేట్లు ఎత్తి 62932 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. తాలిపేరు ఇన్ ఫ్లో 59420 క్యూసెక్కులుగా ఉంది. మరోవైపు ఇల్లందు డివిజన్‌లోనూ ఇదే పరిస్థితి కొనసాగుతోంది. ఇల్లందు డివిజన్‌లో వాగులు వంకలు పొంగి పొర్లుతున్నాయి. గుండాల, ఆళ్ళపల్లి మండలాల్లో కిన్నెరసాని, జల్లేరు, మల్లన్న, ఏడు మెలికల వాగులు ఉధృతంగా ప్రహిస్తున్నాయి. సుమారు 13 గ్రామాలకు రాకపోకలు నిలిచి పోయాయి. ఇక మహబూబ్ నగర్ జిల్లాలో ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టు పొంగి పొర్లుతోంది. ప్రియదర్శిని జూరాల పూర్తిస్థాయి నీటిమట్టం 318.516 మీ కాగా.. ప్రస్తుత నీటిమట్టం 317.210 మీటర్లకు చేరుకుంది. పూర్తిస్థాయి నీటి నిల్వ 9.657 టీఎంలకు చేరుకోగా.. ప్రస్తుత నీటి నిల్వ 7.115 టీఎంసీలకు చేరుకుంది. ప్రియదర్శిని జూరాల ఇన్ ఫ్లో 1,42,000 క్యూసెక్కులు కాగా.. ఔట్ ఫ్లో 1,33,497 క్యూసెక్కులుగా ఉంది. ఈ క్రమంలోనే ప్రాజెక్టుకు సంబంధించిన 27 గేట్లను అధికారులు ఎత్తివేశారు.

# చిక్కుల్లో ఐఏఎస్ స్మితా సబర్వాల్.. ఆడేసుకుంటున్న నెటిజన్లు




ట్రైనీ ఐఏఎస్ అధికారిణి పూజా ఖేద్కర్ వివాదం తర్వాత ఇప్పుడు UPSC సివిల్ సర్వీసెస్ ఎంపిక విధానం గురించి కొత్త చర్చ మొదలైంది. ఈ వివాదం నేపథ్యంలో తెలంగాణ కేడర్‌కు చెందిన ఐఏఎస్ అధికారిణి స్మితా సబర్వాల్(ల ఐఏఎస్‌లో వికలాంగుల కోటాపై తన అభిప్రాయాలను సోషల్ మీడియా ఖాతా ‘ఎక్స్’లో పంచుకున్నారు. ఈ చర్చ ప్రస్తుతం ఊపందుకుంది.
వైకల్యం ఉన్న పైలట్‌ను ఎయిర్‌లైన్ నియమించుకుంటుందా? లేదా మీరు వైకల్యం ఉన్న సర్జన్‌ని విశ్వసిస్తారా. #AIS ( IAS/ IPS/IFoS%) అనేది ఫీల్డ్ వర్క్, పన్నులు విధించడం, ప్రజల మనోవేదనలను నేరుగా వినడం వంటివి ఉంటాయి. కాబట్టి ఈ ప్రీమియర్ సర్వీస్‌కు ఈ కోటా అవసరమా అని తన అభిప్రాయాలను వెల్లడించారు.

**విమర్శలు :** ఇది చూసిన నెటిజన్లు తీవ్రంగా స్పందిస్తున్నారు. వికలాంగుల హక్కుల కోసం ఉద్యమిస్తున్న కార్యకర్తలు ఈ ఐఏఎస్ అధికారి వ్యాఖ్యలను తీవ్రంగా విమర్శిస్తున్నారు. వికలాంగులను ‘సంకుచిత దృక్పథం’తో చూడరాదని, వారి అర్హతపై ఇలా మాట్లాడటం సరికాదని అంటున్నారు. దీనిపై శ్రీకాంత్ మిర్యాల అనే రచయిత, సైకియార్టిస్ట్ ఓ సుదీర్ఘ పోస్ట్ పెట్టారు. ఈ పోస్టులో ప్రత్యక్ష ఉదాహరణలతో గతంలో ఎంబీబీఎస్ చదివేటప్పుడు తన ప్రిన్సిపాల్ కాలుకి పోలియో సోకి సరిగా నడవలేనివారు, అయినా కూడా ఎడమచేత్తో రాసి, పాఠాలు చెప్పారాని గుర్తు చేశారు. ఇలా అనేక మంది దివ్యాంగులు పలు రంగాల్లో ఉన్నట్లు గుర్తు చేశారు.

**నరికాదు :** అంతేకాదు ఉన్నత స్థానంలో ఉన్న అధికారులు(%శీటటఱఎవతీం%) ఇలా ట్వీట్ చేయడం సరికాదని కామెంట్లు చేస్తున్నారు. మీ పని మీరు సరిగ్గా చేయండి చాలు. అంతేకానీ మీకు సలహాలు ఇచ్చే స్థాయి ఇంకా రాలేదని చెబుతున్నారు. అంతేకాదు గతంలో తెలంగాణ సీఎం కేసీఆర్ దగ్గర పనిచేసిన ఈ అధికారిణిపై అనేక అవినీతి ఆరోపణలు వచ్చాయి. ట్రైనీ ఐఏఎస్ అధికారిణి పూజా ఖేద్కర్‌పై అనుచిత ప్రవర్తన ఆరోపణల మధ్య ఈ వివాదం మొదలైంది. యూపీఎస్సీ పరీక్షలో తన అభ్యర్థిత్వాన్ని పొందేందుకు వైకల్యం, ఇతర వెనుకబడిన తరగతి (నాన్-క్రీమీ లేయర్) కోటాను దుర్వినియోగం చేసినట్లు ఆమెపై ఆరోపణలు ఉన్నాయి. సివిల్ సర్వీసెస్ పరీక్షలో ఫేక్ ఐడెంటిటీ ఇచ్చి అనుమతించిన దానికంటే ఎక్కువ ప్రయత్నించారనే ఆరోపణలపై యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఖేద్కర్‌పై కేసు నమోదు చేసింది.

# మేడిగడ్డను బాగుచేయడంలో సర్కారు విఫలం



హైదరాబాద్ : మేడిగడ్డ ప్రాజెక్టు వద్ద అనుకోకుండా మూడు పిల్లర్లు కుంగుబాటుకు గురయ్యాయని, వాటిని సకాలంలో బాగుచేయించి సాగునీటిని అందుబాటులోకి తేవడంలో రాష్ట్రప్రభుత్వం విఫలమైందని మాజీ మంత్రి హరీశ్ రావు ఆరోపించారు. వరదలు రాకముందే మేడిగడ్డ రక్షణ చర్యలు తీసుకోవాల్సి ఉండగా ఏమాత్రం దృష్టిపెట్టలేదని ఒక ప్రకటనలో ఆయన పేర్కొన్నారు. మేడిగడ్డ బ్యారేజీ పునరుద్ధరణకు సూచనలు, సలహాలు ఇవ్వడంలో నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ (ఎన్‌డీఎసఏ) సమయం వృథా చేసిందని ఆరోపించారు. ఎన్‌డీఎసఏ నివేదిక పేరిట ప్రభుత్వం అలసత్వం కారణంగా.. రాష్ట్ర రైతాంగం నష్టపోవాల్సి వస్తోందన్నారు. ఇటీవల ఢిల్లీలో జరిగిన ఎన్‌డీఎసఏ సమావేశంలో పాల్గొన్న మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి మీడియాతో మాట్లాడుతూ.. కాళేశ్వరం ప్రాజెక్టుపై అవాకులు చెవాకులు పేలి.. తన అవగాహన రాహిత్యాన్ని మరోసారి బయట పెట్టుకున్నారని విమర్శించారు. మేడిగడ్డ పునాదిని బలపరిచేందుకు అన్నిచర్యలు తీసుకున్నామంటూనే అక్కడ మట్టిపరీక్షలు సాధ్యపడలేదని చెప్పడం ఏమిటని ప్రశ్నించారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై రాజకీయ విమర్శలు మాని కాంగ్రెస్ ప్రభుత్వం పంటలకు సాగునీరు అందేలా చూడాలని.. రైతులకు నష్టం కలగకుండా చూడాలని డిమాండ్ చేశారు.

# ములుగు జిల్లాలో రాళ్లవాగును పరిశీలించిన మంత్రి సీతక్క



ములుగు : రాష్ట్ర వ్యాప్తంగా కురుస్తున్న భారీ వర్షాలకు వాగులు, వంకలు పొంగిపొర్లుతున్నాయి. ప్రాజెక్ట్‌లు జలకళలను సంతరించుకుంటున్నాయి. వరద నీటి తీవ్రతకు పలుచోట్ల రహదారులు కొట్టుకుపోయాయి. విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. కాగా, ములుగు జిల్లాలో కురిసిన వర్షాలకు రాళ్లవాగు ప్రవాహానికి బండారు పల్లి వద్ద రహదారి కొట్టుకు పోయింది. విషయం తెలుసుకున్న రాష్ట్ర పంచాయితీ రాజ్, గ్రామీణాభివృద్ధి, స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క, జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్.తో కలసి పరిశీలించారు. ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. వర్షాలు పడుతున్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఎలాంటి విపత్తునైనా ఎదుర్కోనేం దుకు సిద్ధంగా ఉన్నామని చెప్పారు. మంత్రి వెంట స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ పి. శ్రీజ, ఆర్ అండ్ బీ డీఈ. రఘువీర్, తహసిల్దార్, ఎంపీడీవో తదితరులు పాల్గొన్నారు.

# కవిత బెయిల్‌పై విచారణ వాయిదా.. ఇప్పట్లో కష్టమేనా..!?

న్యూఢిల్లీ, జూలై 22: ఢిల్లీ లిక్కర్ స్కామ్ సీబీఐ కేసులో బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవితకు డిఫాల్ట్ బెయిల్‌పై విచారణ మరోసారి వాయిదా పడింది. సోమవారం కవిత బెయిల్ పిటిషన్‌పై ఢిల్లీ రౌస్ అవెన్యూ కోర్టులో విచారణకు రాగా... ఆగస్టు 5కు కోర్టు వాయిదా వేసింది. నిర్దేశిత 60 రోజుల గడువులో పూర్తి స్థాయి ఛార్జ్‌షీట్‌ను దాఖలు చేయడంలో సీబీఐ విఫలం అయ్యిందని జూలై 8న కవిత తరపు న్యాయవాదులు పిటిషన్ వేసి వాదనలు వినిపించారు. సీబీఐ కవితను 2024 ఏప్రిల్ 11న అక్రమంగా అరెస్టు చేసిందని కోర్టుకు తెలిపారు.

జూన్ 7న సీబీఐ అసంపూర్తి ఛార్జ్ షీట్ దాఖలు చేసిందని కవిత తరపు న్యాయవాదులు కోర్టుకు వెల్లడించారు. సీబీఐ చార్జ్‌షీటులో తప్పులు ఉన్నాయని కోర్టు కూడా పేర్కొంది. సీఆర్పీసీ167(2) ప్రకారం కవిత డిఫాల్ట్ బెయిల్ పొందే హక్కు ఉందని... ఏడు ఏళ్ళ శిక్ష పడే కేసులో 60 రోజుల వరకు మాత్రమే కస్టడీకి అవకాశం ఉందని... తాము డిఫాల్ట్ బెయిల్ పిటిషన్ దాఖలు చేసిన జూలై 6 తేదీ నాటికి కవిత 86 రోజుల కస్టడీ పూర్తి అయ్యిందని ఢిల్లీ కోర్టులో కవిత తరపు న్యాయవాదులు గతంలో వాదనలు వినిపించారు. ఈరోజు మరోసారి పిటిషన్‌పై విచారణకు రాగా.. కోర్టు ఆగస్టు 5కు వాయిదా వేసింది. కాగా.. ఢిల్లీ లిక్కర్ స్కాంలో అరెస్ట్ అయిన కవిత దాదాపు నాలుగు నెలలుగా తీహార్ జైలులోనే ఉన్నారు. ఢిల్లీ లిక్కర్ స్కాం కేసులో కేసులు నమోదు చేసిన సీబీఐ, ఈడీ... కవితను అదుపులోకి తీసుకున్నాయి. అయితే కవిత అరెస్ట్ నాటి నుంచి బెయిల్ కోసం తీవ్రంగా శ్రమిస్తున్నారు. అనేక మార్లు బెయిల్ మంజూరు చేయాలంటూ ఢిల్లీ రౌజ్ అవెన్యూ కోర్టులో కవిత తరపు న్యాయవాదులు పిటిషన్ వేయడం... అందుకు కోర్టు ధిక్కరచడం షరా మామూలుగా మారింది. దీంతో గత కొద్ది నెలలుగా కవిత జైలు జీవితాన్ని గడుపుతూ వస్తున్నారు. తాజాగా కవిత తరపున లాయర్లు కీలకమైన అంశాన్ని బెయిల్ పిటిషన్‌లో పొందుపరుస్తూ డిఫాల్ట్ బెయిల్ మంజూరు చేయాలని కోరారు. నిర్దేశిత 60 రోజుల గడువులో పూర్తి స్థాయి ఛార్జ్‌షీట్‌ను దాఖలు చేయడంలో సీబీఐ విఫలం అయ్యిందంటూ కవిత తరపు న్యాయవాదులు కోర్టులో పిటిషన్ వేశారు. పిటిషన్‌ను విచారించిన ఢిల్లీ కోర్టు మరోసారి వాయిదా వేసింది. దీంతో మరికొంత కాలం కవిత జైలులోనే ఉండాల్సిన పరిస్థితి ఏర్పడింది.

Printed, Published and owned by VISHWANATH V, Printed at S A Printers D No 3 92 Shed No 2, Sy No 45 and 49, Sadashiv Nagar Narapally Village, Ghatkesar Mandal, Medchal - Malkajgiri District, Telangana - 501301. and Published from D.No. 5-87, Near Gandhi Statue, Aliyabad, Shamirpet (M) - 500 078, Medchal-Malkajgiri District, Telangana State.
Editor : VISHWANATH V, Rni Title Code No. TELTEL02115, Phone No. 8977598262, Email Id : reportervishwanath@gmail.com